
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


2027 'గగన్‌యాన్' కోసం... మొదటి మానవరహిత మిషన్ రెడీ

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా.. సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం

సునేత్ర ప్రమాణస్వీకారం నాకు తెలియదు : శరద్ పవార్ 05


సంపుటి 09, సంచిక: 64 | ఆదివారం | 01-02-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# బడ్జెట్ దిశ ఎటు?



## అభివృద్ధి వర్సెస్ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు!

### నేడు పార్లమెంటులో 9వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** దేశంలోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, రాజకీయ ఉద్రిక్తతల నడుమ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టనున్న 2026–27 వార్షిక బడ్జెట్‌లో ఉండబోయే అంశాలపై ఉత్కంఠ నెలకొంది. బడ్జెట్ అభివృద్ధి పథంలో బలమైన అడుగులు వేయడానికి అనువుగా ఉంటుందా లేక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాల ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడంతోనే సరిపుచ్చుతారా? అన్నది బిలియన్ డాలర్ల ప్రశ్న. స్వతంత్ర భారత చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఆదివారం ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్, అంతటి ప్రత్యేకతను సంతరించుకుంటుందా అన్నది చూడాలి. ఉపాధి నుంచి ధరల సూచీ నిలకడలేకుండా పైపైకి ఎగబాకడం వరకు ఎన్నో అంశాలను బడ్జెట్ ప్రతిబింబించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, జీవన ప్రమాణాల మెరుగు వంటి అంశాలు ప్రభుత్వం తీసుకునే ఆర్థిక విధాన నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆదాయపు పన్ను, జిఎస్‌టి కోతలు, మౌలిక వసతులపై భారీ వ్యయం, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి చర్యలు భారత ఆర్థిక వ్యవస్థకు కొంత ఊపునిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్‌ల వంటి సమస్యల నుంచి అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు లేదా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య భారతర్థిక వ్యవస్థ తట్టుకొని నిలబడడానికి ఈ చర్యలు కొంత వరకూ ఊతమిచ్చాయి. కానీ, ఇవన్నీ తాత్కాలిక సహాయక చర్యలే తప్ప, దీర్ఘకాలిక వృద్ధికి కొత్త వేగాన్ని అందించలేకపోయాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థే అనిశ్చితితో కుదేలవుతున్న వేళ, భారతదేశం తన వృద్ధిని అంతర్గతంగా నిలబెట్టుకోవాల్సిన అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో, ఈ బడ్జెట్ వినియోగం, పెట్టుబడులు, ఉత్పాదకత అనే మూడు అంశాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లే విధంగా ఉండాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటికే ఫిస్కల్ లోటును స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో తగ్గించే మార్గంలో నడుస్తోంది. కానీ, పన్ను కోతల వల్ల ఆదాయ వనరులు క్షీణించడం ఈ ప్రయాణాన్ని క్లిష్టతరం చేసింది. జిఎస్‌టి రేట్ల సరళీకరణ, నేరుగా పన్నుల్లో ఉపశమనాలు ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెంచాయి. ఒకవైపు వృద్ధికి ఊతమిచ్చేందుకు వ్యయం పెంచాల్సిన అవసరం, మరోవైపు లోటును అదుపులో ఉంచాల్సిన బాధ్యత.. ఈ రెండు మధ్య సమతుల్యత సాధించడం ఆర్థిక మంత్రికి అత్యంత కఠినమైన పని. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఖర్చులను కత్తిరించకుండా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఉత్పాదక వ్యయం, వ్యర్థ వ్యయం మధ్య స్పష్టమైన తేడా చూపించగలిగితేనే ఫిస్కల్ క్రమశిక్షణతో కూడిన వృద్ధి సాధ్యమవుతుంది. ఇటీవల కాలంలో ద్రవ్యోల్బణం కొంత తగ్గినప్పటికీ, సామాన్య మధ్యతరగతి, గ్రామీణ వినియోగంలో మాంద్యం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. ఉపాధి అవకాశాలు తగినంతగా పెరగకపోవడం, వాస్తవ ఆదాయాలపై ఒత్తిడి కొనసాగడం వినియోగాన్ని నిరోధిస్తున్నాయి. ఈ పరిస్థితిలో బడ్జెట్ కేవలం పన్ను ఉపశమనాలకే పరిమితం కాకుండా, ఉపాధి సృష్టి ద్వారా ఆదాయ భద్రతను పెంచే దిశగా తరువాయి 2లో



## వ్యాపారిపై కాల్పులు

- రూ.6 లక్షలు దోపిడీ..
- హైదరాబాద్ నడిబొడ్డున ఘటన అప్రమత్తమైన పోలీసులు
- రంగంలోకి ప్రత్యేక బృందాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నడిబొడ్డు కోఠిలోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద ఎటిఎంలో డబ్బులు జమ చేసేందుకు వచ్చిన బట్టల వ్యాపారిపై అంగతకులు కాల్పులు జరిపి అతని వద్ద ఉన్న రూ.6 లక్షల నగదు దోచుకెళ్లిన సంఘటన శనివారం ఉదయం తరువాయి 12లో

## ఈసారి వక్తగా రండి..
# సిఎంకు ఆహ్వానం

- 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) పాలసీ సింపోజియం'కు వక్తగా హాజరుకావాలని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ విజ్ఞప్తి
- భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక నేత రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ (హెచ్‌కెఎస్) తొలిసారిగా నిర్వహించనున్న ''ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) పాలసీ సింపోజియం'' కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ప్రధాన వక్తగా ఆహ్వానించింది. ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సుకు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక నాయకుడిగా సిఎం రేవంత్ రెడ్డి నిలిచారు. వచ్చే మార్చి నెలలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ డీన్ జెరెమీ వైన్‌స్టీన్ తో కలిసి సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తరువాయి 2లో




## రైలు కింద పడి
# ముగ్గురు ఆత్మహత్య

- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారే
- చర్లపల్లి – ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఘటన

ప్రజాపక్షం/చర్లపల్లి

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైలు కింద పడి ఆత్మ హత్య చేసుకున్న విషాద ఘటన చర్లపల్లి–ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జిఆర్‌పి సిఐ సాయిఈశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల తరువాయి 2లో

# విచారణకు హాజరవుతా



## సిట్ అధికారులకు మాజీ సిఎం కెసిఆర్ లేఖ

- రెండోసారి నోటీసుపై తీవ్ర అభ్యంతరం
- చట్టప్రకారం ఇవ్వలేదని ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారుల విచారణకు ఆదివారం నందినగర్‌లోని తన నివాసంలో హాజరవుతానని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సిట్ అధికారులకు లేఖ పంపారు. అయితే సిట్ అధికారులు రెండోసారి ఇచ్చిన నోటీసులపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు. నాకు ఇచ్చిన నోటీసు అక్రమం. నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు. ఇంటి గోడలకు నోటీసులు అంటించడం ఏంటి. ఇది సరైన పద్ధతి కాదు. చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నా విచారణకు సహకరిస్తా. రేపు నందినగర్ నివాసంలో విచారణకు హాజరవుతా అని లేఖలో కెసిఆర్ పేర్కొన్నారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని ఈ సందర్భంగా సిట్ అధికారులకు కెసిఆర్ స్పష్టం చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎసిపికి తనను విచారించే అధికార పరిధి లేదని లేఖలో కెసిఆర్ పేర్కొన్నారు. 'నోటీసుల జారీలో సుప్రీంకోర్టు తరువాయి 2లో

# అత్యధిక స్థానాలే లక్ష్యం

- మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలి
- పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం





ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను విజయం సాధించేలా వ్యూహ రచనలు చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన నేతలతో జూమ్ సమావేశం నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు,డిసిసి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్న తరువాయి 2లో

## కాంగోలో కుప్పకూలిన గని

- 227 మంది కార్మికులు మృత్యువాత
- మరో ఏడుగురికి గాయాలు
- బురదలో కూరుకుపోయిన మరికొందరు?

**గోమా:** ఆఫ్రికా డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో తూర్పు ప్రాంతంలో ఉన్న అత్యంత అమూల్యమైన కాల్టన్ ఖనిజాలున్న రుబయా గనులు కుప్పకూలడంతో 227 మందిపైగా కార్మికులు మరణించారు. ఈ మృతులసంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎలాంటి రక్షణలూలేని ఈ గనుల చరియలు బుధవారంనాడే కుప్పకూలిన ఘటన గురించి ఉత్తర కిము రాష్ట్రంలో తిరుగుబాటువర్గాలకు చెందిన గవర్నర్ నియమించిన అధికార ప్రతినిధి లుబుంబా కంబేర్ ముయిసా శనివారం చెప్పారు. ఈ ఈ ఘటనలో మరో ఏడుగురు గాయపడ్డారు. విషయం తరువాయి 12లో

## అడవితల్లుల
# వనప్రవేశం

- ప్రశాంతంగా ముగిసిన మేడారం జాతర
- తిరుగు ప్రయాణమైన భక్తులు
- మేడారం-పస్రా దారిలో భారీగా ట్రాఫిక్ జామ్





ప్రజాపక్షం/మేడారం /హనుమకొండ

నాలుగు రోజు పాటు ఉద్విగ్న భరితంగా సాగిన మేడరం సమ్మక్క సారలమ్మ మహాజాతర జాతర శనివారం తల్లుల వన ప్రవేశంతో ఘనంగా ముగిసింది. శనివారం సాయంత్రం సమ్మక్కను చిలకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి సాగనంపారు. సల్లంగ జూడు తల్లీ.. వెళ్లొస్తాం రెండేళ్లకు మళ్లీ.. అంటూ భక్తులు చివరి మొక్కులు మొక్కుకున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా అధికారుల సమక్షంలో అమ్మవార్లను వనప్రవేశం చేసే ఘట్టాన్ని పూర్తి చేశారు. జాతర నాలుగో రోజూ కూడా భారీగా లక్షలాది మంది తరలి వస్తుండడంతో మేడారం పరిసరాలన్నీ కిక్కిరిసి పోయాయి. జాతరలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనంతో రోజంతా కిటకిటలాడింది. కాగా శనివారం చివరి రూజు కూడ పలువురు వీఐపిలు సమ్మక సారలమ్మలనుదర్శనం చేసుకున్నారు. పలువురు రాష్ట్ర హైకోర్టు జడ్జీలు, డిఐజి తదితర అధికారులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. రాత్రి వరకూ దర్శనాల కోసం భక్తులు క్యూలో నిలబడ్డారు. ఇప్పటి వరకు ఒక కోటి 15 లక్షల మంది భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక సమీప దక్షిణాది రాష్ట్రాల నుండి తరలి వచ్చినట్లు మేడారం జాతరను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం నాటికి మరో 5 లక్షల మంది భక్తులు తరలి రానున్నారన్న అంచనాలు వేశారు. దీంతో ఈసారి దాదాపుగా కోటికి పైగా మంది ప్రజలు తరలి వచ్చారని బావిస్తున్నారు. భక్తుల రద్దీ తగ్గితే ఆంక్షలను తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**జాతరలో నరకయాతన ; గంటల తరబడి జర్నీ**

తెలంగాణ కుంభమేళా, మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సర్కారు తరువాయి 12లో

## రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు
# రేపు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం





- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేయనున్నట్లు తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రకటన
- ''భారత రాజ్యాంగం-భావప్రకటన స్వేచ్ఛ'' అనే అంశంపై స్మారకోపన్యాసం చేయనున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డును 2025 సంవత్సరానికి గానూ దేశంలోఅనేక చారిత్రాత్మక తీర్పులను వెల్లువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప రెడ్డి ప్రకటించారు. అవార్డు ప్రదానోత్సవం ఫిబ్రవరి 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యాలయం రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, తరువాయి 12లో

## జిహెచ్‌ఎంసి బడ్జెట్
# రూ.11,460 కోట్లు

- ఆమోదించిన పాలకమండలి
- మొక్కుబడిగా బడ్జెట్ సమావేశం
- బడ్జెట్‌పై సభ్యుల సందేహాలను నివృత్తి చేయని అధికారులు
- వాస్తవాలకు విరుద్ధంగా బడ్జెట్ : ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్
- అంకెల గారడీ : కార్పొరేటర్ శ్రవణ్





02

# ఇజ్రాయెల్ భారీ దాడి: 30మంది మృతి

## నేడు రఫా క్రాసింగ్ పునఃప్రారంభం

**గాజా :** గాజాపై ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగింది. శనివారం తెల్లవారుజాము నుండీ గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్‌లోని తాత్కాలిక గుడారాలపైన, గాజా వ్యాప్తంగా జరిపిన ఈ దాడుల్లో ఆరుగురు పిల్లలతో సహా 30 మంది పాలస్తీనియన్లు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబరు 10వ తేదీన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ సైన్యం చేసిన అతిపెద్ద దాడి ఇదే. గుడారాలపై దాడులతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి, ఒకే కుటుంబంలో తండ్రి, ముగ్గురు పిల్లలు, మనుమలు మరణించారనీ నజీర్ ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. అదేవిధంగా షిఫా ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం, గాజా సిటీలోని అపార్ట్‌మెంట్ భవంతులపై జరిగిన



దాడుల్లో ముగ్గురు పిల్లలు మరణించారు. పోలీస్ స్టేషన్‌పై జరిపిన దాడిల్లో నలుగురు పోలీసులు సహా 11 మంది మరణించారు. రఫా క్రాసింగ్‌ను గాజాలోకి రాకపోకలకు వీలుగా పునఃప్రారంభించేందుకు రంగం సిద్ధమైన ఒకరోజు ముందు ఈ దాడులు జరిగాయి.

ఈజిప్టు నుండి గాజాలోని నేరుగా వాహనాల రాకపోకలకు వీలుగా, సహాయాన్ని భారీ ఎత్తున తరలించేందుకు అవకాశం ఉన్న అతిపెద్ద అకాశమార్గమైన రఫా క్రాసింగ్‌ను 2024 మే నెలలోనే ఇజ్రాయెల్ సైన్యం మూసివేసింది. ఇప్పటివరకూ కొన్ని వందలసార్లు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని హమాస్ అనేకసార్లు ఆరోపణలు చేస్తూ వచ్చింది. గత ఏడాది అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత నుండీ ఇజ్రాయెల్ సైన్య ం అనేక వంకలుపెడుతూ పాలస్తీనియన్లపై దాడులు చేసి హత మారుస్తూనే ఉంది. ఈ విధంగా 110 రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 509 మంది పాలస్తీనియన్లు బలయ్యారు. 2023 అక్టోబరు ఏడో తేదీన దాడుల పరంపర ప్రారంభమైన తర్వాత నుండి ఇప్పటివరకూ 72,000 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. మరో 1.72 లక్షలమంది గాయపడ్డారు. దాదాపు 10,000 మంది పైగా గాజాలో పేరుకుపోయిన శిథిల్లాల్లో కూరుకుపోయి విగతజీవులయ్యారు.

# న్యాయబద్ధమైన చర్చలకు సిద్ధం:ఇరాన్

**టెహ్రాన్ :** ఏ క్షణంలోనైనా యుద్ధ జ్వాలలు చెలరేగే పరిస్థితులు నెలకున్న పశ్చిమ ఆసియాలో నెలకున్న తరుణంలో న్యాయబద్ధమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఐతే ఈ చర్చలు న్యాయబద్ధంగా ఉండాలని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ ఆరాఘ్చి అన్నారు. అదేసమయంలో ట్రంప్ కూడా పాత్రికేయులతో శనివారం మాట్లాడుతూ, ఇరాన్ చర్చలకు సుముఖంగా ఉందని ప్రకటించారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే యుద్ధాన్ని ఎదుర్కొవాలని గడచిన కొద్ది రోజులుగా ట్రంప్ తన బెదిరింపులను తీవ్రతరం చేశారు. యుద్ధం వస్తే దీటుగా ప్రతిఘటించేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇరాన్ కూడా ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేసినప్పటికీ ఐక్యరాజ్యసమితికి కూడా ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించమని కోరింది. న్యాయబద్ధమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఆరాఘ్చి ప్రకటించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఐదు విడతలుగా అమెరికా–ఇరాన్ మధ్య అణు చర్చలు కొనసాగినప్పటికీ ఫలించలేదు. కాగా ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కూడా ప్రభుత్వ టెలివిజన్‌లో జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇరాన్‌లో గత ఏడాది డిసెంబరు 28 నుండి 18 రోజులపాటు కొనసాగిన అల్లర్లను అమెరికా,ఇజ్రాయెల్,యూరోపియన్ యూనియన్‌లే రెచ్చగొట్టాయని విమర్శించారు. తమదేశంలో హింసాత్మక అల్లర్లను రెచ్చగొట్టడం ద్వారా ఉద్రిక్తతలు సృష్టించాయని విమర్శించారు. ''అనేకమంది అమాయకులైన ప్రజలు ఆయుధాలు సమకూర్చుకుని వీధుల్లోకి వచ్చేలా చేశారు, ప్రజలమధ్య తగాదాలు,ద్వేషం సృష్టించి దేశాన్ని విభజించడానికి ప్రయత్నం చేశారు'' అని విమర్శించారని అధికారిక స్టూడెంట్ న్యూస్‌నెట్‌వర్క్ ప్రకటించింది.

# అమెరికా ఆంక్షలకు క్యూబా తిరస్కృతి

## చైనా సహా పలు దేశాల మద్దతు

**హవానా :** క్యూబాపై అమెరికా విధించిన తాజా ఆంక్షలను క్యూబా కమ్యూనిస్టుపార్టీ మొదటి కార్యదర్శి, ఆ దేశ అధ్యక్షుడు మిగ్యుల్ డయాజ్ కానెల్ తిరస్కరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తమ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకుంటామన్నారు. క్యూబాను అస్థిరీకరించేందుకు ఈ ఆంక్షలను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈనెల 29వ తేదీన ట్రంప్ వైట్‌హౌస్ నుండి క్యూబాపై అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇప్పటికే క్యూబా ఆరు దశాబ్దాలుగా ఆంక్షల నిర్బంధంలో ఉంది. క్యూబా వల్ల అమెరికా జాతీయ భద్రతకు ముప్పు ఉందని, అంతర్జాతీయ ఉగ్రవాద గ్రూపులు, దుష్టశక్తులతో క్యూబా సంబంధాలు కొనసాగిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ట్రంప్ సంతకం చేసిన ఉత్తర్వులు శుక్రవారం నుండి అమలులోకి వచ్చాయని క్యూబా అధికార పత్రిక ప్రకటించింది. వెనిజులాపై దాడి తర్వాత క్యూబాకు తీవ్ర సరఫరా సమస్యలు ఎదురయ్యాయి. అమెరికా విధించిన కొత్త ఆంక్షలను వ్యతిరేకిస్తూ చైనా సహా పలు దేశాలు క్యూబాకు మద్దతు ఇచ్చాయి. చైనా విదేశాంగమంత్రి గువో జియాకున్ బీజింగ్‌లో రోజువారీ పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించారు. క్యూబాపై ఆంక్షలు తక్షణం ఎత్తివేయాలని కోరారు. క్యూబా ప్రజలు తమ దేశాన్ని అభివృద్ధిచేసుకునే హక్కులను అమెరికా హరిస్తోందని విమర్శించారు. లాటిన్ అమెరికాలో శాంతి స్థిరత్వానికి విఘాతం కలగకుండా అటంకాలను తొలగించాలని ఆయన కోరారు. వాషింగ్టన్ అనుసరిస్తున్న బలవంతపు విధానాలవల్ల క్యూబాకు ఈ పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా ఎలాంటి ఆటంకాలు, సమస్యలు సృష్టించినాగానీ వాటిని అధిగమించగల శక్తిసామర్థ్యాలు, ఐక్యత క్యూబా ప్రజలకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. టంప్ మరోసారి అబద్ధాల ప్రచారానికి తెర తీశారని, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే పేరుతో సామూహిక ఆర్థిక ఊచకోతకు పాల్పడుతోందని క్యూబా విశ్లేషకులు విమర్శించారు. ఉగ్రవాదులతో క్యూబా చేతులు కలపలేదని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థలకు బాసటగాలేదని అమెరికాకు తెలుసునని, అనేక దశాబ్దాలుగా క్యూబాను లొంగతీసుకునేందుకు ఇదే నాటకం కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.




# చైనాతో వ్యాపారం చేయకపోవడమే మూర్ఖత్వం



## ట్రంప్‌కు కీర్ స్టార్మర్ చురక

**లండన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శలు,హెచ్చరికలమధ్య బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మూడు రోజుల చైనా పర్యటన విజయవంతంగా ముగిసింది. షాంఘై పర్యటన తర్వాత ఆయన లండన్‌కు తిరిగి చేరుకున్నారు. చైనాతో వ్యాపారం అత్యంత ప్రమాదకరమని ట్రంప్ చేసిన ఆరోపణలు,హెచ్చరికలను స్టార్మర్ కొట్టిపారేశారు. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాతో వ్యాపారం ప్రమాదకరం అని ట్రంప్ చెప్పగా, అంతపెద్ద ఆర్థిక వ్యవస్థతో వ్యాపారం చేయకపోవడమే పెద్ద మూర్ఖత్వమని స్టార్మర్ అన్నారు. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై చైనాతో చర్చిస్తే 100 శాతం సుంకాలు విధిస్తానని కెనడా ప్రధానమంత్రికి ట్రంప్ చేసిన హెచ్చరికను పదే పదే ఆయన ప్రస్తావిస్తున్నారని స్టార్మర్ విమర్శించారు. రెండు బిలియన్ డాలర్ల ఎగుమతులను, పెట్టుబడులను తన పర్యటన సాధించిందన్నారు. చైనాలో తన పర్యటన వాస్తవ ప్రాతిపదికపై చూసినప్పుడు విజయవంతంగా ముగిసిందని అన్నారు. అంతకంటే ముఖ్యంగా చైనా మార్కెట్లను అనుసంధానం చేసుకున్నామన్నారు. చైనా ప్రపంచంలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అనీ, హాంగ్‌కాంగ్‌ను కూడా కలుపుకుని చూసినప్పుడు కూడా ఒక నిప్పుకోడి తరహాలో తలను తలక్రిందులుగా ఇసుకలో దూర్చుకుని కూర్చోవడం, మనం వారితో వ్యాపారం చేయకుండా దూరంగా ఉండిపోవడం మూర్ఖత్వమే అవుతుందని అన్నారు. ట్రంప్‌తో ఇటీవలికాలంలో స్టార్మర్ విభేదిస్తూ వస్తున్నారు. మొదట గ్రీన్‌లాండ్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడంపై విభేదించారు. రెండోసారి ఆఫ్ఘనిస్థాన్‌లో నాటో కూటమి దళాలు ముందుపీఠిన నిలబడిన పోరాడకుండా తప్పించుకున్నాయని ట్రంప్ చేసిన ఆరోపణలను వ్యతిరేకించారు. ఆ తర్వాత చైనా పర్యటన విషయంలో కూడా ట్రంప్ అభిప్రాయాలతో స్టార్మర్ ఏకీభవించకుండా విభేదించారు.

# అమెరికాకు మళ్లీ షట్‌డౌన్ సమస్య

**వాషింగ్టన్ :** అమెరికాను మళ్లీ షట్‌డౌన్ సమస్య వెంటాడుతున్నది. సోమవారం సెనేట్ సమావేశంలో ఆర్థిక బిల్లులను గనుక ఆమోదించకపోతే మళ్లీ అమెరికాలోని అనేక ప్రభుత్వ విభాగాలు షట్‌డౌన్‌లోకి వెళ్లే ప్రమాదం వచ్చింది. ఇంతకు ముందు ఆర్థిక కేటాయింపులకు గడువు అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్థరాత్రితో పూర్తి కావడంతో పాక్షికంగా షట్‌డౌన్ ప్రారంభమైంది. సోమవారం సమావేశంలో బిల్లులు ఆమోదం పొందకపోతే మళ్లీ సమస్య ముదిరిపాకాన పడుతుంది. ఐతే దేశంలో ట్రంప్ పట్ల ఉన్న వ్యతిరేకత, వలస విధానంలో లోపాలు,ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, ముఖ్యంగా మిన్నెపొలిస్‌లో ఐసిఇ ఏజెంట్ల చేతుల్లో ఇద్దరు హత్యకు గురికావడం ఈ నేపథ్యంలో సెనేటర్లు ప్రధానాంశంగా ముందుకు తెచ్చారు. ఈ హత్యల విషయంలో దర్యాప్తు నిష్పాక్షికంగా జరగాలని, విధాన మార్పులుండాలని కొందరు డెమోక్రటిక్ సెనేటర్లు హెచ్చరిస్తున్నారు. లేకపోతే వారు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. దీనివల్ల మళ్లీ ముఖ్యమైన హోం,భద్రతా విభాగాలు, ఇతర అత్యవసరంలేని విభాగాల ఉద్యోగులు వేతనం లేని సెలవులతో ఇళ్లల్లో కూర్చోవలసి వస్తుంది. గత ఏడాది అక్టోబరులో కూడా అమెరికా చరిత్రలో ఎన్నడూలేని రీతిలో షట్‌డౌన్ కుదిపేసి ట్రంప్ ప్రభుత్వ అసమర్థతకు తార్కాణంగా నిలిచింది. అమెరికాలో ఎన్నడూలేనివిధంగా 43 రోజులు సుదీర్ఘకాలం షట్‌డౌన్ కొనసాగింది. ట్రంప్ వైఖరి కారణంగా అధికార, ప్రతిపక్షాలమధ్య ఒక ఒప్పందం కుదరలేదు.

**వలస సమస్యపై అమెరికావ్యాప్తంగా ప్రదర్శనలు**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాన్ని ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్కూళ్లు, దుకాణాలు మూతపడ్డాయి. ప్రధానంగా హ్యూస్టన్, బోస్టన్‌లలోని పలు ప్రాంతాలలో ఐసిఇకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల్లో వందలమంది పాల్గొన్నారు. మిన్నెపొలిస్‌లో కూడా గడచిన 20 రోజులుగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రముఖ రాజకీయ నేతలు, సెనేటర్లు, మేధావులు, మానవహక్కుల సంఘాలు మిన్నెపొలిస్‌లో ఐసిఇ ఏజెంట్లు చేసిన రెండు హత్యలను తీవ్రంగా పరిగణిస్తూ ఉండటంతో ట్రంప్ కూడా దిగివచ్చారు. ఈ ఘటన అత్యంత విషాదకరమైనదని ఆయన అన్నారు. ఐసిఇ అధికారుల చర్యలపై భిన్న కథనాలు వినిపిస్తూ ఉండటంతో దర్యాప్తును ముమ్మరం చేశారు. నిరాయుధుడైన అమెరికన్ పౌరుడు, వృద్ధాశ్రమంలో నర్సుగా పనిచేస్తున్న అలెక్స్ ప్రెట్టీ హత్య అమెరికన్లను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది. రోజులు గడుస్తున్నప్పటికీ సమస్య మరపు లేకుండా వారిని కుదిపేస్తోంది.

## విచారణకు హాజరవుతా (మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారన్నారు.. ఎన్నికల అఫిడవిట్లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదన్నారు. ప్రస్తుతం నివసిస్తున్న చోటే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోందన్నారు. హరీష్ రావు నోటీసుల విషయంలో పోలీసులు డబుల్ స్టాండరడ్స్ పాటిస్తున్నారన్నారు. 'పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తా. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధం. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటా. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చు. కానీ నేను ఆపని చేయడం లేదు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచన చేస్తున్నాను. పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయి' అని లేఖలో కేసీఆర్ ఆవేదన చెందారు. అంతేకాదు.. ఏపీ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు.

**నందినగర్‌లోనే విచారణ..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం విచారణకు కెసిఆర్ హజరవుతారని తెలపడంతో నందినగర్‌ను పోలీసులు దిగ్బంధం చేశారు. కెసిఆర్ నివాసానికి కిలో మీటర్ దూరం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తారనే సమాచారం మేరకు పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ముగ్గురు ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

ప్రకారం బోడుప్పల్ హరితరణం కాలనీకి చెందిన విజయశాంతిరెడ్డి(38)కు మార్తె చేతనరెడ్డి, కుమారుడు విశాల్‌రెడ్డిలు చర్లపల్లిఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య 206/48 కిలోమీటర్ బోర్డు వద్ద 12.30 గంటలకు రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందారని గూడ్స్‌రైలు లోకో పైలట్ వాకీటాకీ ద్వారా రైల్వే స్టేషన్ మాస్టర్ సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిఆర్‌పి సిఐ సాయిఈశ్వర్‌గౌడ్, ఎస్‌మాధవ్, ఏఎస్ఐ బిఎస్‌రావులు సంఘటన స్థలానికి చేకుకుని పరిశీలించి మృత దేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు విజయశాంతిరెడ్డి సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం చేస్తుంది. కుమార్తె ఇంటర్ సెకండ్ ఇయర్, కుమారుడు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.10 గంటలకు రైల్వే స్టేషన్‌లో కారు(టిఎస్ 08 జెసి 5224)పార్కింగ్ చేసి స్టేషన్ ప్లాట్‌ఫ్లారంపై 11.20 గంటలకు నడుచుకుంటు వెళ్లి 12 గంటలకు రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందారు. 194 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్థానాలే లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో పార్టీ వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం , ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధికి సంబంధించిన ప్రచారం తదితర కీలక అంశాలపై చర్చించారు. నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో ఇకా ప్రచారంపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని, ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా నామినేషన్ల దాఖలు చేసిన అసంతృప్తి నాయకులను బుజ్జగించడంతో పాటు బలమైన అభ్యర్థులు బరిలో ఉండేలా చూడాలన్నారు. అత్యధిక స్థానాలను గెలుపోందడమే లక్ష్యంగా పార్టీ నాయకులంతా అందరూ కలిసి కట్టుగా ఏకతాటిగా పని చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనం చేశారు.

## సిఎంకు ఆహ్వానం (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా కీ నోట్ ప్రసంగం ఇవ్వడాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే, కృత్రిమ మేధస్సు (ఎఐ) మౌలిక వసతులు, విధానాలపై ప్రపంచ స్థాయి నేతలు, టెక్ నిపుణులతో జరిగే ప్యానల్ చర్చలలో పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో స్కూల్ ప్రతినిధి రుక్సాండా రెనిటాతో పాటు ఇతర నిర్వాహకులు సిఎం రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా ఆహ్వాన పత్రం అందజేశారు. ఎఐ పాలసీ రూపకల్పనలో ప్రపంచ స్థాయిలో జరుగుతున్న చర్చల్లో తెలంగాణ నాయకత్వానికి లభించిన ఈ ఆహ్వానం రాష్ట్రానికి గర్వకారణమని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# జిహెచ్‌ఎంసి బడ్జెట్ రూ.11,460 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రస్తుత పాలక మండలి చిట్టచివరి బడ్జెట్ సమావేశం జరిగింది. ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనున్న నేపథ్యంలో శనివారం నిర్వహించిన చివరి పాలక మండలి సమావేశం ఉద్వేగభరిత వాతావరణంలో ముగిసింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల అంచనా బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం 11 గంటలకు మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో ఇటీవల అకాల మరణం చెందిన చంపాపేట్ బిజెపి కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డికి సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించింది. ప్రజా సమస్యలపై ఆయన చేసిన సేవలను సభ్యులు గుర్తు చేసుకున్నారు. బడ్జెట్‌పై అన్ని పార్టీల సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వాస్తవాలకు విరుద్ధంగా అంకెల గారడీగా బడ్జెట్ ఉందని ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తీవ్ర స్థాయిలో ఆంక్షేపించారు. వాస్తవాలకు విరుద్ధంగా బడ్జెట్ ఉందని బిఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్ సామల హేమ అన్నారు. అప్పుల్లో కూరుకపోయిన జిహెచ్‌ఎంసికి సిఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించి, అభివృద్ధి పథంలో తీసుకెళ్లుతున్నారని కాంగ్రెస్ ఉప్పల్ కార్పొరేటర్ రజిత రెడ్డి తెలిపారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు సిఎం, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, చివరికి మేయర్ నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కోరారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకుంటామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హామీ ఇవ్వడంతో, మేయర్ పాలకమండలి సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేశారు. సభ్యులు బడ్జెట్‌పై లేవనెత్తిన వివిధ అంశాలకు అధికారులు నిర్దిష్టమైన సమాధానాలు ఇవ్వకుండానే సమావేశం ముగించడం గమనర్హం. దీంతో బడ్జెట్ భేటీ మొక్కుబడి సమావేశంగా ముగిసింది.

**కాంగ్రెస్– బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం**

సమావేశం చివరిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కెసిఆర్ హయాంలో జిహెచ్‌ఎంసి అప్పుల పాలైందని, ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్ రజిత రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. దీనికి బిఆర్ఎస్ సభ్యులు తీవ్రంగా స్పందించడంతో సభలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మేయర్ గద్వాల విజయలక్ష్మి జోక్యంతో ఇరు వర్గాలు శాంతించడంతో సమావేశం తిరిగి కొనసాగింది.

మేయర్ గద్వాల విజయలక్ష్మి భావోద్వేగ ప్రసంగం

ఇది తనకు చివరి కౌన్సిల్ సమావేశమని పేర్కొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మి భావోద్వేగానికి లోనయ్యారు. 'ఇది భావోద్వేగ క్షణం. ఐదేళ్ల పదవీ కాలంలో నగరాభివృద్ధికి అందరం కలిసి పనిచేశాం. ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు సమర్థంగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు కూడా అందుకున్నాం. నా మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరుకుంటున్నాను. పదవి ముగిసినా నా బాధ్యత మరువను. హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను' అని మేయర్ అన్నారు.

**ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ వ్యాఖ్యలు**

రూ.11,460 కోట్ల భారీ బడ్జెట్‌ను ఆమోదించినందుకు మేయర్, కమిషనర్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. 'ఇంత పెద్ద బడ్జెట్ కేటాయించిన తర్వాత నగరంలోని ప్రతి గల్లీలో రోడ్లు, నాలాల శుభ్రత, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కావాలి. బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫలితాలు అందించాలి' అని అన్నారు. గ్రీన్ బడ్జెట్‌లో రూ.590 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించిన ఆయన, నల్లగండ్ల ప్రాంతంలో పెద్ద థీమ్ పార్కుతో పాటు మరో రెండు థీమ్ పార్కుల ప్రతిపాదనను ప్రస్తావించారు. పాలకమండలి ముగిసిన అనంతరం మూడు కార్పొరేషన్‌లుగా జిహెచ్‌ఎంసిని విభజిస్తారనే ప్రచారం జరుగుతుందని, మరి మూడు కార్పొరేషన్‌లకు ఈ బడ్జెట్‌ను ఏవిధంగా విభజిస్తారని ప్రశ్నించారు. 20 సంవత్సరాలుగా ఆస్తిపన్ను పెంచడం లేదని చెప్పుతునే రీవిజన్ పేరుతో భారీ మొత్తంలో ఆస్తిపన్ను పెంచుతున్నారని విమర్శించారు.

### బడ్జెట్ ముఖ్యాంశాలు..

మొత్తం బడ్జెట్ అంచనా: రూ.11,460 కోట్లు
రెవెన్యూ ఆదాయం : రూ.6,441 కోట్లు
క్యాపిటల్ రిసీట్స్ : రూ.5,019 కోట్లు
మొత్తం ఖర్చు : రూ.4,057 కోట్లు
రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు
జిహెచ్‌ఎంసికి రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లు
కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలకు కేటాయింపులు : రూ.2,260 కోట్లు
విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన ఆదాయం : రూ.1,860 కోట్లు
గ్రీన్ బడ్జెట్ కేటాయింపు : రూ.590 కోట్లు
భూసేకరణకు : రూ.250 కోట్లు
ఇళ్ల నిర్మాణానికి : రూ.100 కోట్లు.

**విలీన మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై స్పష్టత ఇవ్వాలి : బిజెపి కార్పొరేటర్ శ్రవణ్**

జిహెచ్‌ఎంసి బడ్జెట్ మొత్తం అంకెల గారడీగా ఉందని బిజెపి కార్పొరేటర్ శ్రవణ్ విమర్శించారు. 27 అర్బన్ స్థానిక సంస్థలను విలీనానికి సంబంధించిన అప్పులు, వడ్డీ రేట్లు, ఆదాయ, వ్యయాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. విలీన మున్సిపాలిటీల ఉద్యోగుల జీతాల విషయంలో సమాన విధానం పాటించాలన్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కమర్షియల్ ప్రాపర్టీలు, రెంటల్ ఆదాయంపై పన్నుల వసూలు పెంచాలని సూచించారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన ఈ బడ్జెట్‌లో నగరాభివృద్ధి, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు.

## దిశ ఎటు?
(మొదటి పేజీ తరువాయి)

అడుగులు వేయాలి. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో డబ్బు ఉండాలి. అది స్థిరమైన ఉపాధి ద్వారానే సాధ్యం.యువత ఎక్కువగా ఉన్న మన దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ పరిశ్రమలు, సేవల రంగం ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నాయి. ఈ బడ్జెట్‌లో కార్మిక ఆధారిత తయారీ రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పిఎల్ఐ) వంటి పథకాలను కేవలం ఉత్పత్తి పరిమాణంతో కాకుండా, ఉద్యోగ సృష్టి ప్రమాణాలతో అనుసంధానం చేయడం ఒక కీలక సంస్కరణగా నిలుస్తుంది. అలాగే నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలకు మరింత నిధులు కేటాయించడం ద్వారా యువతను ఉపాధికి సిద్ధం చేయాలి. కాగా, దేశ ఉపాధిలో పెద్ద వాటా ఈ రంగానిదే. కానీ అధిక ముడి సరుకు ధరలు, రుణాల లభ్యత లోపం, అంతర్జాతీయ పోటీ వంటి కారణాలతో ఈ రంగం ఒత్తిడిలో ఉంది. ఈ బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీ పథకాలను విస్తరించడం, సులభమైన నిబంధనలతో రుణాలు అందించడం అత్యవసరం. కేవలం పెద్ద పెద్ద కార్పొరేట్లపై ఆధారపడే వృద్ధి నమూనా సామాజికంగా, ఆర్థికంగా స్థిరంగా ఉండదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలే విస్తృత ఉపాధిని అందించగలవు. ఇక, అమెరికాతో వాణిజ్య చర్చలపై ఉన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, రూపాయి చరిత్రలో కనిష్ట స్థాయికి చేరడం తదితర అంశాలన్నీ భారత ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. భారతదేశం విధాన స్థిరత్వాన్ని, సంస్కరణల నిరంతరతను వదలదని ఈ బడ్జెట్ మార్కెట్లకు, పెట్టుబడిదారులకు ఒక స్పష్టమైన సంకేతం ఇవ్వాలి. పన్ను విధానంలో ఆకస్మిక మార్పులు కాకుండా, నియంత్రణ సరళీకరణ, వ్యాపార వాతావరణ మెరుగుదల ద్వారా పెట్టుబడిదారుల నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది.ఆదాయ వనరుల సమీకరణ కేంద్ర ఆర్థిక మంత్రి ముందు ఉన్న అతి పెద్ద సవాళ్లలో ఒకటి. పన్ను ఆదాయం పరిమితంగా పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలపై ఎక్సైజ్ డ్యూటీని పెంచే మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంది. ఇది తాత్కాలికంగా ఖజానాకు ఊరటనిచ్చినా, దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ మార్గాన్ని చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. ఆదాయాన్ని పెంచేందుకు పన్ను పరిధిని విస్తరించడం, పన్ను ఎగవేతలను తగ్గించడం, డిజిటలైజేషన్ ద్వారా అనుసరణను మెరుగుపరచడం తదితర మరింత పటిష్టమైన పరిష్కాలను సూచించాలి. ఇలా వుంటే, పునరుత్పాదక శక్తి, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి రంగాల్లో భారత్ పెద్ద లక్ష్యాలను పెట్టుకుంది. కానీ, ఈ మార్పు కోసం భారీ పెట్టుబడులు అవసరం. అదే సమయంలో చమురు, వాయువు వంటి సంప్రదాయ శక్తి వనరులపై ఆధారాన్ని పూర్తిగా వదిలేయలేని పరిస్థితి. ఈ బడ్జెట్ ఈ రెండు అవసరాల మధ్య సమతుల్యత సాధించాలి. దేశీయంగా గ్రీన్ టెక్నాలజీ తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతి ఆధారాన్ని తగ్గిస్తే, అది ఉపాధి సృష్టికి కూడా దోహదం చేస్తుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ బడ్జెట్‌పై రాజకీయ ఒత్తిళ్లు సహజం. సంక్షేమ పథకాలకు డిమాండ్ పెరుగుతుంది. కానీ సంక్షేమం, ద్రవ్య వినిమయ క్రమశిక్షణ మధ్య సమతుల్యత తప్పనిసరి. తాత్కాలిక రాజకీయ లాభాల కోసం దీర్ఘకాలిక ఆర్థిక ఆరోగ్యాన్ని త్యాగం చేయకూడదు. సంక్షేమ పథకాలను ఉత్పాదక ఆస్తుల సృష్టితో అనుసంధానం చేయగలిగితేనే అవి ఆర్థికంగా నిలకడగా ఉంటాయి. మొత్తానికి, 2026–27 బడ్జెట్ ముందు ఉన్న సవాళ్లు సాధారణమైనవి కావు. ఇది కేవలం సంఖ్యల పత్రం కాదు.. ఒక వ్యూహాత్మక ప్రకటన కావాలి. కొత్త వృద్ధి డ్రైవర్లు, ఉపాధి సృష్టి, పెట్టుబడిదారుల విశ్వాసం, గ్రీన్ మార్పు, ఫిస్కల్ క్రమశిక్షణ వంటివన్నీ ఒకే తాటిపై నడిపించాల్సిన బాధ్యత ఈ బడ్జెట్‌పై ఉంది. ఆశ్చర్యాలకన్నా స్థిరత్వం, పాపులిజం కన్నా బాధ్యత, తాత్కాలిక ఊరటనిచ్చే చర్యల కన్నా దీర్ఘకాలిక సంస్కరణలు అత్యవసరం. ఆ దిశగానే బడ్జెట్ ఉండాలి. అప్పుడే, ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ తన వృద్ధి ప్రయాణాన్ని కొనసాగించగలుగుతుంది.

## అప్పకోసం మిత్రుదేశాల ముందు.. తప్పని పరిస్థితిలో తల వంచాం: పాక్ ప్రధాని

**ఇస్లామాబాద్ :** అప్పులు చేయడంకోసం దేశాల ఎదుట తప్పనిసరి పరిస్థితుల్లో తలదించామని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అన్నారు. ఇస్లామాబాద్‌లో ప్రముఖ వ్యాపారవేత్తలు, ఎదుగమతిదారులతో జరిగిన ఒక సమావేశంలో షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, పాకిస్థాన్ దివాళా పరిస్థితులను ఎదుర్కొందని, అలాంటి సంక్లిష్ట సమయంలో దిక్కుతోచనిస్థితిలో మిత్ర దేశాల ముందు అప్పుకోసం నిలబడ్డామని, ఈ సందర్భం తమను కుమిలిపోయేట్టు చేసిందని గుర్తుచేసుకున్నారు. పాకిస్థాన్ ప్రధానంగా చైనా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, సౌదీ అరేబియా దేశాలను అప్పుకోసం ఆశ్రయించింది. అడిగినప్పుడు మి త్రదేశాలు లేదనకుండా అప్పులు ఇచ్చాయన్నా రు. సాంకేతికంగా దేశం డీఫాల్ట్ పరిస్థితుల్లో ఉండగా తాము మిత్రదేశాల దగ్గరకు వెళ్ళి అప్పులు అడిగామని, అలా అడగడం తమకు సిగ్గనిపించినా తప్పలేదన్నారు. ''మేం అధికా రం స్వీరించిన నాటికి దేశంలో ఆర్థిక పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి, కుప్పకూలేపరిస్థితికి వచ్చాయి, సామా న్య ప్రజలు భయంకరమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు'' అన్నారు. 2023లో పా రిస్‌లో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని షెహబాజ్ షరీఫ్ గుర్తుచేసుకున్నారు. ఐఎంఎఫ్ అప్పును ఖరా రు చేసిన తర్వాత దేశంలో పరిస్థితులు కొంతమేరకు కుదుటపడ్డాయన్నారు. కష్టకాలంలో ఉండగా మిత్రదేశాలు పాకిస్థాన్‌కు పూర్తి అండదండగా నిలిచాయన్నారు. ఆనాడు తాను దేశ సైన్యాధిపతి,రక్షణబలగా ప్రధానాధిపతి, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్తో కలిసి మిత్రులవద్దకు వెళ్లానని, అనేక దేశాల నాయకులను కలిసి అప్పుకోసం అడిగామన్నారు. ''మిత్రులైనప్పటికీ ఏ విధంగా మేం అప్పుడు అడగగలం? వారు మమ్మల్ని నిరాశపరచలేదు, కానీ అలా అప్పు అడగడం తలవంపులు అనిపించింది'' అన్నారు. ''మనం అప్పుడు అడిగినప్పుడు మ నం మూల్యం చెల్లించాలి, వారు ఏమి అడిగానాసరే ఒప్పుకోవాల్సిన పరిస్థితి, దానని మనం అమలు చేయాలి'' అన్నారు. విదేశీ మారకద్రవ్యంకోసం, అప్పులు తీర్చడంకోసం నాలుగు మిత్రదేశాలను ఆశ్రయించామన్నారు. ఈ స మావేశంలో ఆయన పరిశ్రమలకు కొన్ని రాయితీలు ప్రకటించారు. విద్యుత్ టారిఫ్‌లపై రాయి తీ ఇచ్చారు.

# నేటి విద్యార్థులే రేపటి నాయకులు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేటి విద్యార్థులే రేపటి కాబోయే నాయకులు, రాయబారులని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. హైదరాబాద్‌లోని బిజెఆర్ భవన్‌లో శనివారం పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఐవిజన్ యూత్ పార్లమెంట్–2025 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, గౌరవ అతిథిగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దేశం రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థలని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన వైట్ పేపరును ఆయన భవిష్యత్తు కోసం ప్రస్తుత తరగతి ఆశలు ప్రతిబింబించే ఆకాంక్ష పత్రంగా అభివర్ణించారు. ఈ వైట్ పేపర్‌లో సమకాలీన పరిపాలన, అభివృద్ధి అంశా లు ప్రతిబింబించాయని, బాలికల విశేష భాగస్వామ్యం ప్రశంసనీయం అని అన్నారు. మహిళా సాధికారత భారతదేశంలో నిశ్శబ్దమైన విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పుగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయాల నాణ్యతను మెరుగుపరచడానికి యువత పాల్గొనడం అత్యవసరమని అన్నారు. విద్యార్థి రాజకీయాల నుండి ప్రజా జీవితానికి తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, చదువుకున్న, అవగాహన కలిగిన యువత ప్రజాస్వామ్య సంస్థలతో అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్, మాక్ అసెంబ్లీ, మోడల్ యునైటెడ్ నేషన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు శాసనసభల పని తీరు, ప్రజా విధానం, పరిపాలనపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తాయని, బాధ్యతాయుతమైన భవిష్యత్ నాయకత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ, ఐవిజన్ యూత్ పార్లమెంట్ పఠన పద్ధతి విధానాన్ని దాటి, తరగతి గదులను ప్రజాస్వామ్యానికి జీవంతమైన ప్రయోగశాలలుగా మార్చే లక్ష్యంతో రూపొందించబడిందని తెలిపారు. విద్యార్థులు ఆలోచించడం, ప్రశ్నించడం, చర్చించడం, సహకరించడం, నాయకత్వం వహించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమం జిల్లా విద్యాధికారి రోహిణి, ఇక్షణా మార్కెటింగ్ ప్రతినిధులు అంజలి గుప్తా, అంకుర్ గుప్తా, రోటరీ లేక్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు సునీల్ సరాఫ్, రాజ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హార్వర్డ్‌లో చివరి రోజు బిజీగా సిఎం రేవంత్ రెడ్డి

విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో విస్తృత పరస్పర చర్చలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** '21వ శతాబ్దపు లీడర్షిప్ కోర్సు'ను చేసేందుకు అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్ళిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోర్సు పూర్తి చేసిన చివరి రోజున పలువురు ప్రతినిధి బృందాలు, వివిధ విభాగాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. హార్వర్డ్‌కు చెందిన వివిధ స్కూళ్ల విద్యార్థులతో పాటు ఎంఐటి, కొలంబియా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాయకత్వం, విజయ సాధన, ఆర్థిక వృద్ధి అభివృద్ధి నమూనాలు, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, రైతులు, మహిళలు, యువతకు సంక్షేమం వంటి పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. సిఎం రేవంత్ రెడ్డి తన దృష్టి కోణం, ఎదుర్కొంటున్న సవాళ్లు, రాష్ట్ర భవిష్యత్తుకు రూపురేఖలు చూపించే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ – 2047' గురించి వివరించారు. ఈ విజన్ ద్వారా అన్ని వర్గాల భాగస్వామ్యానికి, సాధికారతకు కలిగే అవకాశాలను ఆయన విశదీకరించారు. నాయకత్వం, విజన్ గురించి చెప్పాలని విద్యార్థులు కోరగా, 'హార్వర్డ్‌లోని ప్రతిష్టాత్మక అధ్యాపకులే బోధించడం సముచితం. నేను ఉపాధ్యాయుడిలా నటించదలుచుకోలేదు. పరస్పర సంభాషణల ద్వారా పంచుకోవడం, నేర్చుకోవడమే నాకు ఇష్టం' అని సిఎం పేర్కొన్నారు. రెండు వైపులా ఆలోచనల మార్పిడి జరిగే చర్చలకే తాను ప్రాధాన్యం ఇస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. భారతదేశ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేసిన సిఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ, హైదరాబాద్ దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ముందుండబోతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు భారత్‌తో, ముఖ్యంగా తెలంగాణతో అనుసంధానమై పనిచేయాలని, 'తెలంగాణ రైజింగ్'కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సిఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, అల్మనీలు తెలంగాణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని సిఎంకు హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని అఫిడవిట్ తీసుకురావాలి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే మన ప్రాణాలను రక్షించుకోవడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలను కూడా కాపాడుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అలియా ప్రభుత్వ మోడల్ పాఠశాలలో రూ.14 లక్షల రూపాయలతో నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సడక్ సురక్షా అభియాన్ నినాదంతో ఈ సంవత్సరం 10 లక్షల మందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 1872లో ప్రారంభించిన హిస్టారికల్ అలియా స్కూల్‌లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌ను ప్రారంభించుకున్నామనీ, జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం ఇక్కడ జరుపుకోవడం గర్వకరణామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఖచ్చితంగా మోటార్ వెహికల్స్ యాక్ట్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. త్వరలో ప్రతి పిల్లవాడు, విద్యార్థి విద్యార్థినులు వారి తల్లిదండ్రుల వద్ద మేము ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తాం అని అఫిడవిట్ తీసుకురావాలని కోరారు. యూనిసెఫ్ సహకారంతో పాఠశాలల్లో ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయో అక్కడ ఎస్‌డిఎఫ్ నిధులతో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి మాట్లాడుతూ రోడ్డు భద్రతా అందరికీ చాలా ముఖ్యమైందన్నారు. తెలంగాణలో సంవత్సరానికి 7 వేల మంది, రోజుకు 20 మంది చనిపోతున్నారని, అందులో పిల్లలు, యువత అధికంగా ఉండడం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయన్నారు. జాయింట్ సిపి జోయల్ డెవిస్ మాట్లాడుతూ రవాణా శాఖ, విద్య శాఖకి సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, యునిసెఫ్ ప్రతినిధి డా. జెల్ ఎల్‌ఎల్ ఎం, స్థానిక కార్పొరేటర్ సురేఖ, రిజినల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, డిఇఓ రోహిణి, జెటిసి రమేష్, చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, స్టేట్ ఆర్టీఏ మెంబర్ నవీన్ ,హైదరాబాద్ ఆర్టీఏ మెంబర్ సురేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

కేంద్ర ఆర్థిక మంత్రికి ఎంపి చామల విన్నపం



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాబోయే కేంద్ర బడ్జెట్ 2026లో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రధానమంత్రితో సంబంధిత కేంద్ర మంత్రులకు ఇచ్చిన వినతులను పరిగణలోకి బడ్జెట్లో కేటాయింపులు ఉండాలని కోరారు. 2014లో ఆర్థికంగా బలంగా ఉన్న తెలంగాణ, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అశాస్త్రీయ ప్రాజెక్ట్ కేటాయింపుల వల్ల భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎంపి చామల ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదాలు, నిధుల విడుదల లేకపోవడం వల్ల సుమారు 12 విభాగాలకు చెందిన 47 కీలక అంశాలు నిలిచిపోయాయని ఎంపి వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ II, ఏఆర్ఆర్ఆర్ఆర్ఆర్ రేడియల్ రోడ్లకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. కొత్త విమానాశ్రయాలు, రైల్వే లైన్లు, జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0లో తెలంగాణను చేర్చాలని, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు తుది ఆమోదం తెలపాలని ఆయన కోరారు. ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. విద్యారంగంలో హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయడంతో పాటు, అదనంగా జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను కేటాయించాలని విన్నవించారు. గోదావరి మూసీ రివర్ లింక్ ప్రాజెక్ట్, సింగరేణి కోల్ బ్లాకుల కేటాయింపు, పిఎం కుసుమ్ పథకం పునరుద్ధరణ వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపి కోరారు. పేదల గృహ నిర్మాణ పథకాలైన పిఎంఎవైజి, పిఎంఎవైయు కింద మరిన్ని ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి, ఈ బడ్జెట్లో రాష్ట్రానికి న్యాయం చేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఈసారైనా తెలంగాణకు న్యాయం జరగాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత 11 కేంద్ర బడ్జెట్లలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిచిన నేపథ్యంలో అయినా ఈసారి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగినంత నిధులు కేటాయించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ అవసరాలు, అత్యవసర ప్రాజెక్టులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పూర్తి సమాచారం అందించామని మంత్రి తెలిపారు. డ్రై పోర్ట్, టెంపుల్ టూరిజం, ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో వ్యతిరేకించారని గుర్తుచేసిన మంత్రి, కేంద్ర పెద్దలను తరచూ కలసి నివేదికలు సమర్పించినప్పటికీ నిధుల కేటాయింపులో మాత్రం నిరంతరం వివక్ష కొనసాగుతుందని ఆరోపించారు. ఈసారి బడ్జెట్ తెలంగాణకు ఆశాజనకంగా ఉండాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈసారి కూడా బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే, రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# తెలంగాణ విజన్ 2047 లక్ష్యసాధన కోసం ప్రభుత్వ అధికారులంతా పని చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ విజన్ 2047 లక్ష్య సాధనే లక్ష్యంగా అధికారులంతా పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అదేశించారు. రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్‌లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. దేవాదాయ, చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి శాఖల పనితీరుపై సమీక్షించిన సిఎస్ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం (యాదగిరిగుట్ట), వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంతో పాటు ఇతర ప్రముఖ ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్.శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తీ, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ విసి,ఎండి సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ – ఇన్ – చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రియుడి భార్య, పసికందును తగులబెట్టిన ప్రియురాలు

తల్లి, ఆరు నెలల బాబు మృతి





**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతపల్లి గ్రామంలో దారుణం ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుందేళ్ళ నగేష్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మీసాల సుజాత సంచిలో కారం, పెట్రోల్ బాటిల్, కత్తి తీసుకుని వచ్చి నగేష్ భార్య మమత(32)పై పెట్రోల్ పోసి నిప్పంటించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నగేష్ భార్య మమత తన వివాహేతర సంబంధానికి అడ్డుగా మారుతోందని భావించి, మర్రిగూడ మండలం సరంపేటలో జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు వెళ్లడానికి తన ఆరు నెలల బాబుని కూర్చోబెట్టుకొని సిద్ధమై తనను తీసుకెళ్లడానికి వస్తున్న తమ్ముడి కోసం ఎదురుచూస్తున్న సమయంలో మీసాల సుజాత సంచిలో కారంపొడి, కత్తి, పెట్రోల్ బాటిల్ తీసుకొని వచ్చి పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో బాధితురాలు తప్పించుకోలేక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన సమయంలో అక్కడే ఉన్న ఆరు నెలల బాబు కూడా మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. బాధితురాలి అరుపులు విని పరుగెత్తుకొచ్చిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి, గాయపడిన శిశువును వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబు మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో గ్రామం మొత్తంగా షాక్‌కు గురైంది. ఈఘటనపై గ్రామంలో పోలీసులు బందోబస్తు నడుమ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సుజాతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నాంపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ దూది రాజు ఆధ్వర్యంలో నాంపల్లి, మర్రిగూడెం, చింతపల్లి, ఎస్ఐలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# విప్లవ కవి గద్దర్ ఆశయాలు సమాజ మార్పుకు మార్గదర్శకం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విప్లవ గాయకుడు, ప్రజా కవి, సామాజిక ఉద్యమకారుడు గద్దర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని ఎస్సి,ఎస్టి సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అణగారిన వర్గాల జీవన వాస్తవాలను తన గళంలో, తన కలంలో ప్రతిబింబింపజేసిన గద్దర్ విప్లవ గర్జనగా ప్రజలను చైతన్యపరిచి,పాటల ద్వారా సామాజిక అసమానతలపై ప్రశ్నలు లేవనెత్తిన గొప్ప ప్రజా కవి అని మంత్రి కొనియాడారు. గద్దర్ ఆశయాలైన సమానత్వం, న్యాయం, సామాజిక చైతన్యం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. గద్దర్ స్ఫూర్తి తరతరాలకు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అణగారిన వర్గాల సంక్షేమానికి తన శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

# పెన్షన్, గ్రాట్యుటీ తక్షణమే చెల్లించాలి

ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాం మొదల్కొని ఇప్పటీ వరకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, పెన్షన్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులకు సంబంధించి గత ముఖ్యమంత్రి కెసిఆర్ దారిలోనే సిఎం ఎ.రేవంత్ రెడ్డి నడవడం సరికాదన్నారు. పలువురు ఉద్యోగులు వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తూ అనారోగ్యంతో ప్రమాదాలకు గురై చనిపోయిన వారికి కూడా పదవి విరమణ బెనిఫిట్స్ రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 2026 సంవత్సరంలో 6వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ పొందుతున్న వారికి పదవి విరమణ పథకం ప్రకారం రావాల్సిన అన్ని లాభాలను వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బాల్‌రాజ్ డిమాండ్ చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No.03/GHMC/ALC-51/EE/2025-26 తేదీ: 30-01-2026

**పని పేరు:** డిజిల్టింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.75.70 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 02.02.2026న మ.03.00గం.ల నుండి 09.02.2026న ఉ.11.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సెల్ నెం. 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14794-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026



**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

ఆపరేషన్ : వనపర్తి సర్కిల్

షార్ట్ ఓపెన్ టెండర్ & ఇ-టెండర్ ప్రకటన

Tender Notice-03/2025-26

**టెండర్ నోటీసు** నెం: 03/2025-26, **స్పెసిఫికేషన్** నెం: W-01/25-26 & W-02/25-26 ప్రకారం వనపర్తి సర్కిల్‌లోని వివిధ విద్యుత్ పనుల కోసం అర్హత గల విక్రేతల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి. **టెండర్ల అమ్మకం ప్రారంభ తేదీ:** 02.02.2026 మరియు **టెండర్లను స్వీకరించడానికి చివరి తేదీ:** 10.02.2026, మధ్యాహ్నం 13:30 గంటలు. టెండర్ నోటీసుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి www.tgsouthernpower.com వెబ్‌సైట్‌ను సందర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ :: వనపర్తి.

DIPR R.O. No. : 14821-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. EOI-L/EE/C40/SBZ/GHMC/2025-2026 తేదీ: 31.01.2026

క్ర.సం.1, ఈ క్రింద పేర్కొన్న ఐటెమ్స్ కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్స్, అథారిటీలు మరియు డీలర్లు, ఏజెన్సీలు, మొ॥ వాటి నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనది: 1 సంవత్సర కాలానికి ఫిబ్రవరి 2026 నుండి డిసెంబర్ 2026 వరకు ఇంటర్‌నెట్ సర్వీస్ అందించడం మరియు దోమల్‌గూడ వద్ద న్యూ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయ భవనానికి నెట్ వర్కింగ్ అందించడం. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 02.02.2026న ఉ.10.00గం.ల నుండి 04.02.2026న మ.3.00గం.ల వరకు, **కార్యాలయ పేరు & చిరునామా:** బిడ్లను తేది: 04.02.2026న మ.3.00గం.లకు లేదా అంతకుముందు ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-15, జిహెచ్ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్. సెల్ నెం. 7995007437లో తేదీ: 04.02.2026న మ.3.00గం.లకు లేదా అంతకుముందు. పై వస్తువులకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి స్పెసిఫికేషన్లను జిహెచ్ఎంసి వెబ్‌సైట్: https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు.

టు, నోటీసు బోర్డు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.15, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14838-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026


# ఐక్యతతో విజయం ఖాయం

మైనార్టీ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన విజయం సాధించేందుకు ఐక్యత, క్రమశిక్షణతో కూడిన ప్రచారం, ప్రభావవంతమైన ప్రజా సంప్రదింపులు అవసరమని మైనారిటీ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో శనివారం జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల సన్నాహాలు, బూత్ స్థాయి బలోపేతం, నియోజకవర్గ వ్యాప్తంగా కచ్చితంగా క్షేత్రస్థాయి సమన్వయం అవసరం అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మంత్రి దామోదర రాజ నరసింహ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, ఎంఎల్ఎలు డా.సంజీవ్ రెడ్డి, మదన్ మోహన్‌రావు, తోట లక్ష్మీ కాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి చంద్రశేఖర్, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు హాజరయ్యారు.

# కార్మిక సంఘాలపై 'సుప్రీం' వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

**న్యూఢిల్లీ:** సర్వోన్నత న్యాయస్థానం కార్మిక సంఘాలపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు, అసోసియేషన్లతో కూడిన ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గృహ కార్మికులకు కూడా పారిశ్రామిక కార్మికులతో సమానంగా అన్ని హక్కులూ వర్తింపజేసేలా గుర్తింపు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యానగల సుప్రీంకోర్టు ధర్మాసనం జనవరి 29వ తేదీన చేసిన ఆరోపణలు వర్గ వివక్షతో కూడుకున్నాయని, దేశంలో అత్యధికంగా ఉన్న అసంఘటితక కార్మికులను ఈ వ్యాఖ్యలు కలచివేశాయని పది కార్మిక సంఘాలతో కూడిన ఐక్యవేదిక శనివారం ఒక ఉమ్మడి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. కార్మికుల సమైక్యవాదం, ఒకేజెండా కింద చేరి చేసే సమ్మెలు దేశంలో అనేక పరిశ్రమలు మూతపడటానికి దారితీస్తున్నాయంటూ చేసిన ఆరోపణలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు అవాంఛనీయమైనవని, వాస్తవదూరమైనవని, పరిశ్రమలు అనేక పనిదినాలను కోల్పోతున్నది కార్మికులవల్ల, కార్మిక సంఘాల సమ్మెలు, ఆందోళనలవల్లా కాదని, కార్పొరేట్ వ్యవస్థల దుర్వినియోగ విధానాలు, అవకతవకలు, లోటుపాట్ల కారణంగానే పరిశ్రమలు మూతపడుతున్నాయని ఐక్యవేదిక స్పష్టం చేసింది. కార్మిక సంఘాలు ఏనాడూ దేశ ఆర్థిక అభివృద్ధికి అడ్డుపడలేదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 19 (1) (సి) అధికరణ కింద కార్మిక సంఘాలన్నీ అధికారికంగా గుర్తింపు పొందిన ప్రజాస్వామ్య సంస్థలేనని, కార్మికుల జీవనాన్ని, వారి మర్యాదను, గౌరవాన్ని, హక్కులను రక్షించే కేంద్రాలని, కానీ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని తెలియజేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే 1926లో భారత కార్మిక సంఘ చట్టం కింద కార్మిక సంఘాలను ఏర్పాటు చేసేకునే హక్కుకు హామీ లభించిందని జ్ఞప్తికి తెచ్చింది. అత్యంత బాహాటంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వర్గ వివక్షను బహిర్గతం చేశారని పేర్కొంది. సంక్షేమరాజ్యాన్ని ఆశిస్తుందనుకున్న బాధ్యతాయుతమైన సర్వోన్నత న్యాయస్థానం అందుకు బదులుగా ప్రభుత్వాన్ని కార్పొరేట్ అనుకూల విధానాలవైపు, అసమానత,పేదరికం, ఆకలి వంటివాటిని లోతుగా వ్యాప్తిచేసేందుకు బాధ్యురాల్నిచేసేదిగా పురిగొల్పుతోందని పేర్కొంది. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరించేందుకు ప్రభుత్వానికి బాహాటంగా చట్టబద్ధతనిస్తోందని పేర్కొంది. సంక్షేమరాజ్య సాధనకు ఉద్దేశించిన రాజ్యాంగ దార్శనికతను చిన్నచూపు చూస్తుందని, సామాజిక న్యాయ సూత్రాలకు, సమానత్వానికి, రాజ్యాంగం పేర్కొన్న శ్రమైక జీవన సౌందర్యానికి ఈ వ్యాఖ్యలు, ఆరోపణలు విరుద్ధమైనవని స్పష్టం చేసింది. గృహకార్మికులు సహా సామాజిక ఆర్థిక భద్రత లేకుండా అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనహక్కులను, సామాజిక న్యాయాన్ని, ఇతర హక్కులను సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగబద్ధ వైఖరి అనుసరించాలని కోరింది. గృహకార్మికులకు, అసంఘటిత కార్మికులకు ఎలాంటి రక్షణలు లేకుండాపోయాయని, వారికి కనీస వేతనాలను తిరస్కరిస్తున్నారని, అసంఘటిత కార్మికులలో ఎక్కువమంది గృహకార్మికులే ఉన్నారని ఐక్యవేదిక స్పష్టం చేసింది. వారి వేతనాలు దోచుకుంటున్నారని, ఎక్కువ పనిగంటలతో వారి శ్రమ దోచుకుంటున్నారని కార్మిక సంఘాల సమైక్యవేదిక సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది.




## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ మండలంలోని కట్టకొమ్ముతండా గ్రామ పంచాయతీ ఎంజిఎన్ ఆర్ఈజిఎస్ నిధులు రూ. 10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండునాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళా సాధికారతకు వారి స్వయం ఉపాధి, సముహా బలోపేతానికి ఈ భవనం ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎంతటి భారానైనా మోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రాంసింగ్, సర్పంచ్ జ్యోతి పాండు, కవిత లచ్చిరాం, లక్ష్మి గోవింద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించండి

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** పట్టణ అభివృద్ధి కొరకు మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్‌కు అప్పగించాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. పట్టణ అభివృద్ధికి శాసనసభ్యునిగా తన వంతు కృషి చేస్తున్నానని, భవిష్యత్తులో కూడా పట్టణాన్ని అగ్రభాగంలో ఉంచడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదిస్తే పరిష్కరిస్తానని వీరేశం అన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాసులు, జడల చినమల్లయ్య, షేక్ ఇబ్రహీం ఉన్నారు.

## భూ అక్రమాలకు తావు లేకుండా భూభారతి సర్వే



**ప్రజాపక్షం/అర్వపల్లి :** పక్కాగా భూమి యొక్క నక్ష మ్యాప్ హద్దుల నిర్ణయం, పటిష్టంగా భూరికార్డులు, భూమి ఆక్రమణలకు తావులేకుండా భూభారతి భూ రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఆర్‌డిఓ వేణుమాధవ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో భూభారతి చట్టం భూముల రీ సర్వే కార్యక్రమం కోసం పైలెట్ గ్రామ పంచాయతీగా జాజిరెడ్డిగూడెం ఎంపిక అయిన సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యలు పరిష్కారం అవుతుందని తెలిపారు. భూభారతి సర్వే ముఖ్య ఉద్దేశ్యం రైతులకు పక్కాగా భూమి హద్దులు, భూమి యొక్క నక్ష మ్యాప్‌లో నిర్ణయం, పటిష్టమైన భూ రికార్డులు తయారు చేయడమేనన్నారు. ప్రతి కమతానికి రీ సర్వే చేసి రైతులకు భూతగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి శ్రీకాంత్, గ్రామ సర్పంచులు చిల్లంచర్ల విద్యాసాగర్, వివిధ శాఖల అధికారులు బింగి కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, హరి స్వరూపు, వెంకటేష్, జలంధర్, వెంకట్‌రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి బాధాకరం

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కోదాడలో జరిగిన కర్ల రాజేష్ లాకప్ డెత్‌లో ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి చాలా బాధాకరమని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎంఆర్‌పిఎస్, మాదిగ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మానవహార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. దమ్ముంటే కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే భవిష్యత్తులో తగిన రాజకీయ మూల్యం చెల్లించకతప్పదని మండిపడ్డారు. లాకప్ డెత్‌లో నింధితుడైన ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కాపాడుతూ జిల్లా ఎస్‌పి అనేక పొరపాటు చేస్తున్నారని, నేరస్తులను కాపాడే జిల్లా ఎస్‌పిపై అట్రాసిటి కేసు నమోదు చేసి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి నాగరాజు మాదిగ, ఇంజం వెంకట్ స్వామి మాదిగ, బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, రాజన్న మాదిగ, చింతలపాటి చిన్నశ్రీ రాములు మాదిగ, బొజ్జ సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బ్యాలెట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రమైన అవంతీపురం మార్కెట్ గోదాములను సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్‌అమిత్, డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అవసరమున్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకన్న, సీఐలు ప్రసాద్, నాగభూషణరావు, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

### నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రీసైడింగ్,సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఆధారంగా జరుగుతాయని,అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పాటించిన విధంగానే అన్ని నియమ,నిబంధనలు ఈఎన్నికలలో సైతం వర్తిస్తాయన్నారు.ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్ ను పిఓలు జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని,బ్యాలెట్ బాక్సల సీలింగ్ ప్రక్రియను నియమ నిబంధనల ప్రకారం అనుసరించి చేయాలని చెప్పారు.ప్రిసైడింగ్ అధికారుల డైరీని జాగ్రత్తగా రాయాలని,రెండు కాపీలు సిద్ధం చేసుకోవాలని,బ్యాలెట్ పేపర్ ఎకౌంటు చెక్ చేసుకోవడంతో పాటు,ఓటర్లు బ్యాలెట్ పేపర్ తీసుకున్న తర్వాత తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్నది లేనిది గమనించేందుకు ఒక ఏపీఓను నియమించాలని,పోలింగ్ కేంద్రంలోకి 5గురు ఓటర్లను మించి అనుమతించవద్దని,అంధులైన ఓటర్లకు సంబంధించి అనుమతించే సహాయకులు తప్పనిసరిగా 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని,ఓటింగ్ కంపార్ట్మెంట్లో ఓటు వేసేందుకు ఇచ్చే మార్క్ తప్ప ఇతర ఏ వస్తువులు ఉండకూడదని తెలిపారు. రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్ టి సంచాలకులు జి. రమేష్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,గృహనిర్మాణ శాఖ పిడి రాజకుమార్,డిఈఓ బిక్షపతి,మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ముగిసిన స్క్రూటీని..

### ఐదు మున్సిపాలిటీలలో 1617 నామినేషన్లలో 5 తిరస్కరణ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల స్క్రూటీని శనివారం ముగిసింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటిల పరిధిలో మొత్తం 1617 నామినేషన్లు దాఖలు కాగా 5 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మున్సిపాలిటిలో 512 మంది అభ్యర్థులు 741 నామినేషన్లు దాఖలు చేయగా పత్రాలు సరిగ్గా లేకపోవడంతో 4 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 32వ వార్డు నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేసిన ధరావత్ వేణు ఓటు హక్కు లేనికారణంగా అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. దీంతో మొత్తం 5 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు ప్రకటించారు. కోదాడ మున్సిపాలిటిలో 256 మంది 333 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాలేదు. అలాగే హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో 238 మంది 293 నామినేషన్లు దాఖలు చేయగా అన్ని ఒకే అయ్యాయి. తిరుమలగిరి మున్సిపాలిటిలో 106 మంది అభ్యర్థులు 160 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాలేదు. నేరేడుచర్ల మున్సిపాలిటిలో 82 మంది 90 నామినేషన్లు దాఖలు చేయగా అన్ని ఒకే అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మిగిలింది అభ్యంతరాల స్వీకరణ, నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా విడుదలే మిగిలింది. ఈ ప్రక్రియ మొత్తం ఫిబ్రవరి 3తో ముగియనుంది.



## మిర్యాలగూడలో నామినేషన్లు 505

### తిరస్కరణకు గురైనవి రెండే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నామినేషన్ల పరిశీలనలో రెండు తిరస్కరణకు గురైనట్లు కమీషనర్ గణవేని శ్రీనివాస్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 48 వార్డులకుగాను 325 మంది అభ్యర్థులు 507 నామినేషన్లు సమర్పించగా అందులో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి అంశాలపై దృష్టి సారించామన్నారు. కాగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులు వెంకన్న, కోటయ్య, అంజయ్య, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలు

### మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జిఎస్ పాండాదాస్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌళిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జిఎస్ పాండాదాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ విసి హాల్‌నందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లతో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రీకౌంటింగ్ అవసరమైనప్పుడు ఏవిధంగా అనుసరించాలో రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలని చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు, ఓటర్లను చైతన్యపరుచుటకు గాను ఓటు ఏ విధంగా వేయాలో అవగాహన వీడియోలు తయారుచేసి లోకల్‌కేబుల్ ఛానల్‌లో ప్రసారం చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలింగ్ రోజున ఓటింగ్ కంపార్ట్మెంట్‌లలో వెలుతురు, లైటింగ్ స్పష్టంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమీషనర్లు హనుమంత్ రెడ్డి, రమాదేవి, డి శ్రీనివాస్, సిహెచ్ నాగరాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.



## త్రికూటలయాన్ని పరిరక్షించాలి

### పురావస్తు పరిశోధకుడు సిఇఒ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రారం శివారులో నిర్లక్ష్యానికి గురై రోజురోజుకు శిధిలమవుతున్న కాకతీయుల త్రికూటలయాన్ని పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన మునగాల వెంకట్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు శనివారం శిధిల శివాలయాన్ని సందర్శించారు. ఈ ఆలయం మూడు గర్భాలయాలు, అర్ధమండపాలు, ఒక రంగ మండపంతో తూర్పు వైపున ప్రధాన ద్వారంతో ఉండేదని, 13వ శతాబ్ధిలో కాకతీయ గణపతి దేవుని కాలంలో నిర్మించబడిన త్రికూట ఆలయం ఆలనాపాలన లేక ప్రధానాలయం తప్ప మిగతా రెండు ఆలయాలు కూలిపోయాయని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు సహకరిస్తే చుట్టు పడి ఉన్న ఆలయరాళ్లను పేర్చి పునర్మినిర్మించుకోని కాకతీయ త్రికూటలయానికి పూర్వ వైభవం తీసుకురావచ్చని, అందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరు పూనుకోవాలని, 800 సంవత్సరాల కళాఖండాన్ని కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలని ఆయన గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకునూరు శ్రీనివాస్, మునగాల మట్టారెడ్డి, నామిరెడ్డి చంద్రారెడ్డి, బొడ్డు మల్లయ్య యాదవ్, పాతకోటి భిక్షం, చిట్యాల వెంకటేష్, గోవర్ధన్, మట్టపల్లి బంగారు, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపడతాం

### ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలను పరిశీలన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై జిల్లా కలెక్టర్,బి చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్‌లు శనివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ సంస్థలను పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న సెట్విన్ స్కిల్ సెంటర్ ను అలాగే తేలకంటి గూడెం దగ్గర ఉన్న రామనంద తీర్థ కళాశాల,గురుకుల బాలికల విద్యాలయం సెంటర్లను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహణకు అనుకూలత, హాళ్ల సౌకర్యాలు,భద్రతా ఏర్పాట్లు,ప్రవేశనిష్క్రమణ మార్గాలు, విద్యుత్ సరఫరా,తదితర అంశాలను అన్నిటినీ దృష్టిలో ఉంచుకొని భవనాలను పరిశీలించారు.అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం తగిన స్థలాన్ని నిర్ణయిస్తామని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపడతామని స్పష్టం చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం,చిట్యాల,చండూర్,దేవరకొండ మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## బట్టీల్లో మగ్గుతున్న బాల్యం

### పలుకలకు బదులు ఇటుకలు
### వసివాడుతున్న బాల్యం
### పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బాల కార్మిక వ్యవస్థ నియంత్రించేందుకు ఇన్ని చట్టాలు తీసుకువచ్చినా వారి బ్రతుకులు మాత్రం మారడం లేదు. మండలంలోని కాజీపేట, చీకటిమామిడి, ప్యారారం, కంచల తండా, తిమ్మాపురం, పర్వతాపురంతో పాటు మండల కేంద్రంలో సుమారు 100 ఇటుక బట్టిలు ఉంటాయి. దీంట్లో పనిచేస్తున్న ఓడిశా కార్మికుల పిల్లలు కూడా బట్టీల్లో పనిచేస్తున్నారు. పొట్టకూటికోసం వచ్చిన వారు తమ పిల్లలను కూడా పనిలో పెడుతున్నారు. వారికి తక్కువ వేతనాలు ఇస్తూ యజమానులు దండిగా బాల కార్మికులపై సంపాదిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా బాల కార్మిక వ్యవస్థ నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలు తప్ప ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ దివాళాకోరుతనమే

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కెసిఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ ద్వారా నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరుతనమేనని మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఇది కేవలం సిఎం రేవంత్ రెడ్డి రాక్షసానందానికి నిదర్శనమని విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో ఫిర్యాదుదారులు లేరని, నష్టపోయిన వారు లేరని అన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండానే విచారణ చేపట్టడం పనికిమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిజెపిలు రెండు ఏకమై బిఆర్ఎస్‌ను ఎదుర్కోలేక మాజీ సిఎం కెసిఆర్ పై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై వస్తున్న ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకే ఈ విచారణ డ్రామా తెరమీదికి తెచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ స్కీమ్‌ల ప్రభుత్వం కాదని స్కామ్‌ల ప్రభుత్వమని అన్నారు. వాళ్ళ తప్పులను కప్పిపుచుకునేందుకే ఈ నోటీసుల డ్రామా అని కొట్టిపారేశారు. అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీలో కలిసినట్లే మాట్లాడుతున్నారని ఆత్మాభిమానం చంపుకొని కొంత మంది అధికారులు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. 65 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఎక్కడ కోరితే అక్కడికి వెళ్ళి విచారణ చేయాలనే చట్టంలో స్పష్టంగా ఉందని కెసిఆర్ విషయంలో సిట్ అధికారులు దానిని గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డిజిపి, సిపి, సిట్ అధికారులు ఎవరి ఒత్తిళ్ళకు లొంగి పనిచేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడికి నోటీసులు ఎప్పుడు ఇవ్వాలన్నది అధికారులకు తెలియదా అని నిలదీశారు. చట్టంపై కెసిఆర్‌కు అపారమైన గౌరవం ఉందని సిట్‌కు సహకరిస్తారని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యులు, సూర్యాపేట పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ట్రైకార్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రామచందర్ నాయక్, మాజీ జడ్‌పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, సూర్యాపేట మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయండి : అడిషనల్ ఎస్‌పి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా యాదాద్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మినారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని కారు మోటార్ వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ప్రయాణం చేసేటప్పుడు ఎడమవైపు నుండి ఓవర్టేక్ చేయొద్దని కుడిపి నుండి వెళ్లాలని ఓవర్టేక్ చేసి ప్రమాదాలు గురి కావద్దని రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రయాణం చేయాలని కోరారు. యాదాద్రి టోల్ ప్లాజా జిఎం చంద్రమోహన్ మాట్లాడుతూ ఇంటిలో నుంచి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములు ప్రయాణించేటప్పుడు పిల్లలు చిరునవ్వుతో డాడీ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయండి అని కోరాలని సురక్షితంగా ప్రయాణం చేసినప్పుడే కుటుంబము క్షేమంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రయాణికులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో లిటిల్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ డిఎస్పి ప్రభాకర్ రెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్, ట్రాఫిక్ సిఐ మధుసూదన్, ఎస్ఐలు లక్ష్మణ్, అమర్ సింగ్, టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరరావు, ట్రాఫిక్ అధికారి రవి, టీం లీడర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మల సేవలో పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో కొలువైన సమ్మక్క సారలమ్మలను శనివారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రెండేండ్లకు ఒకసారి జరిగే సమ్మక్క సారలమ్మ జాతర గత నాలుగు రోజులుగా సాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మలు ప్రజలను చల్లగా చూడాలని కోరారు. రైతులకు పాడిపంట సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ సొంటి ఆంజనేయులు, ఆలయ చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మామిడి వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

# అంకెలు కాదు.. వాస్తవాభివృద్ధి ఎంత?




భారతదేశం ఒక అధిక ఆదాయ దేశంగా మారాలన్న ఆశయం ఇప్పుడు అధికారిక నినాదంగా మారింది. 2047 నాటికి వికసిత దేశంగా ఎదగాలన్న లక్ష్యాన్ని ముందుకు తెచ్చి, ఆ లక్ష్యానికి దారి చూపే సాధనంగా వార్షిక బడ్జెట్‌లను ప్రదర్శిస్తున్నారు. కానీ. ఆశయాలు, నినాదాలు మాత్రమే దేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లలేవు. వాటికి పునాది కావాల్సింది మానవ సామర్థ్యం, ఆరోగ్యం, విద్య, సమానత్వం. ఈ మూలాలే బలహీనంగా ఉన్నప్పుడు, కేవలం గణాంకాల మీద ఆధారపడి నిర్మించే వృద్ధి నమూనా ఎంతకాలం నిలుస్తుందన్నది అనుమానమే. గత బడ్జెట్ అనుభవం ఈ నిజాన్ని మరింత స్పష్టంగా చూపించింది. ఆదివారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ కూడా ఇదే తరహాలో ఉన్నా, ఆశ్చర్యం ఏమీ లేదు. సాధారణంగా ఆర్థిక వృద్ధి అనే పదాన్ని మనం తరచూ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) శాతం పెరుగుదలతో సమానం చేస్తాం. కానీ జిడిపి పెరుగుతున్నప్పటికీ, ఆ వృద్ధి ఎవరి చేతుల్లో కేంద్రీకృతమవుతోంది? ఎవరి జీవితాలను మార్చుతోంది? ఎవరి బాధలను తగ్గిస్తోంది? ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయా? కొనుగోలు శక్తి మాట ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు లేకపోతే, ఆ వృద్ధి కేవలం గణకాలకు... గణాంకాలకు మాత్రమే పరిమితమవుతుంది. గత బడ్జెట్ ప్రకటించిన లక్ష్యాలు, ఖర్చుల ప్రాధాన్యతలు పరిశీలిస్తే, భారతదేశం ఒక విస్తృత ప్రజా ఆధారిత అభివృద్ధి మార్గాన్ని కాకుండా, సంకుచితమైన, అసమానతలను పెంచే దారిని ఎంచుకుంటున్నట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి పంథాలో, విద్య, ఆరోగ్యం వంటి మానవ మూలధనంపై పెట్టుబడుల కొరత అత్యంత తీవ్రమైన లోపం. ఏ దేశానికైనా దీర్ఘకాలిక అభివృద్ధికి ఇవే మూలస్తంభాలు. కానీ ఇవి ఖర్చుల జాబితాలో ఇప్పటికీ ప్రాధాన్యత పొందడం లేదు. విద్యారంగానికి కేటాయింపులు పేరుకే పెరుగుతున్నా, జిడిపిలో వాటి వాటా దాదాపు స్థిరంగా ఉంది. జాతీయ విద్యా విధానం ప్రకటించిన 6 శాతం లక్ష్యం కాగితాలకే పరిమితం అవుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నాణ్యతలో వెనుకబడి ఉండటం, మౌలిక వసతుల కొరత, విద్యా రంగంలో తగినంత మంది ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జ్ఞాన ఆర్థిక వ్యవస్థ నిర్మిస్తామన్న మాటలు.. హామీలు వాస్తవానికి దూరంగా కనిపిస్తున్నాయి.

ఉన్నత విద్యలో పరిస్థితి మరింత సంక్లిష్టం. నాణ్యమైన ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సంఖ్య పెరగకపోవడం వల్ల, ప్రైవేటు రంగం ఖాళీలను భర్తీ చేస్తోంది. కానీ, అది విద్యను ఒక సామాజిక హక్కుగా కాకుండా, ఒక ఖరీదైన వస్తువుగా మార్చుతోంది. ఫలితంగా ప్రతిభ ఉన్నా, ఆర్థిక స్థోమత లేని యువత వెనుకబడుతోంది. ఫలితంగా అటు ప్రజలకు, ఇటు దేశానికి కూడా మానవ వనరులను సంపూర్ణ వినియోగించుకోలేకపోవడం అనేది భారీ నష్టానికి దారితీస్తుంది. ఆరోగ్య రంగం కథ కూడా అంతే ఆందోళనకరం. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం జిడిపిలో సుమారు 1.8 శాతానికే పరిమితం అవుతోంది. ఇది ప్రపంచంలోనే తక్కువ స్థాయిల్లో ఒకటి. బీమా ఆధారిత పథకాలు విస్తరిస్తున్నా, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి అవసరమైన పెట్టుబడులు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కొరత, పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై అధిక భారం, వైద్య సిబ్బంది కొరత వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఆరోగ్యం ప్రైవేటు రంగానికి వదిలేయబడినప్పుడు, అది ఖర్చుతో కూడిన సేవగా మారుతుంది. పేద కుటుంబాలు అనారోగ్యం వల్ల అప్పుల పాలవడం, పేదరికంలోకి నెట్టబడడం ఈ వ్యవస్థలో సాధారణమే. గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల విషయంలో కూడా బడ్జెట్ దృక్పథం సంకుచితంగానే ఉంది. ఉపాధి హామీ పథకాలు కేవలం సంక్షోభ నిర్వహణ సాధనాలుగా మారుతున్నాయి. వాటికి సరిపడా నిధులు కేటాయించకపోవడం, రాష్ట్రాలపై భారం మళ్లించడం వల్ల, చట్టపరంగా హామీ ఇచ్చిన ఉపాధి కూడా అనిశ్చితంగా మారుతోంది. ఆలస్యంగా వేతనాలు, పనిదినాల కొరత వంటి సమస్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నాయి. గ్రామీణ ఆదాయం పెరగకుండా, దేశీయ డిమాండ్ ఎలా పెరుగుతుందన్న ప్రశ్నకు సమాధానం లేదు. దీనికితోడు ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి, కొత్త విధానాన్ని తీసుకురావడం ద్వారా కేంద్రం గ్రామీణ ఉపాధిపై దారుణంగా దెబ్బతీసిందనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పలు లోపాలకు తోడు, పన్నుల నిర్మాణంలో జరుగుతున్న మార్పు మరింత ఆందోళన కలిగిస్తోంది.

గత దశాబ్దంలో పన్నుల భారాన్ని మూలధనం నుంచి వినియోగంపైకి మళ్లించిన స్పష్టమైన ధోరణి కనిపిస్తోంది. కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతుండగా, పరోక్ష పన్నుల వాటా పెరుగుతోంది. వస్తు సేవల పన్ను వ్యవస్థలో బహుళ రేట్లు ఉన్నా, అవి మౌలిక వినియోగ వస్తువులపై కూడా భారాన్ని మోపుతున్నాయి. ఫలితంగా పేదలు, మధ్యతరగతి తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. అత్యంత సంపన్న వర్గాలపై ప్రత్యక్ష పన్నుల ద్వారా సముచిత భారం మోపే ప్రయత్నం కనిపించడం లేదు. సంపద పన్ను, వారసత్వ పన్ను వంటి అంశాలు చర్చకే రాకపోవడం అసమానతలను మరింత పెంచుతోంది. దేశంలో ఆదాయ, సంపద అంతరాలు పెరుగుతున్నాయన్న గణాంకాలు స్పష్టంగా చూపుతున్నా, బడ్జెట్ విధానాలు ఆ వాస్తవాన్ని ఎదుర్కొనే ధైర్యం చూపడం లేదు. ఇది కేవలం నైతిక సమస్య కాదు; ఆర్థిక సమస్య కూడా. అధిక అసమానతలు వినియోగాన్ని తగ్గిస్తాయి, సామాజిక ఉద్రిక్తతలను పెంచుతాయి, దీర్ఘకాలిక వృద్ధిని దెబ్బతీస్తాయి. బడ్జెట్ అమలు విషయంలో కూడా ఒక స్పష్టమైన అంతరం కనిపిస్తోంది. ప్రకటించే కేటాయింపులు, వాస్తవ ఖర్చుల మధ్య తేడా సంవత్సరానికొకసారి పెరుగుతోంది. వ్యవసాయం వంటి కీలక రంగాలకు కేటాయింపులు తగ్గడం, రైతుల ఆదాయ సమస్యలను మరింత తీవ్రం చేస్తోంది. రాష్ట్రాలకు ఇచ్చే ప్రత్యేక సహాయ పథకాలు కఠిన షరతులతో ఉండటం వల్ల, తక్కువ సామర్థ్యం ఉన్న రాష్ట్రాలు వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాయి. దీని వల్ల ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతున్నాయి. భౌతిక మౌలిక వసతులపై పెట్టుబడులు అవసరం అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. రహదారులు, పోర్టులు, రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. కానీ అవే అభివృద్ధి యొక్క అంతిమ లక్ష్యమని భావించడం ప్రమాదకరం. పాఠశాలలు, ఆసుపత్రులు, పరిశోధనా కేంద్రాలు వంటి సామాజిక మౌలిక వసతులు లేకుండా, కేవలం కాంక్రీట్ నిర్మాణాలు దేశాన్ని ముందుకు తీసుకెళ్లలేవు. మానవ సామర్థ్యం లేకుండా, ఆ కాంక్రీట్ వసతులు ఉపయోగం లేకుండా పోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే బడ్జెట్ ఒక కీలక మలుపు. ఇది గత దారిలోనే కొనసాగుతుందా, లేక నిజమైన మార్పుకు నాంది పలుకుతుందా అన్నది దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ముందుగా మానవ మూలధనంపై పెట్టుబడులను కేంద్రంగా పెట్టే దృక్పథం అవసరం. ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వ ఖర్చును చట్టబద్ధంగా పెంచే స్పష్టమైన మార్గపటాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఇది ఖర్చు కాదు; ఉత్పాదకత, సామాజిక స్థిరత్వంపై పెట్టుబడి. ఇక్కడ, ఉపాధి హామీని గ్రామీణ అభివృద్ధి యొక్క పునాదిగా చూడాలి. దీన్ని తాత్కాలిక ఉపశమన పథకంగా కాకుండా, భూమి, నీరు, పర్యావరణ పునరుద్ధరణతో అనుసంధానించి దీర్ఘకాలిక ఆస్తులను సృష్టించే సాధనంగా మార్చాలి. సరిపడా నిధులు, సమయానికి వేతనాలు, రాష్ట్రాలకు పూర్తి మద్దతు ఇందులో కీలకం.మూడవది, పన్నుల వ్యవస్థలో సమానత్వం తీసుకురావాలి. అత్యంత సంపన్న వర్గాలు దేశ అభివృద్ధికి తగిన వాటా ఇవ్వాల్సిందే. ఇది ప్రతీకారం కాదు; సామాజిక ఒప్పందం. సమానత్వం లేకుండా స్థిరమైన వృద్ధి సాధ్యం కాదు. ఏదిఏమైనా దేశ ఆర్థిక విధానాలలో పారదర్శకత అవసరం. బడ్జెట్ ప్రకటనలు, అమలు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలి. ప్రజలు తమ పన్నుల డబ్బు ఎక్కడ, ఎలా ఖర్చవుతుందో తెలుసుకునే హక్కు కలిగి ఉండాలి. విద్య రంగంలో లోపం, ఆరోగ్యంలో అనిశ్చితి, అసమానతలతో నిండిన సమాజంపై అధిక ఆదాయ దేశాన్ని నిర్మించలేం. అలాంటి మార్గం దేశాన్ని అభివృద్ధి వైపు కాదు, అస్థిరత వైపు తీసుకెళ్తుంది. ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్, పాత దారిలోనే కొనసాగి అసమానతలను లోతుగా చేస్తుందా, లేక ప్రజలను అభివృద్ధి కేంద్రంగా ఉంచే ధైర్యమైన మార్పుకు నాంది పలుకుతుందా? అనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న. ఇప్పుడు దేశానికి కావాల్సింది గణాంకాలు కాదు, కోట్లాది మంది అనుభవిస్తున్న సమస్యలకు సరైన సమాధానాలు. ఇప్పుడు మార్పు చేయకపోతే, ఆ మార్పు ఖర్చు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

– (న్యూస్‌క్లిక్ సౌజన్యంతో)

## 2027 'గగన్‌యాన్' కోసం... మొదటి మానవరహిత మిషన్ రెడీ

### ఇస్రో చైర్మన్ వి.నారాయణన్
### రాకెట్ వ్యవస్థలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడమే ఇస్రో ధ్యేయమని వెల్లడి



**చెన్నై :** భారతదేశం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఒక ముందడుగు వేసింది. 2027 నాటికి చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి మానవ రహిత రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ భారతదేశపు మొట్ట మొదటి మానవ అంతరిక్ష విమాన కార్యక్రమమని, ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉందని అన్నారు. మూడు రోజుల మిషన్‌లో ముగ్గురు సభ్యుల సిబ్బందిని అంతరిక్షంలోకి పంపించి వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకురావాలన్న ధ్యేయంతో గగన్‌యాన్ మిషన్ ఇస్రో కృషిచేస్తోందన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్ట్‌ను 2027 కోసం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. దీనికి ముందు ఇస్రో మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగించడం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన శుక్రవారం రాత్రి ఇక్కడ విలేకరులకు వివరించారు. ప్రస్తుతం శాస్త్రవేత్తలు ఈ మిషన్ విజయంతం కావడానికి చాలా పరీక్షలు నిర్వహించడంలో నిమగ్నమై ఉన్నారని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీనికోసం చాలా పరీక్షలు జరుగుతున్నప్పటికీ గగన్‌యాత్రి సురక్షితం అనేది అత్యంత ముఖ్యమైనదన్న విషయం మీకు తెల్సిందేనని విలేకరులను ఉద్దేశించి అన్నారు. అందుకే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆచితూచి అడుగులు ముందుకు వేస్తోందన్నారు. అంతేకాకుండా ప్రతీ వ్యవస్థలోనూ ఇస్రో అర్హత సాధించాల్సి ఉంటుందని, ముఖ్యంగా రాకెట్ వ్యవస్థలో నూటికి నూరు శాతం ఫలితాల ను సాధించాల్సిన అవసరం ఉందని, కర్తవ్యాన్ని స ంపూర్ణంగా నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఆ దిశగా అ డుగులు మందుకు వేస్తున్నామన్నారు. గగన్‌యాన్ ను విజయవంతం చేయాలన్నదే అంతిమ లక్ష్యం కూడా అని ఇస్రో చైర్మన్ వెల్లడించారు. జనవరి 12న ప్రయోగించబడిన తర్వాత రాకెట్ మూడవ దశలో పిఎస్ఎల్‌వి సి62 మిషన్‌లో కొన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఈ నేపథ్యంలో పరిస్థితులను గాడిలో పెట్టడానికి శాస్త్రవేత్తలు రాకెట్‌లోని ప్రతీ విషయాన్ని క్షణ్ణంగా అధ్యయనం చేస్తున్నారని నారాయణన్ వివరించారు.

## పాలసీ తయారీలో పేళవ సమన్వయం

### బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ:** బడ్జెట్ తర్వాత కొద్ది రోజులకే కొత్త జిడిపి, వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ) సిరీస్ విడుదల కానున్నాయి. అయితే బడ్జెట్ సంఖ్యలు విడుదలైన వెంటనే సవరణలకు గురవుతాయా అని కాంగ్రె ప్రశ్నించింది. విధాన రూపకల్పనలో సమన్వయంపై ఇది పేలవంగా ప్రతిబింబిస్తుందని పేర్కొంది. 2026–27 బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదివారం పార్లమెంట్‌లో సమర్పించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ గుర్తుచేశారు. '16వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలును ఆర్థిక మంత్రి ప్రకటించనున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు తమ కోసం ఏమి చేయబోతున్నారో అని ఆత్రుతగా ఎదురు చూస్తాయి' అని జైరామ్ రమేష్ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఫిబ్రవరి 1, 2026న బడ్జెట్ ఆవిష్కరించబడిన వెంటనే సవరణలకు లోనవుతాయా అని ఆయన ప్రశ్నించారు. 2024ని బేస్‌గా కలిగి ఉన్న కొత్త సిపిఐ సిరీస్ ఫిబ్రవరి 12, 2026న విడుదల కానుందని కాంగ్రెస్ నాయకుడు లేవనెత్తారు. కొత్త సిరీస్ ఆహార ధరల వాటాలో గణనీయమైన తగ్గుదలని చూస్తుందని అంచనా వేశారని, ఇదే జరిగితే, బడ్జెట్ సంఖ్యలపై ప్రభావం ఉంటుందన్నారు. హోల్ సేల్ ధరల సూచిక కూడా సవరణకు గురవుతోందని, బహుశా అది రాబోయే కొన్ని నెలల్లో బహిరంగపరచబడుతుందని రమేష్ అన్నారు. ఏ విధంగానైనా, విధాన రూపకల్పనలో సమన్వయంపై ఇది పేలవంగా ప్రతిబింబిస్తుందని ఆయన చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

**భువనేశ్వర్ :** ఒడిశాలోని గంజాం జిల్లాలో ఒక ట్రక్కు మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఘటనలో కనీసం ఐదుగురు మరణించగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు శనివారం ఉదయం తెలిపారు. ఈ ప్రమాదం బెర్హంపూర్ నగరం గుండా వెళ్లే జాతీయ రహదారి 16పై హల్దియాపదార్ వద్ద జరిగింది. ట్రక్కు జాతీయ రహదారిపై తప్పు వైపున ప్రయాణిస్తోందని, అది ఒక వంతెనను ఢీకొనడానికి ముందు వరుసగా మూడు మోటార్ సైకిళ్లను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 'నలుగురు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే మరణించగా, మరొకరు తర్వాత గాయాలతో మరణించారు. గాయపడిన వారిలో కొందరు పాదచారులు కూడా ఉన్నారు, వారిని ఎంకెసిజి మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం, వేగంగా వస్తున్న ట్రక్కు మూడు బైక్లను ఢీకొని సుమారు 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా.. సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం

**ముంబయి:** విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం సాయంత్రం ముంబయిలోని లోక్ భవన్‌లో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం పదవి చేపట్టిన తొలి మహిళగా సునేత్ర పవార్ నిలిచారు. సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. 'అజిత్ దాదా అమర్ రహే' అన్న ఎన్‌సిపి నేతలు, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంగణం మారుమోగింది. కాగా, డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారానికి ముందు ఎన్‌సిపి శాసనసభా పక్ష నాయకురాలిగా సునేత్ర పవార్ ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపి అయిన ఆమె ఆరు నెలల్లోగా ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉన్నది. మరోవైపు అజిత్ పవార్ నిర్వహించిన ఎక్సైజ్, క్రీడల మంత్రిత్వ శాఖల బాధ్యతలు కూడా సునేత్ర పవార్ కొనసాగించనున్నారు. అయితే మార్చిలో బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో



అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థిక శాఖను సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ తాత్కాలికంగా తన వద్ద ఉంచుకున్నారు. ఆర్థిక శాఖను ఆ తర్వాత ఎన్సీపీకి కేటాయించనున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, ఉదయం సునేత్రా పవార్ ఎన్‌సిపి శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపి అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్‌సిపి ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సునేత్ర ప్రమాణస్వీకారం నాకు తెలియదు : శరద్ పవార్

**బారామతి:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా దివంగత అజిత్ పవార్ సతీమణి, రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం చేయడంపై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ స్పందించారు. ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు కూడా మీడియా ద్వారానే విషయం తెలిసిందని పేర్కొన్నారు. శనివారం బారామతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సిపికి చెందిన రెండు వర్గాలు ఏకమవ్వాలన్నదే అజిత్ పవార్ ఆశయమని తెలిపారు. 'ప్రమాణ స్వీకారం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో వచ్చిన వార్తల ద్వారానే మేము తెలుసుకున్నాం. ఆ విషయంపై నాకు ఏమీ తెలియదు. ఈ నిర్ణయం పార్టీ స్థాయిలో తీసుకుని ఉండవచ్చు. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే వంటి కొందరు నేతలు ఈ అంశంలో చొరవ తీసుకున్నారు అనుకుంట. వారు ఏదో నిర్ణయం తీసుకుని ఉండవచ్చు' అని శరద్ పవార్ తెలిపారు. అజిత్ పవార్ మరణం అనంతరం వెంటనే రాజకీయ నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించగా, ముంబయిలోని మహాయుతి ప్రభుత్వ నేతల స్థాయిలో నిర్ణయాలు జరుగుతున్నాయని శరద్ పవార్ తెలిపారు. 'కుటుంబంలో ఏదైనా సమస్య వస్తే కుటుంబం మొత్తం కలిసే ఉంటుంది. కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవు. ఈ చర్చలన్నీ ఇక్కడ జరగడం లేదు. అవన్నీ ముంబయిలోనే జరుగుతున్నాయి. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే సహా ఇతర సీనియర్ నేతలు ఈ అంశాలపై చర్చిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు అవన్నీ వారి తీసుకున్న నిర్ణయాల్లాగే కనిపిస్తున్నాయి. దీనిపై నేను వ్యాఖ్యానించను' శరద్ పవార్ అన్నారు.

**'అజిత్ పవార్ కోరిక అదే'**

అజిత్ పవార్ కోరిక నేరవేరాలని భావిస్తున్నట్లు శరద్ పవార్ తెలిపారు. 'అజిత్ పవార్, శశికాంత్ షిండే, జయంత్ పాటిల్ రెండు వర్గాల విలీనంపై చర్చలు ప్రారంభించారు. విలీనానికి తేదీ కూడా నిర్ణయించారు. ఫిబ్రవరి 12న విలీనం జరగాల్సి ఉంది. అయితే, ఆ తేదీకి ముందే అజిత్ మనలను విడిచి వెళ్లిపోయారు. అజిత్ పవార్ ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, వారికి న్యాయం



దక్కేలా పనిచేసేవారు. బారామతి ప్రజలు ఎప్పుడూ ఆయనకు అండగా నిలిచారు. ఆయన తన బాధ్యతల్లో ఎప్పుడూ వెనుకాడలేదు. ఆయన మృతి మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఈ పరిస్థితుల్లో మనం ధైర్యంగా ముందుకు సాగాలి. ప్రజల బాధలు తగ్గించే దిశగా పనిచేయాలి. ఆయన అనుసరించిన విలువలు, విధానాలను కొనసాగించాలి. ఆయన కుటుంబంలోని కొత్త తరం తప్పకుండా ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తుందని నాకు నమ్మకం ఉంది' అని శరద్ పవార్ అన్నారు. ఇక రెండు ఎన్‌సిపి వర్గాల విలీనమైతే ఎన్‌డిఎలో చేరుతారా? అని అడగ్గా, ఇవన్నీ మీడియా వైపు జరుగుతున్న చర్చలే అని ఇక్కడ అలాంటిదేమి లేదని శరద్ పవార్ స్పష్టం చేశారు.

## నీట్ విద్యార్థి మృతిపై సిబిఐ దర్యాప్తునకు సిఫార్సు

### ఉప ముఖ్యమంత్రి స్రామ్రాట్ చౌదరి




**పాట్నా :** పాట్నాలో ఇటీవల జరిగిన నీట్ విద్యార్థిని మృతిపై బిహార్ ప్రభుత్వం సిబిఐ దర్యాప్తుకు సిఫార్సు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్రామ్రాట్ చౌదరి తెలిపారు. ఈ కేసును బిహార్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తోంది. జెహానాబాద్‌కు చెందిన నీట్ విద్యార్థిని ఈ నెల ప్రారంభంలో పాట్నాలోని చిత్రగుప్త నగర్‌లోని శంభు బాలికల హాస్టల్‌లో అపస్మారక స్థితిలో కనిపించింది. చాలా రోజులు కోమాలో ఉన్న ఆమె ఈనెల 11న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించింది. ఆమెపై లైంగిక దాడి జరిగిందని, అధికారులు దానిని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె కుటుంబం ఆరోపించింది. 'పాట్నాలో జరిగిన నీట్ విద్యార్థిని హత్య కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జీ భారత ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను పారదర్శకంగా, న్యాయంగా పూర్తిగా బయటపెట్టాలి' అని చౌదరి ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్మెంట్ (డిఎస్‌పిఇ) చట్టంలోని నిబంధనల ప్రకారం ఈ కేసుపై సిబిఐ దర్యాప్తుకు సిఫార్సు చేస్తూ రాష్ట్ర హోం శాఖ కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రానికి సంబంధించిన కేసులో సిబిఐ దర్యాప్తు ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వానికి చెందిన సిబ్బంది, శిక్షణ విభాగం (డిఒపిటి) ఈ విషయంలో ఒక నోటిఫికేషన్ జారీ చేస్తుంది. నిబంధనల ప్రకారం, చట్టం, భద్రత రాష్ట్రానికి సంబంధించిన అంశం కాబట్టి, ఏజెన్సీ అధికార పరిధికి వెలుపల జరిగిన నేరాన్ని దర్యాప్తు చేయడానికి రాష్ట్రం, డిఒపిటి ముందస్తు అనుమతి అవసరం. పోలీసులు మహిళపై లైంగిక దాడి జరగలేదని, అది ఆత్మహత్య కేసు అని పేర్కొంటూ ఈ విషయాన్ని దాచిపెట్టడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని నీట్ అభ్యర్థి తల్లిదండ్రులు ఆరోపించారు. పాట్నా పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా సిబిఐ ఇప్పుడు ప్రత్యేక కేసు నమోదు చేయవచ్చని, ఏజెన్సీ స్లూత్‌లు పోలీసులు పొందిన అన్ని ఆధారాలను సేకరిస్తారని, అనుమానితులు, అరెస్టు చేసిన వ్యక్తి, ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, పోలీసుల వాంగ్మూలాలను కూడా నమోదు చేస్తారని, వారు మొదట ఈ కేసును దర్యాప్తు చేసి ఆత్మహత్య కేసుగా తేల్చారని అధికారి తెలిపారు. కాగా, ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, కేసును సిబిఐకి బదిలీ చేయాలనే నిర్ణయం భూమి, ఆకాశం లో తుల్లోంచి నేరస్థులను పట్టుకోవడం గురించి రాత్రింబవళ్లు గొప్పగా మాట్లాడే ఎన్‌డిఎ ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆరోపించారు.

## కశ్మీరీలపై దాడులకు వ్యతిరేకంగా పిడిపి నిరసనలు




**శ్రీనగర్ :** దేశంలోని ఇతర ప్రాంతాలలో కశ్మీరీలపై దాడులకు వ్యతిరేకంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన నిరసన తర్వాత జమ్ముకశ్మీర్ పోలీసులు తమ శాంతియుత మార్చ్‌ను ఆపారని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) ఆరోపించింది. కశ్మీరీలను కేంద్రపాలిత ప్రాంతంలో బోనులో బంధించారని, తరువాత బయటకు తరమేశారని పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. షేర్–ఎ–కశ్మీర్ పార్క్ సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిరసనకారులు సమావేశమై ప్రదర్శన నిర్వహించారు. వారు బయట ప్రధాన రహదారి వైపు కవాతు చేయాలనుకున్నారు. అయితే, ప్రధాన కార్యాలయ గేట్లను బయటి నుండి లాక్ చేసిన పోలీసులు వారిని ఆపారని పార్టీ సభ్యులు తెలిపారు. పిడిపి శ్రీనగర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖయూమ్ భట్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు బయట నిరసన తెలియజేయాలనుకున్నారు కానీ పోలీసులు వారిని అనుమతించలేదన్నారు. కశ్మీర్ వెలుపలి ప్రజలపై దాడి చేసే వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, దాడులకు వ్యతిరేకంగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయాలనుకునే వారిని ఆపుతున్నారని మండిపడ్డారు. కశ్మీర్ ప్రజలు, పిల్లలు సహా, చదువుకోవడానికి లేదా జీవనోపాధి కోసం బయటకు వెళతారని, అయితే అక్కడ వారిపై దాడులు జరుగుతున్నాయని, అయినా ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. 'వారు కాశ్మీరీలపై ఎందుకు దాడి చేస్తున్నారు? ఒమర్ అబ్దుల్లా, కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ దాడులు ఆగిపోవాలని కోరుకుంటున్నాము' అని పిడిపి నాయకుడు పేర్కొన్నారు.

## భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో పరివర్తన కలిగించే ఘటన: కాంగ్రెస్




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో యాత్ర, ఆర్థిక అసమానతలు, సామాజిక ధ్రువణతను తీవ్రతరం చేయడం, రాజకీయ నిరంకుశత్వాన్ని పెంచడం అనే మూడు సందేశాలను ప్రజలకు చేరవేసిందని కాంగ్రెస్ శనివారం పేర్కొంది. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు జరిగిన 'పాదయాత్ర' మూడు సంవత్సరాల క్రితం శ్రీనగర్‌లో గాంధీ చేసిన ఉత్తేజకరమైన ప్రసంగంతో ముగిసిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 4,000 కి.మీ. పాదయాత్రను రాహుల్ గాంధీ, 200 మందికి పైగా భారత యాత్రికులు కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు కాలినడకన చేపట్టారన్నారు. ఇది 12 రాష్ట్రాలు, 2 యుటిలను కవర్ చేస్తూ 145 రోజులకు పైగా కొనసాగిందని ఆయన గుర్తుచేశారు. ఈ యాత్ర మన దేశ రాజకీయాల్లో ఒక లోతైన పరివర్తన కలిగించే ఘటన అని ఆయన కొనియాడారు. ఇది రాబోయే దశాబ్దాలుగా గుర్తుండిపోతుందిదని, గౌరవించబడుతుందని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర జనవరి 30, 2023న ముగిసింది. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు దాదాపు 4,000 కిలోమీటర్లు సాగిన తన ప్రతిష్టాత్మక ప్రయాణాన్ని ముగించిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు అనేక పార్టీల నాయకులు యాత్రలో చేరారు.

## ఓట్ల కోసం దేశ భద్రత తాకట్టు

### బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వంపై అమిత్ షా మండిపాటు

**కోల్‌కతా :** బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతనే పణంగా పెడుతోందని మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్‌పూర్‌లో జరిగిన బిజెపి కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మా, మట్టి, మనుష్' (అమ్మ, మట్టి, మనిషి) నినాదంతో అధికారంలోకి వచ్చిన మమత పాలనలో, నేడు ఆ మూడూ ప్రమాదంలో పడ్డాయని ఆయన ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మమత ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, దేశ రక్షణ కోసం బంగాల్‌లో బిజెపి జెండా ఎగరడం అత్యవసరమని అమిత్ షా తేల్చిచెప్పారు. నేడు బెంగాల్‌లో 'మా, మట్టి, మనుష్' సురక్షితంగా లేవని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకపోవడమే కాకుండా వారికి భద్రత కరవైందన్నారు. బెంగాల్ నేలను చొరబాటుదారులు మింగేస్తున్నారని, ఇక్కడి సామాన్య ప్రజలు మమత సిండికేట్ ఆగడాలతో, దోపిడీలతో నలిగిపోతున్నారని అమిత్ షా విమర్శించారు. అమిత్ షా తన ప్రసంగంలో చొరబాట్ల అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. ఇది కేవలం రాష్ట్ర సమస్య కాదని స్పష్టం చేశారు.'బెంగాల్‌లో చొరబాటుదారులు యథేచ్ఛగా వస్తున్నారు. ఇది ఇప్పుడు కేవలం బంగాల్ సమస్య కాదు, మొత్తం దేశ భద్రతకే ముప్పుగా మారింది. సరిహద్దుల్లో కంచె వేయడానికి భూమి ఇవ్వాలని కోర్టులు ఆదేశించాయి. అయినా సరే మమత ప్రభుత్వం సరిహద్దు భద్రతా దళానికి భూమి ఇవ్వడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారు. ఎందుకంటే ఆ చొరబాటుదారులు టిఎంసికి ఓటు బ్యాంకుగా మారారు' అని అన్నారు. 'రాష్ట్రంలోని పోలీసులు, అధికారులు అక్రమ వలసదారులను అడ్డుకోవడం లేదు. నకిలీ పత్రాలు సృష్టించి వారిని దేశమంతటా పంపిస్తున్నారు. దీనివల్ల దేశంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి' అని ఆరోపించారు. మమత బెనర్జీ తీరును రామాయణంలోని రావణుడితో పోల్చుతూ షా వ్యాఖ్యలు చేశారు. 'రాముడు సముద్రంపై వారధి కడుతున్నప్పుడు, ఈ భూమ్మీద నన్ను ఓడించేవారే లేరని రావణుడు అహంకరించి అనుకున్నాడు. ప్రతిపక్ష నాయకుడు కేసును పట్టుకోవడం గురించి రాత్రింబవళ్లు గొప్పగా మాట్లాడే ఎన్‌డిఎ (కానీ ఏం జరిగిందో అందరికీ తెలుసు. మమత జీ, మీరు కూడా అలాగే అనుకుంటున్నారు. కానీ ఈసారి బిజెపి సునామీని ఆపలేరు. వచ్చే ఎన్నికల్లో మాకు 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయి. భారీ మెజారిటీతో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుంది' అని జోస్యం చెప్పారు.

# ఎవరికి ప్రయోజనం?

యూరోపియన్ యూనియన్ (ఇయు)తో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎవరికి ప్రయోజనం? అందులోని లోటుపాట్లను సవరించుకోవడానికి ఆదివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం తీసుకోబోయే చర్యలు ఏమిటి? అభివృద్ధి ఫలాలు వాస్తవంగానే సామాన్య ప్రజలకు అందుతున్నాయా? వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. కార్పొరేట్ ప్రపంచంలో, ప్రభుత్వాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధారణంగా 'సమాన అవకాశాలు', 'వృద్ధి', 'ఉజ్వల భవిష్యత్తు', 'దేశ అవసరాలు' వంటి చక్కటి పదాల కూడికతో, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, సాధారణ ప్రజల జీవితాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనేది ప్రశ్న. భారత–యూరప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఇదే ప్రశ్నను తెరపైకి తెచ్చింది. రెండు దశాబ్దాలకు పైగా చర్చల తర్వాత సంతకం చేసిన ఈ ఒప్పందం చారిత్రకమని కొందరు, ప్రమాదకరమని మరికొందరు.. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తేడాలు కేవలం రాజకీయ అభిప్రాయాలు లేదా సిద్ధాంతాలపై ఆధారపడినవిగా భావించలేం. ఎందుకంటే, ఈ ఒప్పందం దేశ ఆర్థిక దిశ, స్వయం ఆధారిత అభివృద్ధి, సామాజిక సమానత్వం వంటి మూల ప్రశ్నలకు సంబంధించినది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉంది. అమెరికా వంటి శక్తివంతమైన దేశాలు తమ అంతర్గత ఆర్థిక సమస్యలకు పరిష్కారంగా సుంకాలు, వాణిజ్య ఆంక్షలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్కెట్లు, కొత్త వాణిజ్య భాగస్వామ్యాల కోసం దేశాలు పరుగులు పెడుతున్నాయి. భారత్‌తో పాటు, ఐరోపా దేశాలు కూడా ఇదే ఒత్తిడిలో ఉన్నాయి. అందుకే ఈ ఒప్పందాన్ని పరస్పర ఉపశమనంగా చిత్రీకరిస్తున్నారు. అయితే, ఒక ఒప్పందం రెండు పక్షాలకు సమాన ప్రయోజనాలు అందిస్తుందా? లేక ఒక పక్షానికి తక్షణ లాభాలు, మరొక పక్షానికి దీర్ఘకాలిక నష్టాలా అన్నది కీలకం. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం యూరప్ నుంచి దిగుమతి అయ్యే 96 శాతం పైగా వస్తువులపై సుంకాలను తొలగించాలి లేదా గణనీయంగా తగ్గించాలి. యంత్రాలు, మద్యం, ప్రాసెస్డ్ ఆహారం వంటి రంగాలు ఇందులో ఉన్నాయి. ప్రతిఫలంగా యూరప్ భారతదేశం నుంచి దిగుమతి అయ్యే దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తగ్గిస్తుంది. కాగితంపై ఇది సమానంగా కనిపించినా, రెండు ఆర్థిక వ్యవస్థల నిర్మాణాలు, సామర్థ్యాలు, ఉత్పత్తి వ్యయాలు ఒకేలా కావు.

అధునాతన సాంకేతికత, భారీ సబ్సిడీలు, బలమైన మౌలిక వసతులు ఉన్న యూరప్ ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి భారీగా ప్రవేశించే అవకాశముంది. అదే సమయంలో, భారతదేశం నుంచి వెళ్లే వస్తువులు అక్కడి కఠిన ప్రమాణాలు, నియంత్రణలను ఎంతవరకు తట్టుకుంటాయన్నది అనుమానమే. దేశ ఉపాధి కల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తున్న రంగాలు శ్రమాధారితమైనవి. చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయం, అనుబంధ రంగాలు కోట్లాది మందికి జీవనాధారం. ఈ రంగాల్లో సుంకాల తగ్గింపు స్థానిక ఉత్పత్తిని తీవ్ర పోటీకి గురిచేస్తుంది. తక్కువ ధరలకు, అధిక నాణ్యతతో వచ్చే దిగుమతులు దేశీయ తయారీదారులను నిలువరించవచ్చు. పెద్ద కార్పొరేట్లకు ఇది అవకాశంగా మారినా, చిన్న ఉత్పత్తిదారులకు, కూలీలకు ఇది ఉపాధి సంక్షోభాన్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. గతంలో జరిగిన కొన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల అనుభవాలు ఈ వాస్తవాన్నే స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయరంగంలో ఈ ఒప్పందం మరింత ప్రమాదకరం. కొన్ని కీలక పంటలను మినహాయించినప్పటికీ, పలు వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులపై సుంకాల తొలగింపు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతుంది.

యూరప్‌లో వ్యవసాయం భారీ ప్రభుత్వ మద్దతుతో సాగుతుంది. అలాంటి ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి వస్తే, ఇప్పటికే ఖర్చులు పెరిగి, ధరలు తగ్గిపోతున్న రైతులు ఎలా పోటీ పడతారు? ఆటోమొబైల్ వంటి రంగాల్లోనూ ఇలాంటి సమస్యలే తలెత్తే అవకాశం ఉంది. విదేశీ కార్లపై ఉన్న అధిక సుంకాలను క్రమంగా తగ్గించడం వల్ల వినియోగదారులకు తక్కువ ధరల వద్ద ఎంపికలు పెరిగినట్లు కనిపించవచ్చు. కానీ అదే సమయంలో దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ, అనుబంధ భాగాల తయారీ, వాటిలో పనిచేసే లక్షలాది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. సాంకేతికత బదిలీ, స్థానిక తయారీ పెరుగుతుందన్న హామీలు గత ఒప్పందాల్లో ఎంతవరకు నెరవేరాయో పరిశీలిస్తే, ఈ హామీలపై అంధ విశ్వాసం అత్యంత ప్రమాదకరం. పైగా ఈ ఒప్పందంలో పారదర్శకత లోపించింది. ఇంత కీలకమైన ఒప్పందంపై సమగ్ర సమాచారం ప్రజల ముందుకు రావడం లేదు? చర్చలు ఎలా జరిగాయి? ఏ రంగాల్లో ఎలాంటి రాయితీలు ఇచ్చారు? దీర్ఘకాలిక ప్రభావాలపై ఏవైనా స్వతంత్ర అధ్యయనాలు జరిగాయా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విధాన నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తే, వాటిపై విస్తృత చర్చ, పార్లమెంటరీ పరిశీలన అవసరం. ఆ ప్రక్రియ బలహీనంగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

వాణిజ్య ఒప్పందాలు కేవలం సరుకుల మార్పిడికి మాత్రమే పరిమితం కావు. అవి భౌగోళిక రాజకీయ సంబంధాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ ఒప్పందంలో భాగంగా ప్రతిపాదితమైన అంతర్జాతీయ వాణిజ్య కారిడార్ కూడా ఇదే కోవలోకి వస్తుంది. ఇది వాణిజ్య మార్గాల వైవిధ్యాన్ని పెంచుతుందనే వాదన ఉన్నప్పటికీ, కొన్ని భౌగోళిక నిర్ణయాలు నైతిక, మానవతా సంబంధమైన అంశాలు కూడా వెన్నంటే ఉన్నాయి. అంతర్జాతీయంగా వివాదాస్పదంగా ఉన్న ప్రాంతాలు, దేశాలతో వ్యూహాత్మక అనుసంధానం దేశ విదేశాంగ విధానంపై, ప్రపంచంలో దేశ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతుంది. ఆ కోణంలో కూడా ఈ ఒప్పందం విమర్శలకు గురవుతోంది. ఇయు సహా భారత్ ఇటీవల అనేక దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల సమష్టి ప్రభావం దేశ ఆర్థిక స్వావలంబనను బలపరుస్తుందా, లేదా బలహీనపరుస్తుందా? ఎగుమతులు పెరుగుతాయన్న అంచనాలు వాస్తవంగా అమలవుతున్నాయా? లేక దిగుమతులే వేగంగా పెరిగి వాణిజ్య లోటును మరింత పెంచుతున్నాయా? వంటి శేష ప్రశ్నలు ఎన్నో. వికాసాన్ని స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వంటి సంఖ్యలతో కొలవలేం. ఉపాధి, ఆదాయ సమానత్వం, ప్రాంతీయ సమతుల్యత, పర్యావరణ స్థిరత్వం వంటి అంశాలు కూడా కీలకమే. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధారణంగా పెద్ద నగరాలు, కార్పొరేట్ కేంద్రాలకు లాభాలు తెచ్చిపెడతాయి. గ్రామీణ ప్రాంతాలు, అసంఘటిత రంగాలు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొంటాయి. ఈ అసమానతలు సామాజిక అసంతృప్తికి, రాజకీయ అస్థిరతకు దారితీయవచ్చు. తొందరపాటు నిర్ణయాలు ఎప్పుడూ సరైన ఫలితాలను ఇవ్వవు. భారత్ ఆచితూచి వ్యవహరించాలి. ప్రగతి ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి. ●



## దేశం ఎదుర్కొంటున్న సమస్యలు
## మీడియా స్వేచ్ఛ, పారదర్శకత

**ఆర్థిక దృక్కోణంలో నేడు దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సమస్యలు మీడియా స్వేచ్ఛ, పారదర్శకత. పెట్టుబడిదారులు రాజకీయ వాక్చాతుర్యం కంటే డేటా(అంకెల) విశ్వసనీయత గురించే పట్టించుకుంటారు. భారతదేశం విభజన రాజకీయాల దశలో ఉందని నేను భావిస్తున్నాను. చాలా కాలంగా అనేక సంఘర్షణలు కొనసాగుతున్నాయి. ఒక దేశంగా మనం ఎంతవరకు పారదర్శకంగా, విశ్వసనీయంగా కనిపించాలని అనుకుంటున్నామో మనం నిర్ణయించుకోవాలి. నిజమైన సమస్యలు మీడియా స్వేచ్ఛతో ముడిపడి ఉన్నాయి. ఊహించగలిగే, పారదర్శకమైన విధానాల పరిపాలన, పారదర్శక మీడియా లేకపోతే, భారతదేశం ప్రపంచానికి ఒక మర్మంగానే ఉంటుంది.**

'పిటిఐ'తో నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ

# మంత్రి వ్యాఖ్యల్లో వాస్తవమెంత?

రాజధాని సందడి – బొమ్మగాని కిరణ్‌కుమార్

ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను దృష్టిలో పెట్టుకొని చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. కొన్ని విద్యా సంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని పేర్లతో సహా చెప్పడమే కాకుండా, తాను చెప్పినా నామమాత్రం తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌కెజి చదువులకు సైతం కొందరు లక్షల్లో వసూలు చేయడాన్ని ఆయన ఎత్తి చూపారు. అలాగే విద్యాహక్కు చట్టం కింద 25శాతం సీట్లను పేదలకు కేటాయించాలన్న నిబంధనను పాటించడం లేదన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన తన కుమారుడు ప్రతీక్ పేరిట నల్లగొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని స్వంత నిధులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నిర్మించారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. ఆ భవన ప్రారంభోత్సవం సందర్భంగా కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ గురించి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థుల తల్లిదండ్రుల దుస్థితిని, వాస్తవాలను అద్దంపడుతున్నాయి.

ఇదేమీ ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన సమస్య కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 దశకంలో ఇంటర్మీడియెట్ విద్యారంగంలో పురుడుపోసుకున్న కార్పొరేట్ విద్యా సంస్కృతి నేడు వేళ్ళూనుకుంది. మొదట్లో మెడిసిన్, ఇంజనీరింగ్ కోచింగ్ సెంటర్ల పేర్లతో ప్రారంభమైన ప్రైవేటు విద్యా సంస్థలు, తరువాత ఏకంగా ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థలోకి ప్రవేశించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 'చెయిన్ సిస్టమ్'తో కాలేజీలు ఏర్పాటు చేసుకున్నాయి. చివరకు రెండు, మూడు కార్పొరేట్ విద్యా సంస్థలే ఇంటర్, కోచింగ్ రంగంలో గుత్తాధిపత్యం సాధించి, విచ్చలవిడిగా ఫీజులను దండుకుంటున్నాయి. అవే విద్యా సంస్థలు పాఠశాల స్థాయిలో కూడా ప్రవేశించి, గత 10–15 ఏళ్ళలో మొస్తరు టౌన్‌లలో కూడా విస్తరించాయి. వీటితో పోటీకి తట్టుకోలేక స్థానిక కళాశాలలు, పాఠశాలలు కొన్ని వాటిలోనే విలీనమవ్వగా, మరికొన్ని మూసేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సైతం కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ ఒక అంశంగా ఉండేదనడంలో అతిశయోక్తి కాదు. ఏ పరీక్షైనా టాప్ ర్యాంకులన్నీ తమవేనని కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లు ఊదరగొట్టడం తంతుగా మారిపోయింది. టాప్ ర్యాంకర్లు కొందరు రెండు, మూడు విద్యా సంస్థలు కూడా తమవారేనని ప్రచారం చేసుకున్న సంఘటనలు కోకొల్లలు. అంటే దీని వెనుక నడిచిన వ్యవహారం అర్థమవుతుంది. విద్యార్థులకు ఇతర ఎంపికలు లేకుండా తమవైపే తిప్పుకునేలా చేస్తున్నాయి కార్పొరేట్ విద్యా సంస్థలు. ఇందుకు ఊళ్ళలో సైతం మార్కెటింగ్ తరహాలో పిఆర్‌ఒ నెట్‌వర్క్‌ను పెట్టి అకడమిక్ సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థుల అడ్మిషన్‌లను బుకింగ్ చేసుకుంటున్నారు.

కార్పొరేట్ స్కూళ్ళలో సైతం మాధ్యమిక విద్యా స్థాయిలోనే ఐఐటి, ఎయిమ్స్ కోచింగ్ పేర్లతో విద్యార్థులను ప్రభుత్వ సెలబస్, పరీక్షలతో సంబంధం లేకుండా సొంత సిలబస్‌తో పాఠాలు చెబుతున్నారు. మామూలు పాఠశాలలకంటే మూడింతలు ఫీజు కట్టి ఆ పాఠశాలలో తమ పిల్లలను చేర్చిన తల్లిదండ్రులకు ఆ పాఠశాల నుంచే స్కూల్ డ్రెస్, వారు స్వంతంగా తయారు చేసిన కట్టలకు కట్టల టెక్స్ట్ బుక్స్, సాక్సులు అన్నీ పదుల వేలు పెట్టి కొనాల్సిందే! అందులో పిల్లలను ఇతర పాఠశాలల మాదిరిగా కాకుండా అదనపు గంటలు పాఠశాలలోనే స్పెషల్ క్లాసులు, స్పెషల్ సబ్జెక్టులు అంటూ బట్టీయం పట్టిస్తుంటారు. నిత్యం ఆట, పాటలు, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌తో మానసిక వికాసం చెందాల్సిన విద్యార్థులు, కోళ్ళ ఫారాలలో కోడి పిల్లల్లా పాఠాలు వల్లెవేయడం తప్ప సృజనాత్మకత కోల్పోతున్నారు. సహజంగా లక్షల మంది విద్యార్థుల చదువుకునే రెండు, మూడు కార్పొరేట్ విద్యా సంస్థల్లో కొందరికి టాప్ ర్యాంకులు కూడా వస్తుంటా యి. వారినే ర్యాంకులనే అందరికీ చూపిస్తూ, ఊరిస్తూ దండిగా ఫీజులు వసూలు చేయడం కనపడుతోంది.



లక్షల ఫీజులు కట్టి కార్పొరేట్ విద్యా సంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎందుకు చదివించాలనే ప్రశ్న తలెత్తుతోంది. అందులో వాస్తవం కూడా ఉంది. అయితే, హైదరాబాద్ మహానగరంలో సైతం ప్రతి చోట ఆ పాఠశాలలు వెలిసి, చుట్టుపక్కల బడ్జెట్ స్కూళ్ళు, దశాబ్దాలు తరబడి నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను కబళించాయి. ఆ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులను ఎక్కువ వేతనాలు ఇచ్చి కార్పొరేట్ పాఠశాలలు చేర్పించుకుంటున్న ప్రభావం మిగతా పాఠశాలలపై పడుతున్నాయి. తమ పిల్లలకు మంచి చదువులు అందించాలనుకునే తల్లిదండ్రులు అనివార్య పరిస్థితుల్లోకి నెట్టివేయబడి, అప్పులు తీసుకొచ్చి మరీ కార్పొరేట్ స్కూళ్ళలో చదివిస్తున్నారు. వాటిలో చదవకపోతే తమ పిల్లలు భవిష్యత్తు ఏమిటోననే భయం కూడా కారణమే.

### కార్పొరేట్‌కు విరుగుడు చూపిన ఆరుట్ల ప్రయోగం

ఏదైనప్పటికీ తెలంగాణ ఏర్పడినప్పటికీ కార్పొరేట్ విద్యా సంస్థలను, వాటి ఫీజులను నియంత్రించాలనే డిమాండ్ ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు తెరపైకి వస్తుంది. కానీ, ఆచరణకు నోచుకోవడం లేదు. నియంత్రణ సాధ్యం కాకపోగా, అవి మరింత విస్తృతంగా విస్తరించుకుం టూ పోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా రంగాన్ని పటిష్టపరచాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యా రంగం పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలో విద్యా కమిషన్ ను నియమించారు. ఆ కమిటీ పలు నివేదికలను కూడా సమర్పించింది. అలాగే రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ కె.కేశవరావు నేతృత్వంలో విద్యా విధానంపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అది సమాజంలోని పలు వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది.


కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామనే హామీ ఇచ్చింది. విద్యా కమిషన్ ఆధ్వర్యంలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రయత్నం చేసి విజయవంతమైంది. ఇందుకు రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి, పబ్లిక్ స్కూల్‌గా నామకరణం చేశారు. ఇక్కడ ప్రీప్రైమరీ స్థాయి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు. డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. ఆటలకు పెద్ద గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రకాల క్రీడలలో శిక్షణ కూడా ఇస్తున్నారు. అన్నిటికి మించి చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండడానికి కారణాలు ఆరాతీయగా, ఆ పాఠశాలలు బస్సులను ఏర్పాటు చేస్తున్నాయని తెలుసుకున్నారు. ఆరుట్ల పాఠశాలకు కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పిల్లలు పబ్లిక్ స్కూల్‌కు రావడం మొదలు పెట్టారు. ఆరుట్ల పాఠశాలను పబ్లిక్ స్కూల్‌గా మార్చకముందు సుమారు 500మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య వెయ్యికి చేరుకుంది. గతంలో ఆ స్కూల్‌కు దగ్గరే ఉన్న కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉన్నప్పటికీ, విద్య నాణ్యత, సౌకర్యాలు అంత గొప్పగా ఏమీ లేవని, ఇప్పుడు అన్ని హంగులతో పబ్లిక్ స్కూల్ రావడంతో ఆ స్కూల్ కు విద్యార్థులు వెళ్ళడం తగ్గారని ఆరుట్ల పాఠశాల ఉన్నతీకరణలో భాగస్వామ్యం పంచుకున్న విద్యావేత్త ఒకరు వివరించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేసేందుకు సంకల్పించిం ది. యంగ్ ఇండియా పేరుతో నగరం సమీపంలో పాఠశాలను కూడా ఏర్పాటు చేసింది.

### ఈ మార్పులు అవసరం

విద్యారంగ ప్రక్షాళనకు ప్రభుత్వ ప్రయత్నాలు మరింత వేగవంతం చేయాలి. ఆ లోగా తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించడం, ప్రభుత్వం సూచించిన అకాడమిక్ క్యాలెండర్ అమలయ్యేలా చూడడం, స్వంత సిలబస్ పేరుతో వేల రూపాయలతో పుస్తకాలను అంటగట్టడాన్ని కఠినంగా అరికట్టాలి. కింది స్థాయిలో ఐఐటి, ఎంబిబిఎస్ కోచింగ్ పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే మాడ్యుల్స్‌కి అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని సామాజిక నిపుణులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని యుపిఎ హయాంలో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం అమలు అవసరం. అలాగే కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు,ఆంగ్లం, హిందీ వంటి భాషలను కేవలం ఫైనల్ పరీక్షలల్లో మార్కుల కోసమే తప్ప, పెద్దగా ప్రాధాన్యతనివ్వడం లేదు, లాంగ్వేజ్ సబ్జెక్టుల క్లాసులను కూడా కుదించి, కోచింగ్ సబ్జెక్ట్‌లే చెప్పుతుండడంతో, ఆయా భాషల సాహిత్యం, మాధుర్యం పిల్లలకు దక్కకుండా పోతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదిలోనే గడపడంతో విద్యార్థులకు సమాజంపై అవగాహన, పరిపూర్ణ మానసిక వికాసం లేకుండా పోతుంది. అన్నిటికంటే ముఖ్యంగా కరోనాలో అలవాటైన ఆన్‌లైన్ క్లాసులతో విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు అతుక్కుపోయి, పుస్తకపఠనంపై ఆసక్తి కోల్పోతున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీలో పది నిమిషాలు పత్రికా పఠనాన్ని తప్పనిసరి చేయడం మంచి పరిణామం. తెలంగాణలో కూడా ఈ విధానంతో పాటు, ఒక క్లాసు ప్రత్యేకంగా పుస్తక పఠనంకోసం కచ్చితంగా అమలు చేయాలి. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో కూడా స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సిసిలను తప్పనిసరి చేయడం ద్వారా విద్యార్థుల్లో దేశ భక్తి, సామాజిక బాధ్యతలకు పిన్న వయస్సులోనే బీజం వేయవచ్చు.

తెలుగులో బాల సాహిత్యాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే సాహిత్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి, పిల్లల వార,మాస పత్రికలను పాఠశాలలకు వెళ్ళేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. తెలంగాణ ఏర్పడిన తరువాత ఎంతో ప్రతిష్టాత్మకమైనదిగా పేరున్న ఉస్మానియా యూనివర్సిటీ సహా పలు యూనివర్సిటీల ప్రతిష్ట క్షీణిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెయ్యి కోట్ల నిధులు ఉస్మానియాకు కేటాయించడం ప్రశంసనీయం. అదే సమయంలో దశాబ్దకాలంగా ఖాళీ అవుతూ వస్తూ, ప్రస్తుతం 11 యూనివర్సిటీలలో 2878 ప్రొఫెసర్ పోస్టులకు, 2125 ఖాళీగా ఉండడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. వీటిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వరంగంలో విద్యా వ్యవస్థ పరిఢవిల్లితేనే పరిపక్వ సమాజంతో పాటు, దేశాభివృద్ధికి సుశిక్షితమైన మానవవనరులు అందివస్తాయి. దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవర్‌లాల్ నెహ్రూ దూరదృష్టితో ఏర్పాటు చేసిన ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్‌లు నేటికీ గొప్ప ఫలితాలిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే.

# పాప్‌కార్న్



## స్కాటిష్ వ్యక్తి ప్రవేశపెట్టిన భారత తొలి బడ్జెట్

భారతదేశ తొలి కేంద్ర బడ్జెట్‌ను ఒక భారతీయుడు కాకుండా స్కాట్లాండ్‌కు చెందిన జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టాడన్న విషయం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తుండవచ్చుగానీ, అది అక్షరాలా నిజం. 1860 ఏప్రిల్ 7న, బ్రిటిష్ పాలన కాలంలో భారతదేశ తొలి బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. జేమ్స్ విల్సన్ అప్పట్లో బ్రిటిష్ భారతదేశానికి ఆర్థిక మంత్రిగా వ్యవహరించారు. ఈ బడ్జెట్ భారత స్వాతంత్ర్యానికి ముందు రూపొందించిన తొలి అధికారిక ఆర్థిక పత్రం. అప్పట్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర అసమతుల్యతతో ఉండేది. 1857 సిపాయిల తిరుగుబాటు తరువాత ప్రభుత్వ ఖజానాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆదాయాన్ని పెంచడం, పన్నుల వ్యవస్థను సక్రమంగా ఏర్పా టు చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందింది. ఆదాయపు పన్నును తొలిసారిగా ప్రవేశపెట్టడం కూడా ఈ బడ్జెట్‌లోని కీలక అంశం. భారత ఆర్థిక పరిపాలనకు ఒక పద్ధతి, నిర్మాణం తీసుకురావడంలో ఈ తొలి బడ్జెట్ కీలక పాత్ర పోషించింది. భారత బడ్జెట్ చరిత్రకు ఇది ఆరంభ అధ్యాయంగా నిలిచింది.

కాగా, స్వాతంత్ర్య భారతదేశంలో తొలి బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న ఆర్‌కె షణ్ముఖం చెట్టీ ప్రవేశపెట్టారు. అయితే, అది 1947 ఆగస్టు నుంచి 1948 మార్చి వరకు ఉన్న కాలానికి సంబంధించిన మధ్యంతర బడ్జెట్.


## అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి

భారతదేశ చరిత్రలో అత్యధిక సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వ్యక్తిగా మొరార్జీ దేశాయ్ పేరు నిలిచిపోయింది. ఆయన మొత్తం పదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రాజకీయ నాయకుడు. ఆయన ఆర్థిక మంత్రిగా, ఉప ప్రధానిగా, చివరకు ప్రధానిగా కూడా పనిచేశారు. ఆయన బడ్జెట్‌లు క్రమశిక్షణ, మితవ్యయం, ఆర్థిక నియంత్రణలకు ప్రాధాన్యం ఇచ్చినవిగా గుర్తింపు పొందాయి. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆదివారం తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఆమె, అత్యధిక పర్యాయాలు ఈ ఘనతను పొందిన చిదంబరంతో రికార్డును పంచుకుంటారు. వచ్చే ఏడాది కూడా బడ్జెట్‌ను సమర్పిస్తే, ఆమె మొరార్జీతో సమవుజ్జీగా నిలుస్తారు. అయితే, మొరార్జీ తన బడ్జెట్‌ల ద్వారా పన్నుల వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడం వంటి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లారు. భారత ఆర్థిక విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత కీలకమైనది.



## 1973లో 'బ్లాక్ బడ్జెట్'

అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంతరావ్ బి. చవాన్, 1973 ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'బ్లాక్ బడ్జెట్'గా పిలుస్తారు. ఇందుకు ప్రధాన కారణం ఆ ఏడాది దేశం ఎదుర్కొన్న భారీ ఆర్థిక లోటు. నాటి ఆర్థిక లోటు సుమారు రూ.550 కోట్లకు చేరింది. 1971 భారత–పాక్ యుద్ధం, 1972 కరువు దేశ ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీశాయి. ఆహార కొరత, ద్రవ్యోల్బణం, ప్రభుత్వ ఖర్చుల పెరుగుదల వంటి సమస్యలు తీవ్రమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల్లో నిరాశను కలిగించింది. అందుకే దీనిని 'బ్లాక్ బడ్జెట్'గా వ్యవహరించారు. అయితే, ఇది దేశం ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను ప్రతిబింబించే నిజాయితీగల బడ్జెట్‌గా కూడా చరిత్రలో గుర్తిండిపోతుంది.



## తొలి పూర్తికాల మహిళా ఆర్థిక మంత్రి

భారతదేశ తొలి పూర్తి కాల మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించారు. 2019 నుంచి ఆమె ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఇందుకు ముందు ఇందిరాగాంధీ 1970లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ, అది పూర్తి కాల బాధ్యతగా నిర్వహించలేదు. మొరార్జీ దేశాయ్ రాజీనామా తరువాత తాత్కాలికంగా ఆమె ఆర్థిక శాఖను నిర్వహించారు. కానీ నిర్మలా సీతారామన్ పూర్తి కాల ఆర్థిక మంత్రిగా వరుసగా ఎనిమిది పర్యాయాలు బడ్జెట్‌లను ప్రవేశపెట్టడం విశేషం.

### అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం

నిర్మలా సీతారామన్ 2020 ఫిబ్రవరి 1న చేసిన బడ్జెట్ ప్రసంగం భారత చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైనది. ఈ ప్రసంగం 2 గంటల 42 నిమిషాల పాటు సాగింది. చివర్లో ఆమె అస్వస్థతకు గురవడంతో రెండు పేజీలు చదవకుండానే ప్రసంగాన్ని ముగించారు. అయినప్పటికీ, ఇది ఒక రికార్డుగా నిలిచింది. ఈ బడ్జెట్‌లో అనేక రంగాలకు సంబంధించిన విస్తృత ప్రకటనలు ఉండటం వల్ల ప్రసంగం ఎంతో దీర్ఘంగా మారింది.



## బడ్జెట్ తేదీ, సమయం మార్పు

భారతదేశంలో కేంద్ర బడ్జెట్‌ను ఎప్పుడూ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టేవారని చాలామంది భావిస్తారు. కానీ ఇది ఎప్పటినుంచో అలా కాదు. 1999 వరకు బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పని దినంలో సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు. ఇది బ్రిటిష్ కాలపు సంప్రదాయం. 1999లో యశ్వంత్ సిన్హా ఈ సంప్రదాయాన్ని మార్చి ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2017 లో అరుణ్ జైట్లీ మరో కీలక మార్పు చేసి, బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ముందే విధానాలను అమలుచేసే అవకాశం లభించింది.



## 1997 'డ్రీమ్ బడ్జెట్'

పి. చిదంబరం, 1997లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'డ్రీమ్ బడ్జెట్'గా పిలుస్తారు. ఇది భారత ఆర్థిక సంస్కరణలకు బలమైన పునాది వేసింది. ఆదాయపు పన్ను గరిష్ఠ రేటును 40 శాతం నుంచి 30 శాతానికి తగ్గించడం, కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు, ఎక్సైజ్ పన్నుల సరళీకరణ వంటి కీలక నిర్ణయాలు ఇందులో ఉన్నాయి. ఈ బడ్జెట్ పెట్టుబడిదారులు, మధ్యతరగతి ప్రజల్లో విశేష ఆదరణ పొందింది.



## బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధానులు

భారతదేశంలో నలుగురు ప్రధాన మంత్రులు ఆర్థిక మంత్రుల బాధ్యతలు చేపట్టి బడ్జెట్ ప్రవేశపెట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ , మొరార్జీ దేశాయ్, రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ ఈ జాబితాలో ఉన్నారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా సేవలు అందిస్తూ, బడ్జెట్ ప్రవేశపెట్టారు. తర్వాతికాలంలో ఆయన ప్రధాని అయ్యారు.




## రైల్వే బడ్జెట్ విలీనం

సాధారణ బడ్జెట్‌తో సంబంధం లేకుండా, 2016 వరకు రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టేవారు. ఇది ఒక ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగింది. చివరిసారిగా 2016 ఫిబ్రవరి 25న సురేష్ ప్రభు రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టా రు. 2017 నుంచి రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. దీనివల్ల ఆర్థిక ప్రణాళికలో సమగ్రత పెరిగింది.

– బిఎస్‌ఎస్ మైత్రేయి

## 1986 'క్యారెట్ అండ్ స్టిక్' బడ్జెట్

1986లో విపి సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'క్యారెట్ అండ్ స్టిక్' బడ్జెట్‌గా పిలిచారు. ఇందులో ఒకవైపు పన్ను సౌలభ్యాలు, మరోవైపు కఠిన చర్యలు ఉన్నాయి. మోడ్వాట్ విధానాన్ని ప్రవేశపెట్టి పన్నుల భారం తగ్గించారు. అదే సమయంలో పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు ప్రకటించారు.



## తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిపిఐ రాష్ట్ర సహాయ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సిపిఐ హనుమకొండ జిల్లా సమితి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శనివారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలోసిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు గారి 55వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షలను బోర్డు నిబంధనల మేరకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశించారు. ఫిబ్రవరి 2 నుండి ఇంటర్ ప్రాక్టికల్స్, 25 నుండి థియరీ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వరంగల్, హన్మకొండ జిల్లాల పరీక్ష నిర్వాహకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల పర్యవేక్షణ, ల్యాబ్ పరికరాలు, ఫర్నీచర్, విద్యుత్, గాలి, నీటి వసతులు, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా అన్ని శాఖల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల భద్రత, వాహనాల రాకపోకలు, కార్యాలయ విధులపై డిఐఈఓలు పూర్తి వివరాలు వెల్లడించారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉదయం, సాయంత్రం రెండు పూటలా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటిండెంట్లను నియమించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్ 9240205555ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంటర్ విద్యాధికారులు గోపాల్, డాక్టర్ శ్రీధర్ సుమన్, డిఈసి సభ్యులు, సీనియర్ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు. సీలు సాంప్రదాయ రీతిలో ఈ ప్రయాణాన్ని జరుపుతారు.ముగింపు ఈ వన ప్రవేశంతో చింతలగట్టు వట్టేవాగు జాతర ముగుస్తుంది.

## పక్కాగా నామినేషన్ల పరిశీలన



**ప్రజాపక్షం/జనగామ :**నామినేషన్ల పరిశీలన, స్క్రూటిని పక్కాగా జరగాలని జనగామ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం నామినేషన్ల పరిశీలన గురించి మున్సిపల్ కమీషన్లు, రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్స్‌తో గూగుల్ మీట్ నిర్వయించారు. ఈ సందర్భంగా నామినేషన్ల పరిశీలన విధానం గురించి కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారి చేశారు. నామినేషన్ల స్క్రూటిని సమయంలో ధ్రువ పత్రాల పరిశీలన విధానం అభ్యర్థుల అర్హత, రిజర్వేషన్ చట్టపరమైన అంశాలపై స్పష్టత ఉండాలన్నారు. ప్రతి ధరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, ఎన్నికల నియమావలి ప్రకారం పారదర్శకంగా నిష్పక్షపాతంగా ప్రక్రియ జరగాలన్నారు. స్క్రూటిని ప్రక్రియలో ఏమైన సందేహాలు ఉంటే వెంటనే పై అధికారులను సంప్రదించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు.

**మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. అందరు ఆర్ఓలు నామినేషన్ పత్రాలు క్షుణంగా పరిశీలించి అభ్యర్థులదను ఖరార్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా రిజెక్ట్ చేస్తే ఆదివారం అపిలేట్ అథారిటి అయినా ఆర్‌డిఓని సంప్రదించాలన్నారు.

## అధికారులు జవాబుదారీగా ఉండాలి

సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** అధికారులు జవాబుదారిగా ఉండాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు.శనివారం మండల మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టి నూతన క్యాలెండర్ ఆవిశ్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.గ్రామాల అభివృద్దికి,పాలనలో పారదర్శకత,సహ చట్టంతోనే సాధ్యమని అన్నారు.సహ చట్టం సామాన్యుడికి ఒక వజ్రాయుధమని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టి కాటారం సబ్ డివిజన్ కన్వీనర్,చింతల కుమార్ యాదవ్,మండల కమిటీ సభ్యుడు బూడిద రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన జిపిఓపై చర్యలు తీసుకోండి

## మేడారం జాతర సక్సెస్‌లో మంత్రి సీతక్క కీలక పాత్ర

**ప్రజాపక్షం/మంగపేట/మేడారం:**ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతర తెలంగాణ కుంభమేల గా పేరుగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం నందు ఆదివాసీ సాంప్రాదాయలతో భక్తి శ్రద్దలతో జనవరి 28 నుండి 31 వ తారీకు వరకు జరిగిన సమ్మక్క సారలమ్మల జాతరలలో ఎటువంటి అవాంచనియా సంఘటన లు జరగకుండా అన్ని శాఖల అధికారులచే సమన్వయము చేస్తూ దగ్గర ఉండి పర్యవేక్షణ చేస్తూ మునుపెన్నడు లేని విధంగా మేడారంను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతర ను విజయవంతం చేసిన మన ఆడబిడ్డ సమ్మక్క సారలమ్మ ల ప్రతిరూపం తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ధన్యవాదములు తెలిపారు.

## ఒసి హక్కుల కోసం కేంద్రంపై ఒత్తిడి

**ప్రజాపక్షం/నెక్కొండ:**జంతర్‌మంతర్ వేదికగా మహా ధర్నాకు పిలుపు ఓసి వర్గాల హక్కులను రాజకీయంగా పక్కన పెట్టే ధోరణికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే లక్ష్యంతో తెలంగాణ ఓసి జేఏసి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఓసి జెఏసి ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షులు దుబ్బా శ్రీనివాస్ ప్రకటించారు. ఈ ధర్నా ఉదయం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ ధర్నా కార్యకరమంలో నెక్కొండ మండల ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శి భూపతి వీరన్నతో పాటు ఆర్యవైశ్య ముఖ్య నాయకులు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ మారం రాము, జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్ల వెంకటరనారాయణ, దొడ్డ

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి* రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే తొర్రూరు పట్టణాన్ని తాను దత్తతా తీసుకొని అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఒకటవ వార్డు, రెండవ వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తూనం శ్రావణ్‌కుమార్, తాళ్లపల్లి శ్రీలత రమేశ్‌గౌడ్‌లను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన రోడ్‌షోలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఏదులాపురం ఏ విధంగా అభివృద్ధి చెందిందో అదే విధంగా తొర్రూరు పట్టణాన్ని దత్తత తీసుకొని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ నియోజకవర్గానికి 3500ఇండ్లు కట్టించి చూపించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించి పేదలకు అండగా నిలిచామని తెలిపారు. ప్రతీ ఏప్రిల్‌లో మరో విడతలో ఇండ్లు అర్హులైన పేదలందరికి అందిస్తామని తెలిపారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రేషన్ కార్డులు వంటివి అందించామని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి స్ట్రాంగ్ పిల్లర్ల వంటి నాయకులు ఏడుగురు ఉన్నారని, ఒకొక్కరు కథానాయకులుగా మారి మున్సిపాలిటీలను గెలిపించుకుంటామన్నారు. తొర్రూరు అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు అయ్యాయని, మరో రూ.25కోట్లు మంజూరు చేస్తామన్నారు. గతంలో మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిస్తే ఆ వార్డుల్లో ఒక్క రూపాయి గత ప్రభుత్వం నిధులిచ్చింది లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికి అర్థమయ్యే విధంగా ప్రతీ ఒక్క కార్యకర్త అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సీపీఐ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ముఖ్య నాయకులు, వివిధ వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణ అందరి బాధ్యత

రూ.1.35 కోట్లతో ప్రభుత్వ బాల సదనం భవనానికి శంకుస్థాపన* వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పూర్తిస్థాయి పట్టణ పరిధిలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు అధికారులపై కూడా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శనివారం న్యూ శాయంపేట, 31వ డివిజన్‌లో హనుమకొండ జిల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు,వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ బాల సదనం (బాలికల) నూతన భవనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.సుమారు 100 మంది రక్షణ సంరక్షణ అవసరమున్న బాలికలకు ఆశ్రయం కల్పించేలా ఈ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోపు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతికి అనుగుణంగా అభివృద్ధి సాగితేనే అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. చెట్లు, ప్రభుత్వ స్థలాలను కాపాడుకుంటే పట్టణాలు అభివృద్ధికి నిలయాలుగా మారతాయన్నారు.

**జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి జయంతికి సన్మానం**

శంకుస్థాపన అనంతరం పదవీ విరమణ పొందుతున్న జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి జెట్టి జయంతిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చివరి రోజు కూడా అంకితభావంతో పని చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మోహన్ రావు, శివశంకర్, డివిజన్ అధ్యక్షులు సురేందర్, ఆర్జేడీ ఝాన్సీ రాణి, జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి జయంతి, హనుమకొండ సిడిపివో విశ్వజ, కాజీపేట తహశీల్దార్ రాజ్‌కుమార్, టీజీఈడబ్ల్యుఐడిసి డీఈఈ రవీందర్, ఏఈ అజీజ్, బాలసదనం సూపరింటెండెంట్ కళ్యాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ వెల్ఫర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క - సారలమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/కాజీపేట :** హన్మకొండ జిల్లా కాజీపేట మండలం పరిధిలోని అమ్మవారిపేట సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా శనివారం ఉదయాన్నే సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించి, గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా పూజారులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జాతర విజయవంతం చేసిన పోలీసు, మున్సిపాలిటీ, వైద్య, విద్యుత్, తదితర శాఖల వారికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.ఎమ్మెల్యే వెంట టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, ఛైర్మన్ , కమిటీ సభ్యులు స్థానిక నాయకులు కార్యకర్తలు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు జాతీయ హోదా

బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములుడిమాండ్

**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధికెక్కిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగుతున్న మహా జాతరకు కోటి మందికి పైగా దేశ నలుమూలల నుండి గిరిజనులు గిరిజనేతరులు పాల్గొని పోరాట స్ఫూర్తి ప్రధాతలైన సమ్మక్క సారలమ్మల దర్శించుకున్నారన్నారు. . ఉత్తరాదిలో జరిగే కుంభ మేళాలకు ఖర్చు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దక్షిణాదిపై వివక్ష సరికాదని, మేడారం జాతరకు జాతీయ హోదా కలిగించి జాతర అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. ఈనాటి కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమ్మక్క సారమ్మలు అందించిన పోరాట స్ఫూర్తితో ప్రజలు పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు. జాతర సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్



**ప్రజాపక్షం/ములుగు:**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కుటుంబ సమేతంగా శనివారం ఉదయం 5గంటలకు మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ముందుగా నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెంట అదనపు కలెక్టర్ మహేందర్ జి, ఎండోమెంట్ శాఖ అధికారులు ఉన్నారు.

## త్వరలో భూపాలపల్లికి సిఎం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి త్వరలో భూపాలపల్లికి రానున్నారని, వారి పర్యటనను భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు ,అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు.శనివారం ఎమ్మెల్యే జీఎస్సార్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, వివిధ మండలాల అధ్యక్షులతో కలిసి గణపురం మండలం చెల్పూరు గ్రామ శివారులోని కర్నాలకుంట చెరువు పక్కన ఉన్న ఖాళీ మైదానాన్ని పరిశీలించారు.

**కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం మొత్తం కలియ తిరుగుతూ, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

## విద్యార్థినులకు స్కూళ్లలో శానిటరీ ప్యాడ్స్

సుప్రీంకోర్టు తీర్పుపై ఎంపి కావ్య హర్షం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యాహక్కులో భాగంగా.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం (రుతుక్రమ ఆరోగ్యం) మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే గత ఏడాది వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో నెలసరి ఆరోగ్య అంశంపై గళమెత్తారు. బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న నెలసరి సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించి, తగిన విధానాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపి కడియం కావ్య కోరారు. ఇదే అంశంపై అత్యున్నత న్యాయస్థానం సైతం కీలక తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పాఠశాలలకు పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించాలని, కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సుప్రీంకోర్టు.. తాజాగా తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నెలసరి పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.మహిళల రక్షణ, సౌకర్యాలు, సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్ సభలో కీలక ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. అలాగే నెలసరి సమయంలో మహిళలకు పెయిడ్ లీవ్, విద్యార్థినులకు సెలవు ఇవ్వాలని కూడా ఆ బిల్లులో ఎంపికడియం కావ్య ప్రతిపాదించారు.

## ఎన్నికల నిర్వహణకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 నిర్వహణ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 24x7 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాలు, సూచనలు స్వీకరించబడతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుండి జిల్లా యంత్రాంగానికి వచ్చే ఫిర్యాదులను మూడు రోజుల లోపు పరిష్కరించి, వాటి నివేదికలను ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ హెల్ప్‌డెస్క్‌కు సంబంధించిన సెల్ నంబర్: 9030632608 కాగా, ఇది 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. హెల్ప్‌డెస్క్ నిర్వహణకు కింది సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.ఎస్.కే. అమ్జద్ అహ్మద్ అబ్బాస్, నాయబ్ తహసీల్దార్ (ఎన్నికలు) హెచ్ సూపరింటెండెంట్ ఎస్.సువర్ణ ఐటీ సెల్ (ఎన్నికలు) పి.నవీన్ సీనియర్ అసిస్టెంట్, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 106 నామినేషన్లు తిరస్కరణ

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపాలిటీలో 106 నామినేషన్లు తిరస్కరించబడ్డాయి. ఈనెల 30వ తేదీ నాటికి 30 వార్డులకు గాను 200 నామినేషన్లు వేయగా అధికారులు శనివారం స్క్రూటిని నిర్వహించారు. 106 నామినేషన్లు తిరస్కరించబడగా 186 మంది పేర్లను ప్రకటించనున్నారు. విత్ డ్రాల అనంతరం బరిలో నిలిచే సంఖ్య తేలనుంది. రాజకీయ పార్టీల పరంగా పరిశీలిస్తే బీఎస్పీ నుండి 2, బీజేపి నుండి 37, సీపీఎం నుండి 4, కాంగ్రెస్ నుంచి 86, బీఆర్ఎస్ నుంచి 41 నామినేషన్లు ఉన్నాయి. 126 మంది అభ్యర్థుల పేర్లను శనివారం ప్రకటించగా సోమవారం విత్‌డ్రాల అనంతరం బీ ఫార్మ్‌ల సమర్పణ తర్వాత పూర్తిస్థాయి జాబితా ప్రకటించనున్నారు.

## కాంగ్రెస్‌లో తేలని సీట్ల పంచాయతీ

**ప్రజాపక్షం/జనగామ:**మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారాయి. టికెట్ల కేటాయింపు ఇంకా కొలిక్కి రాలేదు. నాకంటే నాకు అంటు ముగ్గురి నేతల మధ్య పంచాయతీ జరుగుతోంది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భావమరిది సైతం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇప్పటికి టిక్కెట్లు ప్రకటించలేదు. డిసిసి అధ్యక్షురాలు ఒక్క సీటు కోసం కుస్తీ పడుతున్న పరిస్థితి. ఇక తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే టిక్కెట్లపై హామీలు ఇస్తున్నారని కొందరు వార్డు సభ్యులు రాజీనామాకు చేస్తామంటు బెదిరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. జనగామలో 30 వార్డులు ఉండగా 292 నామినేషన్లు వేశారు. స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీలో 181 నామినేషన్లు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండే అత్యధికంగా నామినేషన్లు వేసిన పరిస్థితి. ఈ నెల 3వ తేదీ వరకు బిఫాంలు సమర్పిస్తేనే పార్టీ వ్యక్తిగా గుర్తిస్తారు. లేకుంటే నామినేషన్ పరిగణలోకి తీసుకోబడదు. స్టేషన్ ఘనపూర్‌లో 18 వార్డులు ఉండగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారధ్యంలో అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యింది. అయితే జనగామలో 30 వార్డులు ఉండగా ఇ ప్పటికి అధికారికంగా ఒక్క వార్డు కూడా ప్రకటించలేదు. కొందరికి నోటి మాటతో హామి ఇవ్వడంతో నామినేషన్లు వేశారు. బిఫాం వచ్చే వరకు ఎవరికి నమ్మకం లేని పరిస్థితి.

**మంత్రి పొన్నం భావమరిదికి చుక్కెదురు**

జనగామ మున్సిపాల్టీ 6వ వార్డు నుండి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భావమరిది పెద్ది న వీన్‌కుమార్ టిక్కెట్టు ఆశించారు. మొదట్లో ఒ కే చెప్పినా తరువాత సందిగ్ధంలో పెట్టారు. ఆ వార్డు టిక్కెట్టు నాని అనే మెడికల్ షాపు య జమానికి హామీ ఇవ్వడంతో నామినేషన్ వేశా రు. పొన్నం ప్రభాకర్ భావమరిది నవీన్‌కుమార్‌గౌడ్ కోసం చివరకు టిపిసిసి అధ్యక్షు డుమహేష్‌కుమార్‌గౌడ్ సైతం రంగంలోకి ది గాల్సి వచ్చింది. అయినా పెద్ది నవీన్‌కుమార్‌గౌడ్ నామినేషన్ వేశారు. ఇదే కాకుండా 1 9,26లో ఇద్దరిద్దరికి హామీ ఇచ్చారు. 18లో అభ్యర్థి లేకపోవడంతో చివరకు ఓ వ్యక్తితో నామినేషన్ వేయించినట్లు తెలుస్తుంది.

**ఒక్క టిక్కెట్టు కోసం డిసిసి అధ్యక్షురాలు కుస్తీ**

జనగామ మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో ఒకే ఒక వార్డు ఎస్టీకి రిజర్వ్ చేయబడింది. అది కూడా మొదటి వార్డు. ఇక్కడ ఎస్టీలు తక్కువే. అయితే గతంలో రెండు సార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన మూడ్ లక్ష్మ న్‌నాయక్ కోసం డిసిసి అధ్యక్షురాలు కుస్తీ పడుతున్నారు. నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాత్రం నాగరాజు అనే ఎరుకల కులానికి చెందిన వ్యక్తితో నామినేషన్ వేయించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ టిక్కెట్టు విషయంలో డిసిసి అధ్యక్షురాలు భర్త డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కొడుకు ప్రశాంత్‌రెడ్డి గొడవ పడినట్లు సమాచారం. ఇప్పటికీ ఈ సీటు విషయంలో ఇంకా క్యారిటీ లేదు. మూడ్ లక్ష్మ న్‌నాయక్‌కు ఇస్తారా..దేవరాజు నాగరాజుకు ఇస్తారా అన్నది సందిగ్ధం.

**పంతం నెగ్గించుకున్న చామల**

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరన్‌కుమార్‌రెడ్డి మాత్రం తన అనుచరుల విషయంలో పంథం నెగ్గించుకున్నట్లు తెలుస్తుంది. దావోస్‌లో ఉన్న ఆయన జనగామకు వచ్చే వరకు టిక్కెట్లపై కనీసం హామీ కూడా ఇవ్వలేదు. 30న నామినేషన్లకు చివరి రోజు కాగా 29న సాయంత్రం వచ్చి తనకు కావాల్సిన సీట్ల విషయం క్లారిటీగా చెప్పి వెళ్లిపోయినట్లు తెలుస్తుంది. తన అనుచరులు ఐదుగురికి టిక్కెట్లు ఇవ్వాలని తేల్చి చెప్పిన ఆయన వారిలో నామినేషన్లు వేయించినట్లు సమాచారం. నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ముందుపెట్టి చామల కిరన్‌కుమార్‌రెడ్డియే చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

**రాజీనామా దిశలో వార్డు అధ్యక్షులు**

ఇక కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో గోప్యంగా ఉంచడం, నాయకులు వారికి నచ్చిన వారితో నామినేషన్లు వేయించడంతో వార్డు అధ్యక్షులు రాజీనామాకు సైతం సిద్దమైన పరిస్థితి. తమకు తెలియకుండా అభ్యర్థు పేర్లు ఫైనల్ చే యడం, వారి చేత నామినేషన్లు వేయించడం సరియైంది కాదని మండిపడ్డారు. 8వ వార్డు ఎస్సీ రిజర్వ్‌డ్ కాగా తనను అడగకుండానే ఇతరులకు టిక్కెట్టు ఇచ్చారని బిసి వార్డు సభ్యులు మండిపడిన పరిస్థితి. గెలుపు గుర్రాలను పక్కకు పెట్టి తమకు నచ్చిన వారికి టిక్కెట్లు ఇచ్చుకుంటే కాంగ్రెస్ మరోసారి అబాసుపాలు కాక తప్పదనే చర్చ జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చావు తప్ప కళ్లు లొట్టబోయినట్లు కొద్ది స్థానాలకు పరిమితమైన కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లోనూ నియోజకవర్గంలోని జనగామ, చేర్యాల నియోజకవర్గాల్లో దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు.

## పకడ్బందిగా ప్రత్యేక సమగ్ర సవరణ

**ప్రజాపక్షం/జనగామ :**ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వయించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలన్నారు. ఓటరు జాబితాలో గల ఓటర్ల మ్యాపింగ్, పకడ్బందిగా చేపట్టాలన్నాను. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరుపున బూత్ స్థాయి ఎజెంట్లను నియమించాలన్నాను. విసి అనంతరం జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిపై కలెక్టర్ మాట్లాడారు. ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకొని ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, బెన్‌షాలోమ్, ఆర్‌డిఓ గోపిరాం తదితరులు పాల్గొన్నారు.

# హస్తంలో సయోధ్య కుదిరేనా..?

## పోటాపోటీగా నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. కొందరు ఒకే వర్గం నుంచి మున్సిపల్ చైర్మన్ స్థానం కోసం ప్రయత్నం చేస్తుండగా మరికొన్ని చోట్ల వర్గపోరుతో పోటాపోటీగా నామినేషన్లు వేశారు. బిఫామ్ సంగతి పక్కనపెడితే సయోధ్య కుదరకుండ ఎన్నికల్లో గెలుపు ఎలా అన్నది ఇప్పుడు కాంగ్రెస్ నేతలను ఆలోచించేలా చేస్తుంది. ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా వైరాలో ఇద్దరు మంత్రుల అనుచరుల మధ్య పోటాపోటీ నెలకొంది. వైరా మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానం మహిళలకు రిజర్వు చేయబడింది. చైర్‌పర్సన్ స్థానం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అనుచరుడు, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు బొర్రా రాజశేఖర్ పోటీ పడుతున్నారు. ఇద్దరు చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సతీమణి 11, 15 వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేయగా బొర్రా రాజశేఖర్ సతీమణి ఉమాదేవితో పాటు బొర్రా రాజశేఖర్ తల్లి, వైరా మాజీ సర్పంచ్ పద్మావతి కూడా నామినేషన్ దాఖలు చేశారు. అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. మధిరలో కూడా ఇదే పరిస్థితి. కాకపోతే స్థానిక శాసనసభ్యుడు కూడా అయినా ఉప ముఖ్యమంత్రి వర్గం నుంచే చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ కుల సమీకరణలకు అనుగుణంగా చైర్మన్ స్థానాన్ని కేటాయించాలని కోరుతున్నారు. కొందరు కావాలనే మిత్రపక్షాల మధ్య సయోధ్య కుదరనివ్వడం లేదని సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే మధిరలో సైతం కాంగ్రెస్ గట్టి పోటీని ఎదుర్కొనక తప్పకపోవచ్చు. ఇప్పటికే సిపిఎం, బిఆర్ఎస్ ఉమ్మడిగా పోటీ చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించాయి. కల్లూరులోనూ ఇదే పరిస్థితి. కాంగ్రెస్‌లో సయోధ్య కుదరకపోవడం అభ్యర్థులను ఎంపిక చేయడంలో జరిగిన జాప్యం అధిక సంఖ్యలో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ వేయడానికి కారణమైంది. సత్తుపల్లిలో కూడా ఇదే పరిస్థితి. కొత్తగూడెంలో ప్రత్యేక పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లో ఒక వర్గం హడావుడి చేస్తుండగా మరో వర్గం దీనిని సహించలేకపోతుంది. కొత్త పెత్తనంపై అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఇల్లందు, అశ్వారావుపేటలోనూ అధికార కాంగ్రెస్‌లో సఖ్యత అంతగా లేదన్న ప్రచారం జరుగుతుంది. కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో ఉంటామని ఇప్పటికే ప్రకటించారు. మొత్తంగా నామినేషన్ల ఉపసంహరణకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో కాంగ్రెస్ పెద్దలు వార్డుల వారీగా కూర్చుని అభ్యర్థుల మధ్య సయోధ్య కుదర్చుని పక్షంలో ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఖర్చుపై చర్చలు :**

అభ్యర్థిత్వం కోరుతున్న వారు ఎంత ఖర్చు చేయగలరని పార్టీ నాయకత్వం ప్రశ్నిస్తుందని ఓ అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంత కాలం పార్టీ జెండాను నమ్మి పార్టీ కోసం పనిచేస్తే ఇప్పుడు ఆర్థిక పరిస్థితులపై ఆరా తీస్తున్నారని కొందరు వాపోతున్నారు. పార్టీ జెండాలు మోస్తూ ప్రజల్లో ఉన్న వారిని పక్కనపెట్టి రకరకాల వ్యాపారాలతో ఆర్థికంగా సంపాదించుకున్న వారిని ఇతర త్రా పనులతో కూడబెట్టుకుని ఎన్నికల్లో ఖర్చు చేయడానికి సిద్ధమైతే వారిని బరిలోకి దింపేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఖర్చు చేస్తున్నారు అంత వేయగలరా మీ అభ్యర్థిత్వం ఖరారు చేసిన తర్వాత డబ్బులు లేవంటే పార్టీ దెబ్బతింటుందని నేతలు అభ్యర్థులను హెచ్చరిస్తున్నారని పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికలంటేనే ఓట్ల కొనుగోలని ఇటువంటివి తప్పక పోవచ్చునని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.



## ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో శనివారం సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో వారు విశేష సేవలు అందించారని కొనియాడారు. విధినిర్వాహణలో తోడ్పాటునందించిన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. భావిజీవితం కుటుంబసభ్యులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో డి.రామయ్య (ఎస్సై), వి.గోపి (ఏఆర్ఎస్సై), ఎస్‌కె యాకుబ్ పాషా (ఏఆర్ఎస్సై), పి.శాంతిరెడ్డి (ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్), జి.వెంకన్న (హోంగార్డు, పిఎల్ఏ) ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు అడ్మిన్ భోజా రామానుజం, లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసిపి సుశీల్‌సింగ్, ఆర్ఐ శ్రీశైలం, నాగుల్ మీరా, పోలీసు అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఆర్ ఎస్ఐ లక్ష్మణరావు, జిల్లా హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక శ్రీను, సభ్యులు సిహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పెంపు


**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం (కొత్తగూడెం) జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, దివ్యాంగ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోనుటకు గడువు పొడిగించినట్లు షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు డా॥ఎస్.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ద్వారా ఐదు నెలల పాటు వివిధ రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు ఆర్ఆర్‌బి, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోనుటకు ఫిబ్రవరి 22 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం మూడు లక్షల వరకు ఉన్నటువంటి వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర షెడ్యూల్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారిచే ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రవేశపరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఖమ్మం జిల్లా కేంద్రంలోని గల స్టడీ సర్కిల్‌లో నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్ ఛార్జీలు బుక్ ఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, సెల్ నెం. 9866726277, 7981988667ను సంప్రదించాలన్నారు.

## సైబర్ నేరస్తులు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** అన్‌లైన్‌లో ట్రైడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 18 లక్షల రూపాయలు కాజేసి మోసంచేసిన కేసులో ఇద్దరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్‌క్రైం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి వాట్సప్‌లో పరిచయమైన ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో పెట్టుబడిపెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి ట్రేడింగ్ లింక్‌లు పంపి వాటి ద్వారా సుమారు 18 లక్షల రూపాయలు కాజేశారు. మోసపోయానని గుర్తించిన సదరు బాధిత ఉద్యోగి సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించగా కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చివరిగా ఒక లక్ష ఎనభైవేల రూపాయలు బదిలి అయిన రెండు బ్యాంక్ ఖాతాలు ఆంధ్రప్రదేశ్ వైజాగ్‌కు చెందిన ఉమాశంకర్, హేమలతవిగా గుర్తించి అక్కడకు వెళ్లి వారిని అరెస్ట్ చేశారు. నిందితులు ఇద్దరిని ఖమ్మం తీసుకువచ్చి శనివారం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలిపారు. కేసును చేధించిన సైబర్ క్రైం డిఎస్‌పి ఫణిందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు భానుమూర్తి, కిషన్‌రావు, కృష్ణప్రసాద్, అఫ్సనాలను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఈ సందర్భంగా అభినందించారు.

## సిపిఐ సీనియర్ నాయకులు జగ్గు బొందమ్మ మృతి

సంతాపం తెలిపిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం విజయనగరం గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ నాయకురాలు జగ్గు బొందమ్మ (72) గుండెపోటుతో శనివారం మృతి చెందారు విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, మాజీ సర్పంచ్ పాయం కామరాజు, కార్యవర్గ సభ్యులు నోముల రవి, నిమ్మల భాస్కర్ మాజి ఎంపిటిసి పాయం లక్ష్యం, సాంబాయిగూడెం ఉపసర్పంచ్ పులిగిల్ల రమేష్, బాడిస చిన్నారావు, మానాది రమేష్ పాల్గొని ఎర్రజెండా కప్పి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై దృష్టి

పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో దళితబంధు, మెప్మా, సోలార్ పవర్ ప్లాంట్స్, టూరిజం, భూ సేకరణ, ఇందిరా మహిళా డెయిరీ, తెలంగాణ పబ్లిక్స్ స్కూల్స్, అక్షయపాత్ర, ప్రభుత్వ కళాశాలలపై అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే పనులు వ్యక్తిగత శ్రద్ధతో త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. దళిత బంధు యూనిట్ల పెండింగ్ విడుదల పూర్తి చేయాలన్నారు. డైవర్ట్ అయిన యూనిట్ల విషయంలో చర్యలు వేగవంతం చేయాలన్నారు. మధిర నియోజక వర్గంలో మెప్మా కార్యకలాపాలు చేపట్టాలన్నారు. కొత్తగా 200 పట్టణ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు, 2వేల మంది కొత్త సభ్యుల చేర్పుకు చర్యలు తీసుకోవాలన్నారు. మధిరలో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు స్థలం గుర్తించాలన్నారు. బల్క్‌గా యూనిట్ల తయారీకి ఏజెన్సీతో టైఅప్ చేయాలన్నారు. ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించి ఇంకా చేపట్టాల్సిన చర్యలను వేగవంతం చేయాలన్నారు. పాల ధర ఎక్కువ వచ్చేలా హెరిటేజ్, మదర్, అమూల్ డెయిరీలను సంప్రదించాలన్నారు. మరో వైపు గేదెల కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. మధిర డిగ్రీ కళాశాల సిరిపురం ఐటిఐ బనిగండ్లపాడు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, డిఈవో చైతన్యజైని, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఎస్సి కార్పోరేషన్ ఈడి నవీన్ బాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, డిఆర్‌డివో శ్రీరామ్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## సేవలు కలకాలం గుర్తుంటాయి : ఎస్‌పి

**ప్రజాపక్షం/కొత్తగూడెం:** పోలీస్ శాఖలో సిబ్బంది ప్రజల కోసం చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ, ఏఆర్ ఎస్ఐలను తన కార్యాలయ అవరణలోని కాన్ఫిరెన్స్ హాల్లో ఘనంగా సత్కరించారు. 43 సం. పాటు పోలీస్‌శాఖలో పనిచేసి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మంచా నాయక్‌ను, 41 సం.తమ సేవలను అందించి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ సూర్యనారాయణలకు ఎస్‌పి పూల మాలలు వేసి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉద్యోగలు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం రోహిత్ రాజ్ మాట్లాడుతూ ఈ ఇద్దరు పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కంటుబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. వదవీ విరమణ పొందిన అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తనను సంప్రదించాలని, ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేసి రావాల్సిన ప్రతిఫలాలను త్వరలో అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఎంటిఓ సుధాకర్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిని సందర్శించిన బహుళ జాతి ఐటి సంస్థ వర్చుసా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ ఐటి రంగ సంస్థ వర్చుసా హెచ్‌ఆర్ తమ కళాశాలను సందర్శించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ టూ కార్పోరేట్ కార్యక్రమంలో వర్చుసా సంస్థ సీనియర్ హెచ్‌ఆర్ అభిషేక్ పాల్గొన్నారు. కార్పోరేట్ రంగానికి అవసరమైన మేళకువలు, విద్యార్థులకు అవసరమైన ఏఐ నైపుణ్యాలు, వ్యక్తిగత క్రమశిక్షణ వంటి అంశాలపై అభిషేక్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥జి.ధాత్రి మాట్లాడుతూ అమెరికా కేంద్రంగా ఐటి సేవలు అందిస్తున్న వర్చుసా కంపెనీ తమ కళాశాలను ఎంపిక చేసి విద్యార్థులతో ముచ్చటించడం భవిష్యత్తు కార్యాచరణపై అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హ్యాక్‌థాన్ ఐడియాథాన్ వంటి పోటీల్లో చురుగ్గా పాల్గొని టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని, దిశా నిర్దేశం చేసినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె.శ్రీచైతన్య తెలిపారు. విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలు, సందేహాలను హెచ్‌ఆర్ అభిషేక్ నివృత్తి చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్, గూగుల్, అడోబ్, సేల్స్ ఫోర్స్, పెగా వంటి అంతర్జాతీయ సంస్థలు క్లయింట్స్‌గా కలిగిన వర్చుసా సంస్థలో రానున్న రోజుల్లో ఇంటర్న్‌షిఫ్, వర్క్‌షాప్, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపై అవగాహన కలిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో తమ కళాశాల ప్రత్యేక గుర్తింపు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు భవిష్యత్తులో మరిన్ని బహుళ జాతి సంస్థలను కళాశాలకు ఆహ్వానించడంతో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, ఇన్నోవేషన్ బాధ్యులు డా॥ ఎం.మురళీమోహన్, వివిధ విభాగాల హెచ్‌వోడిలు, టిపివో సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్‌కిడ్జ్‌లో ముగిసిన 'స్పోర్ట్స్ మీట్'

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్పోర్ట్స్ మీట్‌లతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందుతుందని మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కంబంపాటి నారాయణరావు లు తెలిపారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడా పోటీల ద్వారా మరింత చురుకుతనం, ఏకాగ్రత, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తి పెరుగుతుందన్నారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వారి అభిరుచులకు తగినట్లుగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పాఠశాల ఛైర్మన్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు అన్ని రకాల క్రీడా పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు

దివ్యాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలకు అనుకూలంగా రూపొందించాలి

అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఆధునీక మౌలిక వసతులతో పాటు ప్రజలకు నడకలో సౌకర్యం, ఆరోగ్యం, భద్రత కల్పించేవిధంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతం నుండి చేపట్టనున్న ఫుట్‌పాత్‌పై వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసే పనులను, టైల్స్ డిజైన్ ఆకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నపిల్లలు, దివ్యాంగులు, వృద్ధులకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిచేవిధంగా పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి అనేది కేవలం రోడ్లు, భవనాల నిర్మాణంతోనే కాకుండా ప్రజల రోజువారి జీవితాన్ని సులభతరం చేసే మౌలిక వసతులతో ముడిపడి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల నడక ద్వారా ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి అత్యంత కీలకమన్నారు. తొలిసారిగా నగరంలో వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఈ యాకూబ్ అలీ, ఖమ్మం గ్రానైట్ యాజమాన్యాలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్సిజన్ 18 ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

దేశ అణుశక్తి రంగంలో మరో కీలక ముందడుగు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** దేశ అణుశక్తి రంగానికి కీలకమైన హెవీ వాటర్ ప్లాంట్ మణుగూరులో ఆక్సిజన్ 18 ప్లాంట్ నిర్మాణానికి శనివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటామిక్ ఎనర్జీ కమిషన్ (ఎఇసి)చైర్మన్, అణుశక్తి విభాగం(డిఎఇ)సెక్రటరీ డా.అజిత్ కుమార్ మొహంతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ కుమార్ మొహంతి మాట్లాడుతూ మణుగూరు హెవీ వాటర్ బోర్డుకు ఉత్పత్తి చేయడానికి ఆక్సిజన్ 18ను ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. అటామిక్ ఎనర్జీ విభాగంలో ప్రధానంగా భారీ నీటి ఉత్పత్తిలో సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇది భారీ నీటి రియాక్టర్లను పీడనను తద్వారా ఇండియన్ న్యూక్లియర్ పవర్ ప్రోగ్రామ్ యొక్క మొదటి దశలో మద్దతు ఇస్తుంది, హెచ్‌డబ్ల్యుబి దాని కార్యకలాపాలను ఆక్సిజన్ 18 ఉత్పత్తి విభాగాలను ఆరోగ్య సంరక్షణ దృష్టికి సమృద్ధిగా వాడవచ్చని క్యాన్సర్ కణాలు, మణికట్టులను ఉనికిని నిర్ధారించడానికి పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ స్కానింగ్ కోసం ఈ ఓ 18 ఆక్సిజన్ సుసంపన్నమైన నీరు అవసరం, నీరు కూడా తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో జీవక్రియ అధ్యయనాల్లో కూడా ఉపయోగించబడుతుందన్నారు. శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతి కోసం ఒక ముఖ్యమైన మైలురాయిలో, ఆక్సిజన్ 18 సుసంపన్నమైన నీటి ఉత్పత్తిలో భారతదేశం సామర్థ్యం సాధించింది. హెవీ వాటర్ బోర్డు మణుగూరు భారతదేశం యొక్క మొట్ట మొదటి ఆక్సిజన్ 18 ను మెరుగుపర్చిన నీటిని మెరుగుపర్చడానికి టెక్నాలజీ అభివృద్ధి చేసినది. ఈ ఆక్సిజన్ అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా ఉంటుందని, యుఎస్‌ఎలో పరీక్షా ప్రయోగశాల ద్వారా కూడా సరిపోలుతుందని, రేడియో ఫార్మాస్యూటికల్ కమిటీ నుండి ధృవీకరణను పొందిన తరువాత, ఉత్పత్తి వైద్య సైక్లోట్రాన్లో దాని సామీప్యాన్ని నిర్ధారించడానికి రేడియేషన్ మెడిసిన్ సెంటర్ ద్వారా పరీక్షించబడిందన్నారు. ఇప్పటికే హెవీ వాటర్ ప్లాంట్ మణుగూరు దేశ వ్యాప్తంగా విశ్వసనీయతను సాధించిందని, అనేక సాంకేతిక విజయాలను నమోదు చేసుకున్న ఘనత ఈ ప్లాంట్‌కు ఉందని ఆయన గుర్తు చేవారు. ఆ అనుభవం, నైపుణ్యంతోనే ఆక్సిజన్ 18 ప్లాంట్ నిర్మాణాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ దేశ అణుశక్తి రంగంలో మరింత కీలక పాత్ర పోషించనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈసీఎస్ ఛైర్మన్ అజిత్ కుమార్ మొహంతి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ హెవీ వాటర్ బోర్డు ఎస్ సత్య కుమార్, జనరల్ మేనేజర్ గంటసాల, జనరల్ మేనేజర్ ఈఎస్ఎస్‌పి రమాకాంత్ సాహు, సీనియర్ జియం గైదాని, డిజిఎం శర్మ, ఐఆర్ఓ కృష్ణకాంత్, సిఏఓ వేణు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భారజల యూనియన్ ప్రతినిధులు గడ్డం రమేష్, కూరపాటి శ్రీనివాస్, విష్ణువర్ధన్ రాజు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు రహదారి వివాదం

## అడ్డుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/చర్ల :** తేగడ ఇసుక ర్యాంపుకు లోడు కోసం వచ్చిన లారీలను తేగడ, మేడువాయి గ్రామస్తులు అడ్డుకున్నారు. తాలిపేరు ఒడ్డున గోదావరి తీరం వెంబడి అక్రమంగా మూడు కిలోమీటర్ల మేరా గ్రావెల్ రహదారిని ఇసుక లారీల కోసం శ్రీ వీరభద్ర మహిళా సాండ్ క్వారీ సొసైటీ వారు నిర్మించారు. శనివారం అక్రమ రహదారిపై వచ్చిన లారీలను ఆయా గ్రామస్తులు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. తమ గ్రామాల సమీపంలో సీతమ్మ సాగర్ కరకట్ట కోసం కేటాయించిన భూముల్లో రహదారులు వేసి ఇసుక తోలకాలు సాగించడం వల్ల రాబోయే వానా కాలంలో వరదలు వచ్చి తమతమ గ్రామాలు నీటమునిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలను అడ్డుకున్న మేడువాయి, తేగడ గ్రామస్తులకు, మహిళా సొసైటీ సభ్యులకు మధ్య తీవ్ర వివాదం మొదలైంది. తేగడ సర్పంచ్ జమ్ముల మురళీ, పంచాయితీ కార్యదర్శి హర్షిణి అక్కడకు చేరుకుని సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తేగడ గ్రామస్తులు చిరిగిడి నరేష్ ఇసుక లారీలను అడ్డుకోవడంతో వివాదం పెద్దదయింది. దనపై ధౌర్జన్యం చేసిన ఇసుక సొసైటీ మహిళలపై పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు నరేష్ తెలిపాడు. మొదట్నుంచి ఈ రహదారి పట్ల రెండు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల అనాలోచిత చర్య వల్ల ఈ అక్రమ రహదారి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ గ్రావెల్ రహదారిని నిలుపుదల చేసి తమ గ్రామాలను వరద ముప్పు నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## జంతువుల పట్ల కరుణ చూపాలి

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి పురందర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జంతువుల పట్ల కరుణ చూపాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా॥ బి.పురందర్ తెలిపారు. ఖమ్మం నగరంలోని గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥పురందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జంతు సంక్షేమ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంతువుల ఆరోగ్యం, సంరక్షణ, వీధి జంతువుల సమస్యలు, జంతువులపై జరిగే క్రూరత్వం, దుష్పరిణామాలను వివరించారు. జంతువులు మాట్లాడలేని జీవులని వాటి బాధను అర్థం చేసుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జంతు సంక్షేమం కేవలం ఒక కార్యక్రమం కాదని అవి జీవితాంతం పాటించాల్సిన విలువలన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థులు జంతువుల పట్ల కరుణను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో మానవీయ సమాజం నిర్మితమవుతుందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డా॥ కె.క్రాంతి కుమార్, జేవివో టి.కృష్ణ, మణిదీప్ పాల్గొన్నారు.

# తీరు మారని సంజూ...



టీమిండియా స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ పేలవ ఫామ్ కొనసాగుతోంది. వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ సంజూ శాంసన్ నిరాశపర్చాడు. హోమ్ గ్రౌండ్‌లో సొంత అభిమానుల మధ్య చెలరేగుతాడని అంతా భావించగా.. సంజూ మాత్రం అదే తప్పిదాన్ని పునరావృతం చేశాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా తిరువనంతపురం వేదికగా జరుగుతున్న ఆఖరి టీ20లో సంజూ.. 6 బంతుల్లో ఫోర్‌తో 6 పరుగులే చేసాడు. లాకీ ఫెర్గూసన్ బౌలింగ్‌లో సంజూ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ మ్యాచ్‌లోనూ సంజూ శాంసన్ తన తప్పిదాన్ని పునరావృతం చేశాడు. మరోసారి ఫుట్‌వర్క్ లేకుండా షాట్ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. ఎదుర్కొన్న 6 బంతులను బ్యాక్‌ఫుట్‌లోనే ఆడాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఫుట్‌వర్క్‌పై ఫోకస్ పెట్టాలని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచించినా సంజూ శాంసన్ పట్టించుకోలేదు. సంజూ శాంసన్ వైఫల్యంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లూజ్ మోషన్స్ ఏమైనా అయ్యాయా? ఆత్రం ఆగకుండా ఔటై వచ్చావని మండిపడుతున్నారు. కుక్క తోక వంకరేనని, సంజూ ఇక మారడని ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ట్విటర్‌కు ఎక్కువ.. టీమిండియాకు తక్కువని, జట్టులో అనవసరమని అభిప్రాయపడుతున్నారు. పీఆర్ స్టంట్స్‌తో సంజూ కెరీర్ కొనసాగిస్తున్నాడని మండిపడుతున్నారు. అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం ఇవ్వాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో వరుసగా ఐదుమ్యాచ్‌ల్లో 10, 6, 0, 24, 6లతో 46 పరుగులే చేసిన సంజూ శాంసన్.. టీ20 ప్రపంచకప్ 2026లో మొత్తం బెంచ్‌కే పరిమితం కానున్నాడు. 12వ ఆటగాడిగా వాటర్ బాటిల్స్ అందించనున్నాడు. తిలక్ వర్మ ఫిట్‌నెస్ సాధించి ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. అతను టీ20 ప్రపంచకప్ సమయానికి జట్టుతో కలవనున్నాడు. ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనుండగా.. తిలక్ నెంబర్ 3లో ఆడనున్నాడు. సంజూ మాత్రం బ్యాకప్ ప్లేయర్‌గా బాటిళ్లు మోయనున్నాడు. ఎంతో ప్రతిభ కలిగిన సంజూ శాంసన్.. నిలకడలేమి ఆటతోనే స్టార్‌డమ్ అందుకోలేకపోయాడు. గత 1213 ఏళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతున్నా.. తుది జట్టులో చోటును సుస్థిరం చేసుకోలేకపోయాడు.

## సూర్యలో రోహిత్ ఛాయలున్నాయ్

→ ఇర్ఫాన్ పఠాన్



టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంశల జల్లు కురిపించాడు. అతని ఆట తీరులో రోహిత్ శర్మ ఛాయలున్నాయని కొనియాడారు. ఒక టీం లీడర్‌గా అతను జట్టును నడిపించటంలో సేమ్‌టు సేమ్ రోహిత్‌ను తలపిస్తాడని పఠాన్ అన్నారు. టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కట్లేదన్నారు. 'రోహిత్ శర్మ తరువాత కెప్టెన్సీ బాధ్యలు తీసుకున్న సూర్య.. భారత జట్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించాడు. అతని కెప్టెన్సీలో 41 టీ20లు ఆడిన భారత్ 31మ్యాచ్‌లు గెలిచింది. 2025 ఆసియా కప్‌ను సైతం స్వాధీనం చేసుకుంది. సూర్య కుమార్ జట్టు కెప్టెన్‌గా అద్భుత ఫలితాలు సాధించినప్పటికీ అతను వ్యక్తిగతంగా పరుగులు చేయడంలో విమర్శలకు గురయ్యాడు. ముఖ్యంగా 2025లో ఆడిన మ్యాచ్‌లలో అతను చెప్పుకోదగిన పరుగులు చేయలేకపోయాడు. మొత్తం 21 మ్యాచ్‌లు ఆడిన సూర్య కేవలం 218 పరుగులు సాధించాడు. టి20 ప్రపంచ కప్‌కు ముందు సూర్యకుమార్ అతని ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరముంది' అని పఠాన్ అన్నాడు. కెప్టెన్‌గా అతను వరల్డ్‌కప్‌లో ఖచ్చితంగా ఆడతాడని పేర్కొన్నాడు. కానీ అంత కంటే ముందు అతను పరుగులు చేసి తన సత్తా ఏంటో నిరూపించుకోవాల్సిన అవసరముందని పఠాన్ అభిప్రాయపడ్డాడు.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత రిబకినా

**మెల్‌బోర్న్:** ఎలినా రిబకినా సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నది. ఇవాళ జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ వన్ అరినా సబలెంకను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నది. రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో.. రిబకినా మూడవ సెట్‌లో అనూహ్య రీతిలో సత్తా చాటింది. కజకిస్తాన్ అయిదో సీడ్ ప్లేయర్ రిబకినా మూడవ సెట్‌లో ఓ దశలో 3–0 తేడాతో వెనుకబడి ఉన్నది. కానీ ఆ తర్వాత కోలుకున్న ఆమె తిరుగులేని ఆటను ప్రదర్శించింది. వరుసగా అయిదు గేమ్‌లను గెలిచి 6–4 4–6 6–4 స్కోరుతో మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసింది. 2023 ఫైనల్లో సబలెంక చేతిలో రిబకినా ఓడింది. ఆ ఓటమికి ఇప్పుడు ఆమె రివేంజ్ తీసుకున్నది. యూఎస్ ఓపెన్ చాంపియన్ అయిన సబలెంక.. గత నాలుగు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో మూడింటిని కోల్పోయింది. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌లోనూ ఆమె ఓటమి పాలైంది.



## ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 82,049.94 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 81,537.70 పాయింట్లు. లాభం 512.24 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 25,048.65 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,048.65 పాయింట్లు. లాభం 117.50 పాయింట్లు).

## బంగారానికి తగ్గనున్న డిమాండ్?



భారత బంగారు మార్కెట్‌లో కీలకమైన మలుపు కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ఆర్థిక–భౌగోళిక అనిశ్చితులు బంగారం ధరలను రికార్డు స్థాయికి నెట్టడంతో, సామాన్య వినియోగదారుల కొనుగోలు సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ బంగారు మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ – డబ్ల్యుజిసి) విడుదల చేసిన తాజా నివేదిక భారత మార్కెట్‌లో బంగారం డిమాండ్ భవితవ్యంపై స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. నివేదిక ప్రకారం, 2026లో భారతదేశంలో మొత్తం బంగారం డిమాండ్ తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఆభరణాల విభాగంలో అమ్మకాలు క్షీణించడం, మార్కెట్‌పై ప్రధాన ప్రతికూల ప్రభావంగా మారనుంది. డబ్ల్యుజిసిని అనుసరించి, గత ఏడాది దేశీయ బంగారం డిమాండ్ గణనీయంగా తగ్గింది. 2024లో 710.9 టన్నులుగా ఉన్న వినియోగం, 2025లో 24 శాతం పడిపోయి 430.5 టన్నులకు చేరింది. ఇది గత మూడు దశాబ్దాల్లో నమోదైన అత్యల్ప స్థాయిల్లో ఒకటి. 2020లో కొవిడ్ మహమ్మారి కారణంగా గణాంకాలు అసాధారణంగా మారినప్పటికీ, 2025లో కనిపించిన తగ్గుదల పూర్తిగా మార్కెట్ పరిస్థితుల ప్రతిబింబమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ధరల అస్థిరత, అధిక ధర స్థాయిలు వినియోగదారుల నిర్ణయాలను గణనీయంగా ప్రభావితం చేశాయి. భారతీయ వినియోగదారులు సాధారణంగా బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పుడు కొనుగోళ్లకు మొగ్గు చూపుతారు. అయితే 2025లో బంగారం ధరలు తరచూ కొత్త గరిష్టాలను తాకుతూ అస్థిరంగా పెరగడం వల్ల, ఆభరణాల కొనుగోళ్లు వినియోగదారుల బడ్జెట్‌లకు అందని స్థాయికి చేరాయి. ఫలితంగా వివాహాలు, పండుగల సీజన్‌లోనూ ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదు. ఇది ఆభరణాల రంగానికి గట్టి దెబ్బగా మారింది. దీనిలో భాగంగా ఎక్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్)లలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. 2025లో బంగారు ఇటిఎఫ్‌లలోకి వచ్చిన పెట్టుబడులు 283 శాతం పెరిగి రూ.429.6 బిలియన్లకు (సుమారు 4.67 బిలియన్ డాలర్లు) చేరాయి. ఈ పెరుగుదలతో పెట్టుబడి డిమాండ్ 17 శాతం వృద్ధి చెంది 280.4 టన్నుల స్థాయికి చేరింది. ఈ మార్పు భారత బంగారు మార్కెట్ స్వరూపం నెమ్మదిగా వినియోగ ఆధారిత మోడల్ నుంచి పెట్టుబడి ఆధారిత మోడల్ వైపు కదులుతోందని సూచిస్తోంది. ధరల పెరుగుదలతో మరో ఆసక్తికర ధోరణి స్క్రాప్ బంగారం విషయంలో కనిపించింది. అయితే 2025లో ఈ ట్రెండ్ బలహీనపడింది. స్క్రాప్ సరఫరా 19 శాతం తగ్గి 92.7 టన్నులకు చేరింది. మొత్తానికి ఈ ఏడాది మన దేశంలో బంగారం డిమాండ్ మిశ్రమంగా ఉండవచ్చని అంటున్నారు. సామాన్యులు ఆసక్తిని ప్రదర్శించకపోవడంతో, ఆభరణాల అమ్మకాలు ఇంకా ఒత్తిడిలోనే ఉండే అవకాశమున్నప్పటికీ, పెట్టుబడి విభాగం కొంత మేరకు మార్కెట్‌ను నిలబెట్టే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ కదలికలు, వడ్డీ రేట్ల విధానాలు, దేశీయ ధరల స్థిరత్వం వంటి అంశాలు భారత బంగారు డిమాండ్‌ను నిర్ణయించే కీలక కారకాలుగా నిలవనున్నాయి. బంగారం ఇక కేవలం అలంకార వస్తువుగా కాకుండా, వ్యూహాత్మక పెట్టుబడి సాధనంగా భారత మార్కెట్‌లో కొత్త పాత్రను పోషిస్తున్నట్లు తాజా పరిణామాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

## రిటైర్‌మెంట్ భద్రతపై చర్చ...

భారతదేశంలో ఉద్యోగుల రిటైర్మెంట్ భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. ఆదివారం (ఫిబ్రవరి 1) పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న 'బడ్జెట్ 2026'లో పెన్షన్ వ్యవస్థకు సంబంధించి కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్బీఐ రీసెర్చ్ విడుదల చేసిన 'ప్రిల్యూడ్ టు యూనియన్ బడ్జెట్ 2026–27' నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత గ్యారెంటీ ఆదాయం లభించేలా వ్యవస్థను బలోపేతం చేయాలని ఈ నివేదిక సూచిస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ ముఖ్యంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏప్రిల్ 1, 2025 నుంచి అమలులోకి వచ్చిన యుపిఎస్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమై ఉంది. అయితే ఆశించిన స్థాయిలో స్పం దన రాలేదని నివేదిక చెబుతోంది. ఇప్పటివరకు కేవలం సుమారు 1.2 లక్షల మంది మాత్రమే ఈ పథకంలో చేరడం, దీనిని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. అందుకే యుపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని ఎస్బీఐ సూచించింది. ఇదే సమయంలో 'ఎన్‌పిఎస్ వాత్సల్య' పథకంపైనా నివేదిక దృష్టి సారించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) వ్యవస్థ ఆధునీకరణ కూడా మరో కీలక అంశంగా నివేదికలో ప్రస్తావించబడింది. ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న కోట్లాది మందికి ఇప్పటికీ సమగ్ర పెన్షన్ భద్రత లేదన్నది పెద్ద సమస్యగా ఉంది. దీనికి పరిష్కారంగా, 100 లేదా 200 మందికి మించిన ఉద్యోగులు ఉన్న ప్రైవేట్ సంస్థల్లో ఎన్‌పిఎస్‌ను తప్పనిసరి చేయాలని ఎస్బీఐ ప్రతిపాదించింది. ఇది అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా పెన్షన్ కవరేజ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2026లో ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటే, దేశంలోని ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత మరింత ఆర్థిక భరోసా లభించే అవకాశం ఉంది. ఇది భారత పెన్షన్ వ్యవస్థలో ఒక కీలక మలుపుగా మారవచ్చు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## సిఆర్ ఫౌండేషన్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశమాన్ని శాసనమండలి సభ్యులు నెలికంటి సత్యం శనివారం సందర్శించి వృద్ధాశ్రమంలో ఉన్న పెద్దలను పరామర్శించారు. ఫౌండేషన్ కోశాధికారి, డైరెక్టర్ వి.చెన్నకేశ్వరరావు వారికి స్వాగతం పలికి వృద్ధాశ్రమంలోని సదుపాయాలను చూపించారు. ఆశ్రమంలో నివసిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు ఐఎస్ రాజు, ఝాన్సీ దంపతులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఐదుకకల్లు అరుణ కుమారి, ఎర్నేని సత్యం, స్వాతంత్ర్య సమరయోధుడు రామిరెడ్డి, శ్రీమతి తమ్మారెడ్డి తాన్య కుమారి, టి.రాజేందర్ రావు, తదితర ఆశ్రమవాసులను ఎమ్మెల్సీ సత్యం, వారి సతీమణి అన్నపూర్ణ, కుమార్తె చైతన్యలతో కలసి పరామర్శించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్‌లో ఆధ్వర్యంలో నడుస్తున్న నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్, సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రరీ, సిఆర్ పాలిక్లినిక్, దయాగ్నోస్టిక్ కేంద్రాలను మహిళా సంక్షేమ కేంద్రాన్నిసందర్శించారు. కార్యక్రమంలో సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు లలిత వారికి అక్కడ విద్యార్థినిలకు నిర్వహిస్తున్న కోర్సులను వివరించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను ఆదరించండి

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో జరిగిన సిపిఐ పట్టణ కార్యవర్గం దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ పార్టీకి పట్టున్న వార్డుల్లో పోటీ చేస్తున్నామని ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పోటీ చేస్తామన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాడుతుందని చెప్పారు. సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీసి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటిల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయని ఆ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ దశలవారీగా ప్రజాఉద్యమాలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. పట్టణంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి నిరంతరం ఉద్యమాలు చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో సిపిఐ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు బూర వెంకటేశ్వర్లు, ఐతరాజు లింగమ్మ వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మంపాటి రాము, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ దోరేపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, రేగట్టి లింగయ్య, ఎండి పాషా, పెంద్ర కృష్ణ, పొదిలి వెంకటమ్మ పాల్గొన్నారు.




## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై.. 12న దేశవ్యాప్త సమ్మె

### ఎఐసిబిసిడబ్ల్యు (ఎఐటియుసి) పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఎఐసిబిసిడబ్ల్యు (ఎఐటియుసి) ఈనెల 12వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. అలాగే ఈనెల 23న మరోసారి దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. 2026 జనవరి 25, 26 తేదీల్లో కోయంబత్తూరులో నిర్వహించిన ఎఐటియుసి అఖిల భారత సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కార్మికుల సమస్యలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల్లో మార్పులు, సామాజిక భద్రత లేకపోవడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం 21–11–2025 నాటికి కార్మిక కోడ్‌ల అమలుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇవి కార్మికుల హక్కులను హరించేవిగా ఉన్నాయని ఎఐటియుసి నాయకులు విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల నిర్మాణ కార్మికులతో పాటు అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా ఫిబ్రవరి 23న మరోసారి దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎఐటియుసితో పాటు ఇతర కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, సంఘాలు పాల్గొననున్నట్లు చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, వేతనాల భద్రత, సామాజిక భద్రతా పథకాల అమలు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఈ ఉద్యమాలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు. కోయంబత్తూరు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని యూనియన్ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జాతీయ కార్యదర్శి వహీద్ నిజాం, తెలంగాణ నుండి జి. రమేష్, జి. రాజు, జి. లక్ష్మి నారాయణ, బి. మల్లికార్జున్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఐక్యంగా ఈ పోరాటంలో పాల్గొని జయప్రదం చేయాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీ మారగోని ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



## కార్మికులు పోరాటాలతో సాధించుకున్న 42 చట్టాలు కొనసాగించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 12న జరిగే సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సివిల్ సప్లై కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ గ్రాడ్యూటి బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాలను ఆపాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత పథకాన్నిప్రవేశపెట్టాలని, వ్యవసాయ మార్కెట్‌లో దడవాయి కార్మికుల రిటైర్‌మెంట్ వయసును 65 పెంచాలని, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు నాటి పోరాటంలో సాధించుకున్న 42 రకాల చట్టాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందన్నారు. వారికి అనూకులంగా కార్మిక చట్టాలు తయారు చేస్తుందని అలాంటి ఆలోచనలు కేంద్ర ప్రభుత్వం మానుకొకపోతే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్మూర్తి, పొనుగోతు గోపి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ల కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయాలి

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్

### ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభల ప్రచార సామాగ్రి ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ తేనె పూసిన కత్తిలా తీసుకువచ్చారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 8న వరంగల్ జిల్లా కేం ద్రంలో జరుగుతున్న తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాలుగవ రాష్ట్ర మహాసభల ప్రచార సామాగ్రి వా ల్ పోస్టర్స్, కరపత్రాలను శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామా రెడ్డి భవనంలో ఆవిష్కరించారు. అనంతరం కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదారవాద ఆర్థి క విధానాలు కార్మిక వర్గ సంక్షేమానికి గొడ్డలి పెట్టు లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సంపద 10% సంపన్న కార్పొరేట్ వర్గాల చేతిలో కేంద్రీకృతం అవుతున్నదని సంపద సృష్టించే కార్మిక వర్గ మాత్రం కటిక దారిద్ర్యంలో మగ్గుతున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ శ్రమ దోపిడీకి ఆర్థిక లూఠీకి కేంద్ర బిందువుగా మారుతున్నాయని కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని కోరారు. లేబర్ కోడల వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిరాజ్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నేతలు రంగన్న, బాలకోటి, యాదయ్య, అంజి, శ్రీను, భీమయ్య, సునీత, నాగలక్ష్మి, వరలక్ష్మి, మంజుల, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్, సిపిఐ పొత్తు

### కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్..

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్/మంచిర్యాల:** చెన్నూరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్, సిపిఐల మధ్య మైత్రి కొనసాగుతున్నప్పటికీ, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో మాత్రం సిపిఐ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇక్కడ బిఆర్ఎస్ పార్టీతో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ ఇచ్చింది. శనివారం బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య భేటీ అయి పొత్తులను ఖరారు చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్, కలవేన శంకర్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంత కార్మికులు, ప్రజల సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ, స్థానికంగా చెన్నూరు నియోజకవర్గంలో బిఆర్ఎస్‌తో మిత్రధర్మం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, కార్మిక వ్యతిరేక చర్యల వల్ల సంస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు పార్టీలు సమన్వయంతో పని చేసి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 3వ తేదీన వార్డుల వారీగా సీట్ల కేటాయింపును ఖరారు చేయనున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగుల లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# తుది శ్వాస వరకూ ప్రజాక్షేత్రంలోనే

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా సేవలందించే భాగ్యం కలిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవ చేస్తూ తుదిశ్వాస వరకూ ప్రజలమధ్యే ఉంటానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘంలోని 15వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ గెలిచిన నాయకులు ప్రజాసమస్యలు పట్టించుకోకుండా విలాసవంతమైన జీవితం గడిపారని విమర్శించారు. తాను ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజలమధ్యే ఉన్నానని అన్నారు. తాను బ్రతికి ఉన్నంతకాలం ధర్మపురి ప్రజల మధ్య ఉంటానని చెప్పారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలలో 4 హామీలు అమలు చేస్తున్నదని, మరో రెండు హామీలను నెరవేర్చుతామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలైన దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇవేమీ చేయలేదని దుయ్యబట్టారు. ధర్మపురిలో గడచిన రెండేళ్లలో అనేక అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు.154 మందికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరీతోపాటు రూ.7 కోట్ల 70లక్షలు లబ్ధిదారులకు చెల్లించామన్నారు. 695 మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా 327 మందికి రూ.93 కోట్ల 75 వేలు అందించామన్నారు. కళ్యాణలక్ష్మి పథకం కింద 206 మందికి రూ.2 కోట్ల 6లక్షలు అందించామని, గృహ జ్యోతి పథకం ద్వారా 2783 మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని చెప్పారు. పట్టణంలో 542 మంది రైతులకు రూ.4.2 కోట్లు రుణమాఫీ చేసామని తెలిపారు. రూరల్ డెవలప్మెంట్, స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ తో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. ప్రజా సంక్షేమమే ఏజెండాగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను మున్సిపాలిటీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## ఎన్నికల కోడ్ ముగిసేంతవరకూ ప్రజావాణి రద్దు: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

## మహిళా ఉద్యోగుల రక్షణకు సంక్షేమ శాఖ పెద్దపీట

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల రక్షణకు జగిత్యాల జిల్లా యంత్రాంగం పెద్దపీట వేస్తోందని జగిత్యాల జిల్లా ఇంచార్జి సంక్షేమ అధికారి కె.రాజ్ కుమార్ అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక వేధింపులను అరికట్టేందుకు జగిత్యాల జిల్లా మహిళా సాధికారత కేంద్రం, స్థానిక ఫిర్యాదుల కమిటీలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా ఇంచార్జి సంక్షేమ అధికారి తెలిపారు. మహిళా ఉద్యోగుల రక్షణకు సంక్షేమ శాఖ జిల్లా యంత్రాంగం పెద్దపీట : జిల్లా ఇంచార్జి సంక్షేమ అధికారి కె.రాజ్ కుమార్ మహిళలు తమపై జరుగుతున్న వేధింపులు భరించకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉన్న కమిటీలు బాధితులకు అండగా ఉంటాయని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, ఏ ఒక్క మహిళా ఉద్యోగి కూడా భయపడాల్సిన అవసరం లేదు అని పేర్కొన్నారు. ఫిర్యాదు చేయు విధానం చట్టపరమైన రక్షణ, ఎక్కడ ఫిర్యాదు చేయాలి..? సంబంధిత కార్యాలయంలోని అంతర్గత కమిటీలో లేదా లోకల్ కంప్లైంట్స్ కమిటీకి లేదా జిల్లా స్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. అదేవిధంగా ఆన్ లైన్ లోhttps://shebox.wcd.gov.in/లో కూడా ఫిర్యాదు చేసుకోవచ్చును అని, సంఘటన జరిగిన మూడు నెలల లోపు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని, లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 ప్రకారం అశ్లీల వ్యాఖ్యలు, అసభ్య ప్రవర్తన, శారీరక వేధింపులు నేరంగా పరిగణించబడతాయని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించి, వేధింపుల ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటామని, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ మహిళా 181, డయల్ 100, సఖీ కేంద్రం08724295235, షీ టీం 8712670783, భరోసా9133295911 నెంబర్స్ కాల్ చేయవచ్చని మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఇంచార్జి అధికారి కె.రాజ్ కుమార్ తెలిపారు.

## ఆయిల్ పామ్ మార్కెటింగ్, ఫ్యాక్టరీ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలంలోని అంతార్గం, తాటిపల్లి, చెల్లల్ గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను శనివారం జగిత్యాల జిల్లా ఉద్యాన అధికారి శ్యామ్ ప్రసాద్ సందర్శించి రైతులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం రైతుల సందేహాలు నివృత్తి చేయడం జరిగిందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ 3 సంవత్సరాల వయసు గల ఆయిల్ పామ్ తోటలకు 500 గ్రాముల యూరియా, 350 గ్రాముల డిఏపి, 500 గ్రాముల పోటాష్ వేసుకోవాలని ఇదే డోస్ తిరిగి 3 నెలల తరువాత మళ్ళీ వేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి రైతులకు సూచించారు.3 సంవత్సరాలు దాటినా ఆరోగ్యవంతమైన తోటల్లో పూత తీయడం ఆపేయాలని ఒకసారి పుతకు వచ్చాక గెల కోతకు రావడానికి 6 నెలల సమయం పండుతుందని ఒక మొక్కకి ఒక రోజుకి 200 లీటర్ల నీరు పెట్టాలని, మొక్క దగ్గరగా దున్నవద్దని రైతులకు జిల్లా ఉద్యాన అధికారి సూచించారు. రైతులు ఆయిల్ పామ్ గెలల మార్కెటింగ్ విషయంలో మరియు ఫ్యాక్టరీ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని జగిత్యాల జిల్లాకు కేటాయించబడిన లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ రైతుల ఆయిల్ పామ్ గెలలు కొనుగోలు చేసి వారం నుండి 10 రోజుల లోపల రైతుల ఖాతాలలో అప్పటి ధరను బట్టి సొమ్ము జామచేసే బాధ్యత తీసుకుంటుందని జిల్లా ఉద్యాన అధికారి తెలపడం జరిగింది. అదే విధంగా జిల్లాలో ఇప్పటి వరకు 5000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఇంకా రైతులు ముందుకు వచ్చి దాదాపు 3000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టినట్లయితే ఫ్యాక్టరీ నడపడానికి అనువుగా ఉండి మన జిల్లాలో ఫ్యాక్టరీ నిర్మాణం చెప్పటడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, ప్రజలు, పాల్గొన్నారు.

## 'రామగుండంలో' 706 నామినేషన్ పత్రాల దాఖలు




**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి 60 డివిజన్లలో పోటీ చేసేందుకు మొత్తం 706 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. మొదటి రోజున 13, రెండో రోజు 168, మూడో రోజు 525 నామినేషన్లు వేశారు. ఇందులో ఐఎన్‌సి పార్టీ నుంచి 135 మంది, బిఆర్ఎస్ నుంచి 102 మంది, బిజెపి నుంచి 75 మంది, సీపీఐ(ఎం) నుంచి అయిదుగురు, బిఎస్పి నుంచి 22 మంది, టిడిపి నుంచి ఒకరు, గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ అయిన పలు పార్టీల నుంచి 83 మంది, స్వతంత్ర అభ్యర్థులు 102 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, శనివారం నామినేషన్లను పరిశీలించారు. ఆది, సోమవారాల్లో ఉపసంహరణల అనంతరం మంగళవారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

## 'జాతర' ఆటో ఢీకొని ఒకరు మృతి



**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం విలేజి అంతర్గాం ప్రధాన రహదారిపై కాలినడకన వెళ్తున్న కాంపెల్లి గోపాల్(45)ను ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. శుక్రవారం రాత్రి గోయల్‌వాడ జాతర నుంచి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో అం తర్గాం వైపుకు వస్తోంది. అదే సమయంలో విలేజి అంతర్గాంకు చెందిన గో పాల్ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి ఆటో ఢీకొంది. గోపాల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అంతర్గాం పోలీసులు శనివారం విచారణ చేపట్టారు.

## వీణవంకలో ముగిసిన జాతర



**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండల కేంద్రంలో గత మూడు రోజులుగా మినీ మేడారంగా పిలువబడే సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగవైభవంగా ముగిసాయి. వీణవంక మండలంతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. శనివారం జాతర ముగిసిన సంధర్బంగా సమ్మక్క సారలమ్మ జనం నుంచి వనంలోకి కోయ పూజారులచే డప్పు చప్పుళ్లతో తీసుకెళ్లగా భక్తులు దర్శించుకుని పరవశించి పోయారు. చల్లగ దీవించు అంటూ మొక్కుకున్నారు.

## రేషన్ 'పరేషాన్'



**ప్రజాపక్షం/చందుర్తి :** గ్రామ ప్రజలు రేషన్ సరుకులు తీసుకోవడంలో ఎదుర్కోంటున్న సమస్యను తీర్చాలని కోరతూ మండలంలోని మల్యాల గ్రామ పాలకవర్గం మండల తహసిల్దార్‌కి శనివారం వినతి పత్రం అందజేశారు. మండలంలోనే మేజర్ గ్రామమైన మల్యాలలో రెండు రేషన్ షాపులు ఉన్న చేసిన ఒకే చోట సరుకులు అందజేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజల సౌకర్యం కోసం గ్రామంలోని బస్టాండు ప్రాంతంలో రెండవ షాపు ఏర్పాటు చేసి ప్రజలకు రేషన్ సరుకులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందాల శారద అబ్రహం, ఉప సర్పంచ్ అనపర్తి నరేష్ , ఏఎంసి డైరెక్టర్ ఈసరి శ్రీనివాస్ , వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

కామన్ డైట్‌తో నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించిన కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం అకస్మీకంగా సందర్శించారు. ఈసందర్భంగా కెజివిపిలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం,గుడ్లు, క్యాలిఫ్లవర్ కూర. పప్పు, రసం, పెరుగుదలను పరిశీలించారు. విద్యార్థులకు డైనింగ్ మాత్రమే భోజనం వడ్డించాలని, ఇతర ప్రాంతాల్లో భోజనం వడ్డించరాదని సంబధిత అధికారులను ఆదేశించారు. ఆనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం, లేదా కూరలు కోరినప్పుడు వారు కూర్చున్న చోటికి వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ మెనును తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యమైన.రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు కడుపు నిండ తినేలా వడ్డించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది, పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈగలు,దోమలు, రాకుండ డెటాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండ శుభ్రపర్చుకోవాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎల్లప్పుడు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. ఆనంతరం తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూరల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని, నిర్లక్ష్యంగా వంట చేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన సేవలు

ప్రజలంతా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి
కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అధునాతనమైన వైద్య పరికరాలతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాలను పరిశీలించారు. సిఎస్ఆర్ ఫండ్ కింద హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ కంపెనీ ఇటీవల రెండు కోట్ల ముప్పై లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేసింది వీటిలో ఎక్సరే 500 ఎంఏ యూనిట్ ఏడోనిస్ కంపెనీ.. అదేవిధంగా లాప్రోస్కోపీ పరికరాలు స్మిత్ నెప్యూ అడ్వాన్స్ టెక్నాలజీ, డాప్లర్ అల్ట్రాసౌండ్ మిషన్ లాజిక్ ఈ, జిఈ హెల్త్ కంపెనీకి చెందిన అత్యాదునిక వైద్య పరకారాలు సమకూర్చింది. శనివారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హిందుస్థాన్ ఏరోనాటటిక్స్ లిమిటెడ్, అవియోనిక్స్ డివిజన్ వారి పెద్ద మనసుతో పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందాలనే సంకల్పంతో కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి అధునాతన వైద్య పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. తద్వారా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుతాయని ప్రజలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలతో అనేక సర్జరీలతో పాటు అత్యుత్తమ వైద్య సేవలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీనా ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ ఉదయ్ ఆదిత్య పలువురు వైద్య నిపుణులు డాక్టర్లు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపాలిటీ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

టిపిసిసి ఉపాధ్యక్షుడు శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** కాంగ్రెస్ పార్టీ నిర్ణయాల మేరకే అందరూ నడుచుకోవాలని పార్టీ లైన్ తప్పితే ఎంతటి సీనియర్ అయినా పార్టీ ఉపేక్షించదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్ అన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మధ్య ఏర్పడ్డ అంతర్గత విభేదాల నేపథ్యంలో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నిర్ణయాల మేరకు అందరు నడుచుకోవాల్సిందేనని శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది. పార్టీ కష్ట కాలంలో హుజురాబాద్ ఎమ్మెల్యేగా నేను పోటీ చేశానని, ఆ రోజే నేను బలి పశువును అవుతానని తెలిసి కూడా ఆ పోటీలో ఉన్నానన్నారు. పార్టీ కోసం బలి కావడం కూడా నేను అదృష్టంగానే భావించానని, ఆ రోజు పార్టీ పక్షాన నిలబడి కొట్లాటడం వల్లే నన్ను ఎమ్మెల్సీ పదవి వరించిందన్నారు. పార్టీలో అందరికీ ఒకేసారి అవకాశాలు రాకపోవచ్చని నిరుత్సాహానికి గురి కావద్దని, పార్టీ నిర్ణయం తీసుకోనంత వరకే ఏదైనా ఒకసారి పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత పార్టీ లైన్ మేరకే ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలి. ఒక్కోసారి పార్టీ నిర్ణయం నచ్చకపోతే ఆ విషయంలో నాలుగు గోడల మధ్య మాట్లాడాలి తప్పా, బయటకొచ్చి ఏది పడితే అది మాట్లాడరదని బల్మూరి వెంకట్ అన్నారు. ఏది ఏమైనా పార్టీయే సుప్రీమ్ అని, ఎంత సీనియర్, జూనియర్ అయినా పార్టీలోకి వచ్చిన కొత్తవారు, పాతవారు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆయన అన్నారు. పార్టీ తీర్పే అంతిమ తీర్పు అని, ఆ తీర్పును అందరూ శిరసావహించాల్సిందేనని ఆయన చెప్పారు. ఎక్కడ ఎవరు గెలిచే అవకాశం ఉంటే అక్కడ వారిని నిలబెట్టాలని, అవకాశం రానివారికి నామినేటెడ్‌లో అవకాశం కల్పించాలన్నారు. కార్యకర్తలంతా ఒక్కటిగా ఉండాలని, లేకుంటే రేపు నష్టపోయేది మనమేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గట్టు సతీష్, మాజీ లైబ్రరీ ఛైర్మెన్ డా.చంద్ర శేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి కక్ష పూరిత ధోరణితోనే కెసిఆర్‌కు నోటీసులు

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిఎం రేవంత్‌రెడ్డి కక్ష పూరిత దోరణితోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్థూపంవద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. టెలిఫోన్ ట్యాపింగ్ పేరిట బిఆర్ఎస్‌పై వేధింపులు దారవాహిక సీరియల్ తరహాలో రెండేళ్ల నుండి కొనసాగిస్తున్నారన్నారు. పోన్‌ట్యాపింగ్‌లో రాజకీయ నాయకులకు సంబంధం ఉండదని. అధికారులు మాత్రమే చూసుకుంటారన్నారు. రేవంత్ రెడ్డి అసలు సమస్యలనుపక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నారన్నారు. అలీబాబ 40 దొంగలు, దండుపాల్యం ముఠా తరహాలో కాంగ్రెస్ అనేక కుంభకోణాలు చేస్తున్నారన్నారు. భోగ్గు స్కాం, 9వేల ఎకరాల భూస్కాంలు చేశారని ఆరోపించారు. వాటి నుండి ప్రజల దృష్టి మళ్లీంచటం కోసం రేవంత్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారున్నారు.ఇ 1885లోనే ట్యాపింగ్ చట్టం వచ్చిందని. టెలిగ్రాప్ చట్టం ప్రకారం పోలీసుశాఖ సమాచారం సేకరిస్తుందన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడ ఫోన్ ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరని, అధికారులు దేశ భద్రత కోసం ఫోన్ ట్యాప్ చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో సిద్దిపేట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కనకరాజు. ప్రభాకర్‌రెడ్డి, రాములు, రమేశ్, యాదయ్య పాల్గొన్నారు.

## కరీంనగర్ మేయర్, 3 చైర్మన్ పీఠాలు బిజెపివే

గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం
టిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం
మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠంతోపాటు 3 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలను బీజేపీ విజయం కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సర్వేల్లో వెల్లడైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే టిక్కెట్ల విషయంలో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ లో 80 శాతం పైగా టిక్కెట్లు వారికే ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గెలిచే అవకాశం లేని మిగిలిన స్థానాల్లో మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా చోట్ల టిక్కెట్లు రాని బీజేపీ కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవులిచ్చి వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరపడి ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కరీంనగర్ లోని శుభం కన్వెన్షన్ లో కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ సీనియర్ నేతలు సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను, ఇనుగొండ నాగేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## కౌశిక్ రెడ్డి...చిల్లర వేషాలు మానుకో: ప్రణవ్



**ప్రజాపక్షం/హుజురాబాద్:** వ్యక్తిగత ఇమేజ్ కోసం అత్యుత్సాహంతో తప్పు చేయడం ఆపై క్షమాపణ కోరడం కౌశిక్‌రెడ్డికి అలవాటు అయిందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం రోజున హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజున కౌశిక్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక అబద్దపు ప్రచారాన్ని విడుదల చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను ఇబ్బంది పెడుతున్నారని కట్టు కథలు అల్లుతున్నాడని అన్నారు. జాతరలో కూడా తన రాజకీయ దురుద్దేశాన్ని చూపెట్టాడని మండిపడ్డారు. ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తామంటే కుదరదని ఇది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదని కాంగ్రెస్ ప్రభుత్వం అని కౌశిక్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి రాజకీయ దూషణలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజలకు రక్షణ కల్పించే పోలీస్ వ్యవస్థను పట్టుకుని కౌశిక్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను మత విద్వేశాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం విధులకు భంగం కలిగించడం సిగ్గు చేటని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంఠం, చిక్కి, బినోల ఎత్తిపోతల నిర్మాణానికి రూ.79.89 లక్షలు



ప్రజాపక్షం / నందిపేట్ : నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం, నవీపేట్ మండలంలో ఎత్తిపోతల నిర్మాణానికి రూ.79.89 లక్షలు మంజూరు చేసింది. ఈ మండలంలోని గ్రామాలకు 5150 ఎకరాలకు సాగులోకి రానున్నాయి. వీటికి ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. అవసరమైన పనుల అర్థాంతరంగా ఆగిపోయాయి.

## మోడల్ స్కూళ్లలో దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం / మంచిర్యాల : జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతితో పాటు 7 నుండి 10వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జనవరి 28 నుండి ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్ వెబ్సైట్ telanganams.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్షలు ఉంటాయని ఆయన వెల్లడించారు. 6వ తరగతికి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, 7 నుండి 10వ తరగతులకు మధ్యాహ్నం 02.00 గంటల నుండి సాయంత్రం 04.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిఎం కప్ విజేతలకు బహుమతులు



ప్రజాపక్షం / కోటాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన సిఎం కప్ క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపిడిఓ ప్రసాద్ బహుమతులను అందజేసి అభినందించారు. ముఖ్యంగా కబడ్డీ పోటీల్లో మొగడ్ ధగడ్ గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ పోటీలలో రాణించిన క్రీడాకారులను అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గౌఢ్డే హన్మంతు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ప్రదీప్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను ఆపడం.. అంగన్వాడీలతోనే సాధ్యం



ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాలను నిరోధించడానికి వంద రోజుల ప్రచారంలో భాగంగా మండలంలోని చించోలి గ్రామంలో నిర్వహించిన అంగన్వాడీ సెక్టార్ మీటింగ్లో ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డి,మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు గ్రామీణ బాలల పరిరక్షణ కమిటీ పాత్ర యొక్క విధివిధానాలను గుర్తుచేసేని గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలు జరగకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్క అంగన్వాడీ టీచర్లదని వారికి వారి గురుతర బాధ్యతలపై అవగాహన కల్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో మండల సూపర్వైజర్ మంజుల,అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొనడం జరిగింది.

## నామినేషన్ పత్రాల పరిశీలన



ప్రజాపక్షం/భీమ్గల్ : మున్సిపల్ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శనివారం అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలన చేశారు. పట్టణంలో మొత్తం 12 వార్డులు ఉండగా వివిధ రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థుల నుండి 113 నామినేషన్ పత్రాలు నామినేషన్ చివరి రోజు దాఖలయ్యాయి. కాగా నామినేషన్ సమర్పించిన పత్రాలను అధికారులు శనివారం పరిశీలించారు. 113 నామినేషన్ల నుండి ఒకటి తిరస్కరణకు లోనైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పట్టణంలోని 2వ వార్డు నుండి బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా చింతలూరి పద్మ రెండు నామినేషన్ సెట్స్ దాఖలు చేయడం జరిగింది. అందులో ఒక సెట్లో కులధృవీకరణ పత్రం లేకపోవటంతో రిజెక్ట్ కాగా మరోటి పాస్ అయింది.

## గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్పై కాంగ్రెస్ జెండా ఎగరాలి

డిసిసి అధ్యక్షుడు తూంకుంట ఆంక్షా రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని సిద్దిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట ఆంక్షా రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గాడిపల్లి నవ్యశ్రీకి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో సిసి రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, తాగు నీటి సమస్య, లోపించిన పారిశుధ్య నిర్వహణ తదితర సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలను పేదలకు వర్తింపజేయడంలోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిర ఇండ్లు, రేషన్ కార్డులు అందజేస్తామని చెప్పారు. కాగా 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవ్యశ్రీని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, దాచారం సర్పంచ్ చెన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, జాకీర్, రాజేశ్వర్ రెడ్డి, సత్తయ్య, వినయ్, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

# ‘పది’లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లాలోని విద్యార్థులు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులులతో పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణతపై కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పదవ తరగతిలో వంద ఉత్తీర్ణత రావాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ఉండాలని, విద్యార్థులు పదవ తరగతిలో ప్రతి విద్యార్థి గైర్హాజర్ లేకుండా చూడాలని, ఎల్లుండి సోమవారం నుంచి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలల్లో తప్పనిసరిగా హాజరు ఉండాలన్నారు. గైర్హాజర్ అయిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. సోమవారం నుండి పదవ తరగతి విద్యార్థుల హాజరు వంద ఉండాలని, సోమవారం నుండి పదవ తరగతి విద్యార్థుల హాజరు తానే స్వయంగా పరిశీలిస్తానన్నారు. ఉదయం 8:15 నుంచి సాయంత్రం 5:15 వరకు ప్రత్యేక తరగతులు తప్పకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం సాయంత్రం స్నాక్స్ అందించాలన్నారు. ఉపాధ్యాయులు పదవ తరగతి ప్రతి విద్యార్థి యొక్క ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను సొంత చేతిరాతతో తయారు చేసుకొని ఉండాలని సూచించారు. ఏదైనా కారణాల చేత గైర్హాజరైన విద్యార్థులు కూడా తప్పనిసరిగా పాస్ కావాలని ఆదేశించారు. పదవ తరగతికి బోధించే ఉపాధ్యాయులు సెలవులు పెట్టొద్దన్నారు. పదవ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు స్పోర్ట్స్ కు, సంస్కృతిక కార్యక్రమాలకు, ర్యాలీలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో, కేజీబీవిలలో అత్యంత పేద విద్యార్థులు చదువుతున్నారని, వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చదివే మార్గమని, ఆ చదువు అందించేది ఉపాధ్యాయులేనని అన్నారు.పదవ తరగతి విద్యార్థులకు ముఖ్యమైన చాప్టర్లు, ముఖ్యమైన ప్రశ్నల సమాధానాలు నేర్పించి వారిని పాసయ్యేలా చూడాలని ఎంఈఓ లను, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా విద్యాధికారిని విజయ, ఏఎం ఓ సుదర్శన మూర్తి, ఉన్నారు.

## గాంధీభవన్లో సమీక్ష.. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నిజాంసాగర్: గాంధీభవన్లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్కుమార్గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాదించేలా క్షేత్రస్థాయిలో అమలు చేయవలసిన వ్యూహాలు, ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్ధవంతంగా తీసుకెళ్ళే విధానాలపై దిశా నిర్దేశం చేశారు.మంత్రులు దామోదర రాజనర్సింహ, అజహారుద్దీన్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు సమర్ధవంతంగా విధుల నిర్వహణ

ఎన్నికల పరిశీలకులు, అధికారులతో సమీక్ష : అదనపు కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/నిజామాబాద్: మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అంకిత్ సూచించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు సిహెచ్ సత్యనారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్కుమార్లతో కలిసి శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 11న పోలింగ్, 13న కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా ఎన్నికల సిబ్బంది, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకంపై చర్చించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టి బృందాలతో గట్టి నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతూ వెబ్క్యాస్టింగ్ జరిపించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రీసివింగ్ సెంటర్ల వద్ద తగిన భద్రత, సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చివరి సమయంలో హడావుడి పడకుండా ముందస్తుగానే ఏర్పాట్లను చక్క బెట్టుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తు.చ. తప్పక పాటించేలా పకడ్బంధీ పర్యవేక్షణ జరపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు గురి కావల్సి వస్తుందన్నారు. నోడల్ అధికారులు మరోసారి ఎన్నికల నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సరి చూసుకుని పొరపాట్లు దొర్లకుండా విధులు నిర్వహించాలని సూచించారు. డీఆర్డీఓ సాయగౌడ్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్కుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థులను ఆదరించండి

సిపిఐ పార్టీ నగర కార్యదర్శి ఓమయ్య





ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిత్యం ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై, కార్మికుల సమస్యలపై అధికారం లేకున్నా పోరాడే సిపిఐ పార్టీ అభ్యర్థులుగా నిజామాబాద్ నగర కార్పొరేషన్లో 1వ డివిజన్ నుండి గొలుసుల రమేష్, 17వ డివిజన్ నుండి బి. స్వప్నలు పోటీచేస్తున్నందున ఆయా డివిజన్ల ప్రజలు తమ అమూల్యమైన ఓటును కంకి కొడవలి గుర్తుపై వేసి అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వై.ఓమయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం సిపిఐ పార్టీ కార్యాలయంలో నిజామాబాద్ నగర కార్పొరేషన్లో సిపిఐ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలన్న విజ్ఞప్తి చేస్తు నగర కార్యదర్శి వై.ఓమయ్య ప్రెస్మీట్ నిర్వహించారు.నిత్యం ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యలపై, కార్మికుల సమస్యలపై పోరాడే పార్టీ సిపిఐ పార్టీ అని పార్టీ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపునకు ప్రజలు తమ ఓటు హక్కును ఇచ్చి నగర అభివృద్ధిలో భాగం కావాలన్నారు. నేటికి పలు కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ రోడ్లు పారిశుద్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, పేదలకై ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు అన్ని విధాలుగా సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటన్నిటిని పరిష్కరించే దిశగా సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులు పనిచేస్తారని అన్నారు. కావున పనిచేసే వారికి తమ అమూల్యమైన ఓటు ని ఇచ్చి గెలిపించాలని కోరారు. 1వ డివిజన్ అభ్యర్తి గొలుసుల రమేస్, 17వ డివిజన్ నాయకులు బైరి తిరుపతి, నాయకులు పి. ముత్యాలు, అనిల్, ఇమ్రాన్ అలీ, పిరోజ్ అలీ, నగేష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ప్రజాఫక్షం/సంగారెడ్డి : మున్సిపల్ ఎ న్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపు నిచ్చారు సంగారెడ్డి పట్టణం లోని 32,3 3 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా గడప ,గడపకు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల బాకి కార్డులను పంపిణి చేస్తూ ఇప్పటి వరకు అమలుకాని హామిలను ప్రజలకు గుర్తు చేశారు.ఇంచార్జీ రాజనర్సు, మాజీ సీడి సీ చైర్మేన్ కాసాల బుచ్చిరెడ్డి, అభ్యర్థులు నాయికోటి నవీన్, ,గోవర్దన్ నాయక్, మాజీ జడ్పీటీసీ కొండల్రెడ్డి, వార్డు ప్రజలు పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా : కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.శనివారం బైంసా మండలంలోని దేగాం గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న మహిళ సమైక్య భవనానికి,3లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న ముదిరాజ్ సంఘ భవన వంటశాల గది నిర్మాణానికి భూమి పూజ చేసిదశల వారిగా గ్రామ సమస్యల పరిష్కారానికి పాటు పడతానన్నారు.గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక సర్పంచ్ సిరం సుష్మరెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. ఎంపిడివో నీరజ్ కుమార్,సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి,ఐకేపీ ఏపీఎం రమే ష్,సీనియర్ నాయకులు సొలంకి భీంరావు,ఇలే గాం స ర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్,దేగాం ఉప సర్పంచ్ శివాజీ, ఇలే గాం ఉపసర్పంచ్ శ్రీనివాస్,స్థానిక నా య టకులు కిష్టయ్య, ఎల్లప్ప,చంద్రకాంత్ పటేల్,భోజరాం పటేల్,లింగన్న,మహిళ సంఘం సభ్యులు ఉన్నారు.

## కనీసం వేతనం రూ.26,000 చెల్లించాలని ఆశా వర్కర్లు డిమాండ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,ఆశా వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాన ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు)పిలుపునిచ్చింది.ప్రజారోగ్యానికి వెన్నెముకగా ఉన్నా వివక్షే సమావేశాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగామణి,ఉపాధ్యక్షుడు కుమార్ ప్రసంగిస్తూ,దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశా వర్కర్లు ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకలా పనిచేస్తున్నారని కొనియాడారు.తల్లీబిడ్డల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి ఉద్యోగ భద్రత,కనీస వేతానాలు లేకపోవడం దారుణమన్నారు.20 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి కేవలం రూ.3,000 పారితోషికం ఇవ్వడం,ధరలు పెరుగుతున్న కా లంలో వారిని అవమానించడమేనని విమర్శించారు.ప్రధాన డిమాండ్లు ఆశా వర్కర్లను రెగ్యులర్ వర్కర్లుగా గుర్తించి,నెలకు రూ.26,000 కనీస వేతనం అందించాలని వారు డిమాండ్ చేశారు. రూ. 10,000 పెన్షన్ ,పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కమిటీ నా యకులు చంద్రకళ,రామలక్ష్మి, నందా, సుగుణ, అనయ, లక్ష్మి ,ఇంద్రల,పుష్ప, లావణ్య, పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



ప్రజాపక్షం/మెదక్: న్సిపల్ ఎన్నికలు, పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న జరగబోయే ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు మరియు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం అన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ రోజుకు ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకొని పోలింగ్ నిర్వహణకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్లతో కూడిన ఇతర పోలింగ్ సామాగ్రిని సంబంధిత రిటర్నింగ్ అధికారి వద్ద సేకరించాలనీ ,చెక్ లిస్ట్ ఆధారంగా సరిచూసుకోవాలన్నారు.జోనల్ అధికారి పోలీస్ ఎస్కార్ట్ తోపాటు సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి పోలింగ్ కేంద్రంలో తగిన ఏర్పాట్లు చేసుకోవాలనీ,ఓటరు రహస్యంగా తన ఓటు నమోదు చేసే విధంగా గదిలో ఒక మూలన ఓటింగ్ కంపార్ట్మెంట్ను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 6:30 కు పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ బాక్స్ ను సీల్ చేసి ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించాలనీ, పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి తో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించడం జరుగుతుంది అని అన్నారు. ఓటర్లు తప్పనిసరిగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదించిన ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకు రావాలి అన్నారు. ఓటరు గుర్తింపు నిర్ధారించుకున్న వెంటనే రెండవ పోలింగ్ అధికారి ఆ ఓటర్ యొక్క ఎడమచేతు చూపుడు వేలుకు చెరగని సిరాతో మార్క్ చేయాలనీ, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ పూర్తయిన వెంటనే పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ బాక్స్ ను సీలు వేసీ బ్యాలెట్ బాక్స్ ను ఇతర పేపర్లన్నింటినీ సాధ్యమైనంత త్వరగా జోనల్ అధికారి ,పోలీస్ ఎస్కార్ట్ సమక్షంలో రిసెప్షన్ సెంటర్లో అందజేయాలన్నారు.ఎన్నికల సంఘం నిబంధనకు లోబడి ఎన్నికల సిబ్బంది పనిచేయాలన్నారు.

# ఆకతాయిలు ఆటకట్టిస్తాం.. మహిళల రక్షణే మా ప్రాధాన్యత : ఎస్పి

జిల్లా వ్యాప్తంగా షీ టీమ్,భరోసా కేంద్రాల విస్తృత తనిఖీలు, పాఠశాలల్లో విద్యార్థులకు ‘గుడ్ టచ్-బ్యాడ్ టచ్’ పై అవగాహన, నిరంతర నిఘా-శాంతిభద్రతల పరిరక్షణ..





ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : జిల్లాలో మహిళలు,బాలికలు,విద్యార్థినుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ స్పష్టం చేశారు.ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్,భరోసా కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ,ఆకతాయిల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచారు.

### నిర్మల్ ఉత్సవాల్లో ప్రత్యేక నిఘా..

ఇటీవల నిర్వహించిన నిర్మల్ ఉత్సవాల సందర్భంగా భారీగా తరలివచ్చిన జనసందోహంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షీ టీమ్ సిబ్బంది మఫ్టీలో విధులు నిర్వర్తించారు.ఈవ్ టీజింగ్,ఆకతాయిల వేధింపులు వంటి సంఘటనటు జరగకుండా అప్రమత్తంగా ఉండి,ప్రశాంత వాతావరణంలో ముగిసేలా సమర్థవంతంగా పనిచేశారని ఎస్పీ ప్రశంసించారు.

### మైనర్ల కట్టడి-తల్లిదండ్రులకు హెచ్చరిక...

పట్టణంలోని వాసవి స్కూల్ పరిసర ప్రాంతాల్లో గత రెండు మూడు రోజులుగా కొంతమంది మైనర్లు స్కూల్ ముగిసే సమయానికి బైక్లపై చక్కర్లు కొడుతూ విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నట్లు వచ్చిన సమాచారంపై భరోసా సిబ్బంది తక్షణమే స్పందించారు.వారిని అదుపులోకి తీసుకుని,భరోసా సెంటర్కు తరలించారు.మైనర్ల ప్రవర్తన పట్ల కౌన్సిలింగ్ నిర్వహించారు.పిల్లల కదిలికలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని,లేనిపక్షంలో చట్టపరమైన చర్య లు తప్పవని హెచ్చరించారు.

### విద్యార్థులకు చట్టాలపై అవగాహన..

జిల్లాలోని వడ్యాల్,కనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో భరోసాషీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా గుడ్ టచ్బ్యాడ్ టచ్ మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూనే ,పోక్సో చట్టం యొక్క తీవ్రతను విద్యార్థులకు వివరించారు.సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,నేరాలకు పాల్పడితే ఎదురయ్యే శిక్షల గురించి కేస్ స్టడీస్ ద్వారా వివరించారు.ఆపద సమయంలో డయల్ 100,చైల్డ్ హెల్ప్ లైన్ 1098,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నంబర్లను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.మహిళలు,విద్యార్థినులు ఎక్కడైనా వేధింపులకు గురైతే భయం వీడి పోలీసులను ఆశ్రయించాలని,బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతూ వారికి రక్షణ కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
01-02-2026
www.prajapaksham.in

హీరో శివాజీ, హీరోయిన్ లయ జంటగా నటిస్తున్న చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 12న డైరెక్ట్ ఈటీవీ విన్ ఓటిటి వేదికగా ఈ సందర్భంగా మేకర్స్ డేట్ , సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు.

రీల్




## 'మై సౌత్ దివ' క్యాలెండర్ ఆవిష్కరించిన తారలు

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టైల్ ప్లాట్ఫామ్ మైసౌత్దివాతన ఎంతో ప్రతిష్టాత్మకమైన 9వ ఎడిషన్ 2026 క్యాలెండర్ను ఘనంగా ఆవిష్కరించింది. మీడియా9, భారతి సిమెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఫిల్మ్ నగర్లోని రామానాయుడు స్టూడియోస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ ప్రత్యేక క్యాలెండర్‌లో దక్షిణాది సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటీమణులు శ్రియా శరణ్, అనన్య నాగళ్ల, రియా సచ్ దేవా, ఉల్క గుప్తా, పాలక్ అగర్వాల్, మనస్వి మంగై, చాంద్నీ కటారియా, సాక్షి మ్హాడోల్కర్, సిమ్రత్ కౌర్, గెహ్నా సిప్పీ, రియా సుమన్, ఐశ్వర్య సాల్వి తదితరులను 12 నెలలకు గాను 12 మంది నటీమణులను ప్రచురించారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ నటీమణులు గెహ్నా సిప్పీ, రియా సచ్ దేవా, ఐశ్వర్య సాల్వి, ఉల్క గుప్తా, భారతి సిమెంట్స్ డీఎం రవీంద్ర రెడ్డి, సినీ నిర్మాతలు రమేష్ పుప్పాల, శ్యాంసుందర్ నేతి, మీడియా9 డైరెక్టర్ మనోజ్ కుమార్ హాజరయ్యారు.

## 'స్కై' ఫీల్ గుడ్ లవ్ స్టోరీ

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు.



'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'స్కై' సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ప్రముఖ దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ మీద ప్యాషన్ తో చిన్న స్థాయి నుంచి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎదిగాను. ఈ చిత్రానికి వర్క్ చేసే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల కి థ్యాంక్స్. ఆయన ఇచ్చిన సపోర్ట్ వల్లే ఈ సినిమాకు మంచి మ్యూజిక్ చేయగలిగాను. పాటలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. అన్నారు.నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చే ముందు 'స్కై' సినిమా కంటెంట్, సాంగ్స్ చూశాను. ఆ కంటెంట్ చూస్తుంటే ఈ మూవీలో ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీ చూడ బోతున్నా మని తెలుస్తోంది. సాంగ్స్ చాలా బాగున్నాయి. రసూల్ ఎల్లోర్ విజువల్స్ బ్యూటిఫుల్ గా ఉన్నాయి. ఈ సినిమాకు పెట్టిన క్యాప్షన్ తోనే మూవీ ఎస్సెన్స్ తెలుస్తోంది. 'స్కై' సినిమా మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు.ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ . 'స్కై' సినిమాను మేమంతా ఎంతో కష్టపడి ప్రొడ్యూస్ చేశాం. టీమ్ అందరూ ప్యాషనేట్ గా వర్క్ చేశారు. హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఉన్న ఒక కొత్త ప్రేమ కథను మా మూవీలో మీరంతా చూడబోతున్నారు. ఫిబ్రవరి 6న సినిమాను రిలీజ్ చేస్తున్నాం. అన్నారు.డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల మాట్లాడుతూ 'స్కై' సినిమా షూటింగ్ కు ముందే అన్ని సాంగ్స్ రెడీ చేసి పెట్టుకున్నాం. డీవోపీ రసూల్ ఇచ్చిన సజెషన్స్ తో సినిమాను అనుకున్న టైమ్ లో కంఫర్ట్ గా కంప్లీట్ చేయగలిగాం. ఆయన గైడెన్స్ మాకు చాలా ఉపయోగపడింది అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో మురళీ కృష్ణంరాజు, నటి కేవీఎల్ కే మణి బామ్మ, హీరోయిన్ శృతి శెట్టి, డీవోపీ రసూల్ ఎల్లోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ సంక్రాంతి ఏడు తరాలు గుర్తుండిపోద్ది

భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియో లో విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాత, టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇంతటి అద్భుతమైన చిత్రంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఈ వేడుకలో జ్ఞాపికలను అందజేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పంపిణీదారులకు జ్ఞాపికలను అందించడం జరిగింది.ప్రముఖ నిర్మాత, టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ గత సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో, ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'తో విజయాలు అందుకున్న మీనాక్షికి



కంగ్రాట్స్. ఈ సినిమాలో నవీన్ వన్ మ్యాన్ షో చేశాడు. విడుదలకు ముందు రోజు ఈ సినిమా చూసినప్పుడే, ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకం కలిగింది.. ఈ సినిమా ఇంతటి విజయం సాధించడానికి ప్రధాన కారణం నవీన్ అని ప్రతి ఒక్కరూ చెప్పడం సంతోషంగా ఉంది. సినిమా కోసం నవీన్ ప్రాణం పెడతాడు. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి ఉదాహరణ ఈ అనగనగా ఒక రాజు.' అన్నారు.ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ.. 'టైమ్ బాగుంటే హీరో అవుతారు అంటుంటారు. కానీ టైమింగ్ బాగుండి హీరో అయినవాడు నవీన్ పొలిశెట్టి. ఏడాది క్రితం నవీన్ కి పెద్ద యాక్సిడెంట్ అయ్యి, తీవ్ర గాయాలయ్యాయి. అప్పుడు కూడా నాతో మాట్లాడుతూ.. నాకు మంచి రచయితలు కావాలి, బ్లాక్ బస్టర్ సినిమా తీయాలి అంటున్నాడు. సినిమా అంటే అంత తపన తనకు. తన టీంతో కలిసి మంచి కథను రాసుకొని, ఇలాంటి విజయం సాధించడం అంటే మామూలు విషయం కాదు. సినిమా చూస్తున్నప్పుడు నాకేం అనిపించిందంటే.. ఒక్క ఫ్రేమ్ లో కూడా నవీన్ ఎనర్జీ వదలలేదు. ఆ ఎనర్జీ వెనుక తన కష్టం, కసి ఉన్నాయి అని అన్నారు.నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. 'మా సినిమాలో ఒక డైలాగ్ ఉంది. రాజు గారి పెళ్లి ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోద్దని. అలాగే ఈ సంక్రాంతి మా అందరికీ ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది. తెలుగు సినీ చరిత్రలోనే ఇది అరుదైన సంక్రాంతి. పెద్ద సినిమాలతో పాటు విడుదలై, మీ సినిమా నిలబడుతుందా అని ఎందరో సందేహం వ్యక్తం చేశారు. ఇంతటి పోటీలో కూడా మా సినిమా నిలబడి, ఘన విజయం సాధించిందంటే దానికి కారణం తెలుగు ప్రేక్షకులే. మీకు ఎంత కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువే అని చెప్పారు. కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. 'నాకు ఈ సంక్రాంతి మరింత ప్రత్యేకంగా మారింది. ప్రేక్షకులు మాపై ప్రేమను ఇలాగే కురిపించాలని కోరుకుంటున్నాను. మాకు ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులను, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సూర్యదేవర నాగ వంశీ,దర్శకుడు మారి, రచయిత్రి చిన్మయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.



డైరెక్టర్ వి.సముద్ర చేతుల మీదుగా

## '1+1 ఆఫర్' సినిమా ట్రైలర్ లాంచ్

నిమ్మల శ్రీరామ్, మౌనిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా '1+1 ఆఫర్'. ఈ చిత్రంలో రాజేష్ భూపతి, రోహిత్, బాలాజీ, సురేష్ కుమార్ యాదవ్, జీవన్, రామ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు .ఈ చిత్రాన్ని త్రివేణి పిక్చర్స్ బ్యానర్ పై వి.వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు .ఏఎస్ఆర్ (శ్రీరామ్) దర్శకత్వం వహించారు. సరికొత్త కథా కథనాలతో కంటెంట్ ఓరియెంటెడ్ మూవీగా రూపొందిన '1+1 ఆఫర్' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో దర్శకుడు వి. సముద్ర, నటుడు 30 ఇయర్స్ పృథ్వీ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలన్ రాజేష్ మాట్లాడుతూ '1+1 ఆఫర్' చిత్ర ట్రైలర్ లాంఛ్ చేసేందుకు వచ్చిన సముద్ర కి, పృథ్వీ కి థ్యాంక్స్. ఒక కొత్త కాన్సెప్ట్ తో ఈ సినిమాను రూపొందించారు మా డైరెక్టర్ శ్రీరామ్. కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఎంజాయ్ చేస్తూనే ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులు ఈ సినిమాలో చూడబోతున్నారు. అన్నారు.హీరోయిన్ మౌనిక మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో నటిగా నా పర్ఫార్మెన్స్ కు పేరొస్తుందని నమ్ముతున్నాను అన్నారు.దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ '1+1 ఆఫర్' ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాతో వన్ ప్లస్ హండ్రెడ్ అనేలా దర్శకుడు శ్రీరామ్ వంద సినిమాలు చేయాలి. విలన్ రాజేష్ ను చూస్తుంటే మన విలన్ అజయ్ లా కనిపిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ అందరికీ నచ్చేలా సినిమా చేసినట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. కంటెంట్ ఉంటే చిన్న సినిమాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఈ సినిమాను కూడా ప్రేక్షకులు సక్సెస్ చేస్తారు. అన్నారు.ఈ కార్యక్రమంలో దర్శకుడు ఏఎస్ఆర్( శ్రీరామ్), నిర్మాత వేణు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## 'అమరావతికి ఆహ్వానం' అంటున్న ఎస్తేర్

శివ కంఠమనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా 'అమరావతికి ఆహ్వానం'. ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేన్న కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ ను ప్రఖ్యాత నిర్మాత నటులు మురళీ మోహన్ గారు రిలీజ్ చేశారు. 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోప్రముఖ నటులు నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ



కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది. ఈ నిర్మాతలు గతంలో కూడా చిన్న బడ్జెట్ లో మంచి చిత్రాలు చేశారు. మా గురువు గారు దాసరి గారు చెప్పినట్లు చిన్న చిత్రాలే ఇండస్ట్రీకి ప్రాణం. కొత్త దర్శకుడిగైనా జీవీకే ప్రతి భావంతంగా సినిమాను చక్కగా తెరకెక్కించారు. టీజర్ తోనే భయం కలిగించారని అన్నారు.ప్రొడ్యూసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "మాకు సినిమా ఇండస్ట్రీతో 30 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. సినిమాలు చేయాలంటే డబ్బులు కావాలని రియల్ ఎస్టేట్ మార్గాన్ని ఎంచుకున్నాం.




## తెలుగు, తమిళంలో 'కపుల్ ఫ్రెండ్లీ'

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.ఈ సినిమాను ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ధీరజ్ మొగిలినేని 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను కూడా తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, 'నాలో నేను..', 'గాబరా గాబరా..' లిరికల్ సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ లభించింది.

## కాల్పులు (మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. కాల్పుల్లో వ్యాపారి కాలుకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోధ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాల్పులకు తెగబడిన అంగతకులు బాధితుడి ద్విచక్ర వాహనంపైనే పరారయ్యారు. విషయం తెలియగానే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనరేట్లను అప్రమత్తం చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లిలోని జనతా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కేరళ వాసి అబ్దుల్ రషీద్ (26) స్థానికంగా రెడిమెంట్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ప్రతిసారి మాదిరిగానే శనివారం ఉదయం 7 గంటలకు తన ద్విచక్ర వాహనంపై కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఎటిఎం సెంటర్‌లో డబ్బులు జమ చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో వెనకాల నుంచి వచ్చిన ఇద్దరు అంగతకులు అతన్ని కొట్టి క్యాష్ బ్యాగ్‌ను లాక్కునేందుకు విఫలయత్నం చేశారు. దీంతో అంగతకులు వ్యాపారిపై కాల్పులు జరిపి రూ.6 లక్షల నగదు కలిగిన బ్యాగ్‌ను లాక్కుని, బాధితుడి ద్విచక్ర వాహనం (టిఎస్08హెచ్ఎన్ 8582) పై అక్కడి నుంచి పారిపోయారు. కాలికి బుల్లెట్ గాయమైన సదరు వ్యాపారిని చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రికి పోలీసులు తరలించారు. సమాచారం అందుకున్న ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి ఘటనా స్థలానికి చేరుకుని ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఘటనపై కేసు నమోదు చేశాసిన పోలీసులు అగంతకులను పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. దీంతో పాటు చుట్టుపక్కల జిల్లాల పోలీసులను అప్రమత్తం చేశారు. దుండగులు చాదర్‌ఘాట్ సిగ్నల్ మీదుగా కాచిగూడ నింబోలియడ్డ ప్రాంతానికి చేరుకుని అక్కడ వాహనాన్ని వదిలేసి, దుస్తులు మార్చుకుని కాచిగూడ ఎక్స్ రోడ్స్ వైపు కాలినడకన పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అనుమానాస్పద సమాచారం ఉన్నవారు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు కమిషన్ విసి సజ్జనార్ తెలిపారు.

## ఆర్టీఐ చట్టాన్ని నీరుగార్చొద్దు

ప్రధాని మోదీకి ఎంపి సందోశ్ కుమార్ లేఖ



**న్యూఢిల్లీ:** సమాచార హక్కు చట్టం 2005 గురించి ఆర్థిక సర్వే 2025–26 వైఖరిని సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. యూపీఏ1 హయాంలో వామపక్షాల నిర్ణయాత్మక మద్దతులో ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. వ్యవస్థాగత పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధ జవాబుదారీతనానికి హామీనిచ్చే విధంగా చారిత్రక చట్టం తెచ్చినట్లు వెల్లడించింది. పౌరులను సాధికారులుగా చేయడం, అవినీతిని అంతమొందించడమే కాకుండా పరిపాలనా వ్యవహారాలపై ప్రజా పరిశీలనకు అవకాశం కల్పిస్తూ రాజకీయ స్పృహతో 'ఆర్టీఐ' ఆచరణలోకి వచ్చిందని తెలిపారు. దీనిని నీరుగార్చే ఏ రకమైన ప్రయత్నం జరిగినా అది రాజ్యాంగబద్ధ పరిపాలనా స్ఫూర్తిపై ప్రత్యక్ష దాడే అవుతుందని సందోశ్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీఐ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నీరుగార్చవద్దని కోరుతూ ఆయన శనివారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. ఆర్టీఐ చట్టాన్ని పున:పరిశీలించాలన్న సిఫార్సును సంతోశ్‌కుమార్ తప్పుపట్టారు. ఆర్థిక సర్వే సిఫార్సుతో పరిపాలన సామర్థ్యం ముసుగులో తప్పును సమర్థించే... అవినీతిని చట్టబద్ధం చేసే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. దశాబ్ద కాలంలో ఆర్టీఐ కార్యాచరణ సంస్థాగతంగా బలహీనమైందన్నారు. 2019లో జరిగిన సవరణలతో సమాచార కమిషన్ల స్వయంప్రతిపత్తి దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. సమాచార కమిషనర్ల పదవీ కాలం, సర్వీస్ షరతులపై కేంద్రమే నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో జర్నలిస్టులు, ఆర్టీఐ కార్యకర్తలు, విజిల్ బ్లోయర్లు అవమానాలు, బెదిరింపులను, దాడులను ఎదుర్కొంటున్నారని, అవినీతిఅక్రమాల గుట్టు రట్టు చేసేవారికి సముచిత భద్రతే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సర్వే అనుసరిస్తున్న పద్ధతి విద్యాపరమైనది కాకుండా రాజకీయ పరిణామాలకు దారితీసేదిగా ఉన్నట్లు సందోశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆర్టీఐ చట్టాన్ని మరింత నీరుగారిస్తే విపత్తుకరంగా పరిణమిస్తుందని... ప్రజాస్వామ్యబద్ధ జవాబుదారీతనం ఉండదని, ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతారని హెచ్చరించారు. ఆర్థిక సర్వే నుంచి ఆర్టీఐకు సంబంధించిన అంశాలను తొలగించాలని, ఈ వైఖరిని మార్చుకోవాలని ప్రధాని మోదీని తన లేఖలో సందోశ్ కుమార్ కోరారు. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల సమాచార హక్కు విషయంలో తమ నిబద్ధతను సర్కారు స్పష్టం చేయడం ఎంతైనా అవసరమని సూచించారు.

**పీటీ ఉషకు పరామర్శ:** రాజ్యసభ ఎంపి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ క్రీడాకారిణి పీటీ ఉష భర్త వి.శ్రీనివాసన్ శుక్రవారం మరణించారు. దీంతో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ శనివారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

## కళను ఉద్యమంగా మార్చిన మహానుభావుడు

గద్దర్ జయంతి ఉత్సవాల్లో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళను ఉద్యమంగా మార్చిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గద్దర్ పాటలు వినోదం కోసం కాదు, చైతన్యం కోసమని, అవి ప్రజలను ఆలోచింపజేయడంతో పాటు పోరాటాలకు ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ 78వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు గద్దర్ వెన్నెల, ఎనుగు నర్సింహారెడ్డి, జె.బి.రాజ్, శాంతాసిన్హా, ప్రొఫెసర్ కాసీం, జయరాజ్, సూర్యం, ఏపూరి సోమన్న, పృథ్వీరాజ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గద్దర్ చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గద్దర్ జయంతి పురస్కరించుకొని ఆయన రచించిన 'సిరిమల్లె' అనే పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ ప్రజల గుండెల్లో నివసించిన నాయకుడు అని, ఆయన మాట కాదు పాట అని, ఆయుధం కాదు గానమనీ, పీడితుల బాధను తన స్వరంగా మార్చి సమాజాన్ని కదిలించిన విప్లవ కవి అని కొనియాడారు. సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే.నారాయణ మాట్లాడుతూ అణచివేతకు ఎదురు నిలిచిన ధైర్యవంతుడు గద్దర్ అని, భయాన్ని జయించి, అన్యాయాన్ని ప్రశ్నించడంతో పాటు ప్రజల పక్షాన నిలిచిన అసలైన ప్రజా యోధుడు అని చెప్పారు. ఎంఎల్‌సి, ప్రొఫెసర్ కొదండరాం మాట్లాడుతూ తన జీవితం మొత్తం ప్రజల కోసమే అర్పించిన నాయకుడు గద్దర్, ఆయన జీవితం ఒక సందేశం, ప్రజలే శక్తి, ప్రజలే చరిత్ర అని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. గద్దర్ కుమారుడు సూర్యం మాట్లాడుతూ గద్దర్ కల్చరల్ అండ్ మెమోరియల్ సెంటర్ కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని, తదుపరి భూమి కేటాయిస్తే నిర్మాణాన్ని చేపడతామని కోరారు. గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ గద్దర్ అనగానే ప్రజల గుండెల్లో ఒక ధైర్యం వస్తుందని, ప్రాణత్యాగం చేసే తెగింపు వస్తుందని చెప్పారు. ఎప్పటివరకు అయితే అణచివేత, దోపిడీ ఉంటుందో అప్పటివరకు గద్దరన్న పాట యుద్ధం చేస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు ఆలపించిన గద్దర్ గేయాలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది.



## కుప్పకూలిన గని

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఇప్పటికీ ఇంకా చాలామంది చరియలు కుప్పకూలడంవల్ల వచ్చిన బురదలో కూరుకుపోయి ఉన్నారని తెలిపారు. ఈ ఘటన తర్వాత గనుల తవ్వకం కార్యకలాపాలను గవర్నర్ నిలిపివేశారు. ఈ ప్రాంతంలో శిబిరాల్లో ఉన్నవారిని ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఈ గనులను గతంలో తవ్విన నిర్వాహకుడు అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధులతో మాట్లాడుతూ, రుబయాలో పదే పదే చరియలు, గనుల అంచులు విరిడి పడుతూ ఉంటాయన్నారు. టన్నెల్స్‌ను కార్మికులు యంత్రాలతో కాకుండా చేతులతో తవ్వుతున్నారన్నారు. ఈ సొరంగం నిర్మాణాల్లో నాణ్యత లేదని చెప్పారు. ఎలాంటి రక్షణలు, ప్రణాళిక లేకుండా ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ గనుల్లో అత్యంత విలువైన అరుదైన ఖనిజాలు లభ్యం అవుతాయి. ఒక చరియ విరిగి పడితే గనుల తవ్వకంలో ఉన్న అనేకమందికి నష్టం జరుగుతుందని చెప్పారు. తూర్పు కాంగోలోని కీలకమైన ప్రాంతంలో రుబయా గనులు ఉన్నాయి. అనేక దశాబ్దాలుగా ఈ ప్రాంతం హింసతో అట్టుడికిపోతోంది. కాంగోలో అత్యంత సంపదను సృష్టించగల గనులు ఇవే. రువాండా మద్దతు గల ఎం–23 తిరుగుబాటు దారులు కూడా ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ అరుదైన కాల్టన్ ఖనిజాలను కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ల తయారీలో ఉపయోగిస్తారు. 2023లో కాంగో ప్రపంచంలోనే ఎక్కువగా 40శాతం కాల్టన్‌ను ఉత్పత్తి చేసింది. 2024 లో ఎం–23 తిరుగుబాటు ఉగ్రవాదులు ఈ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నారు. గనులను తమ అధీనంలోకి తెచ్చున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది. కాల్టన్ ఎగుమతులపై ఉగ్రవాదులే పన్నులు విధిస్తునానరు. నెలకు కనీసం 8,00,000 డాలర్లు వారు ఈ గనుల ద్వారా సంపాదిస్తున్నారు.అనేక దశాబ్దాలుగా తూర్పు కాంగో సంక్షోభంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద మానవతావాద సంక్షోభం కాంగోలో నెలకున్నది. ఈ ప్రాంతంలో 70 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఈ ఏడాదిలోనే లక్షమంది నిరాశ్రయులయ్యారు.

## రేపు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొని జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి అవార్డును ప్రదానం చేస్తారని వారు వివరించారు. ఈ సందర్భంగా ''భారత రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛ'' అనే అంశంపై స్మారకోపన్యాసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి చేస్తారని తెలిపారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు అవార్డుకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం భుక్తి కోసమే కాకుండా 200 ఏళ్లకు పైగా సాగిన నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సాగిన మహోత్తర పోరాటమని తెలిపారు. ఈ పోరాటం ఫలితగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌దేశంలో విలీనమైందన్నారు. ఆనాటి పోరాట యోధుల త్యాగాలను భావి తరాలకు అందించడమే లక్ష్యంగా రావి నారాయణరెడ్డి తెలంగాణ అమర వీరుల ట్రస్ట్‌కు అంకురార్పణ చేశారన్నారు. ఆయన మరణం అనంతరం ఆ అశయాలను కొనసాగించడమే లక్ష్యంగా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో 1999లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ స్మారకోపన్యాలు నిర్వహించడంతో పాటు రావి నారాయణరెడ్డి పేరుతో జాతీయ ఆవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇందులో భాగంగా 2000 సంవత్సరం నుంచి దేశంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి అవార్డును ట్రస్ట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఆర్థిక రంగ నిపుణులు బందోపాధ్యాయ, సిహెచ్.హనుమంతరావు, కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా, కేంద్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి చతురానన్ మిశ్రా, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శులు ఎ.బి.బర్ధన్, సురవరం సుధాకర్‌రెడ్డి, ప్రముఖ దర్శకులు శ్యామ్ బెనగల్ లాంటి ప్రముఖులకు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డును ప్రదానం చేశామని చెప్పారు. ఆ తర్వాత జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమం, కరోనా సమయంలో ఈ అవార్డులను ఇవ్వలేకపోయామని, తిరిగి 2026లో ఈ అవార్డును పునరుద్దరించామని చెప్పారు.

## వనప్రవేశం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా చేసిన ప్రకటనలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగానే మిగిలాయి. కోట్లాది రూపాయల ఖర్చు, హైటెక్ హంగులు, ఏఐ (ఏఐ) నిఘా అంటూ గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వ యంత్రాంగం.. ట్రాఫిక్ నియంత్రణలో ఘోరంగా విఫలమై చేతులెత్తేసింది. గంటల కొద్దీ చక్రబంధం.. నరకప్రాయం ప్రయాణంగా మారింది. మేడారం వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయి భారీ నరకాన్ని తలపిస్తున్నాయి. పస్రా నుంచి మేడారం చేరుకోవడానికి భక్తులకు ఏకంగా 10 గంటల సమయం పడుతుండటం అధికారుల వైఫల్యానికి పరాకాష్ట. పస్రా తాడ్వాయి మధ్య ఈ స్వల్ప దూరానికే 4 గంటల సమయం పడుతోంది. తాడ్వాయి మేడారం మధ్య మరో 4 గంటల పాటు వాహనాలు అంగుళం కూడా కదలని పరిస్థితి. మేడారం నుంచి హనుమకొండ చేరుకోవడానికి 11 గంటల సమయం పట్టింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు మేడారం నుంచి బయలుదేరిన భక్తులు శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు హనుమకొండలో దిగారు. చిన్నారులు, వృద్ధులు ఆకలి దప్పులతో వాహనాల్లోనే అలమటిస్తుంటే, పోలీస్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఏఐ అంటే అంతే సంగతులా?

ఈసారి జాతరలో ట్రాఫిక్ కష్టాలు ఉండవని, ఆధునిక సాంకేతికత మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యవేక్షిస్తున్నామని చెప్పిన మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్లు ఉన్నా.. ఎక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందో పసిగట్టి క్లియర్ చేయడంలో పోలీస్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.

### రోడ్లపై రద్దీ.. క్యూలైన్లలో ఖాళీ!

విచిత్రమేమిటంటే, ఒకవైపు కిలోమీటర్ల మేర రోడ్లపై భక్తులు చిక్కుకుపోగా, మేడారంలో క్యూలైన్లు మాత్రం వెలవెలబోతున్నాయి. భక్తులు గమ్యస్థానానికి చేరుకోలేక అడవి బాటలోనే ఆగిపోవడంతో గద్దెల వద్ద రద్దీ తగ్గింది. యంత్రాంగం మధ్య సమన్వయ లోపం భక్తుల పాలిట శాపంగా మారింది.

### నిట్టూరుస్తున్న భక్తులు

'మేము మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చామా లేక రోడ్లపై శిక్ష అనుభవించడానికి వచ్చామా?' అంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ట్రాఫిక్ క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com